అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 28-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 267 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల: 6.50

ఈషా బంగారం

హైదరాబాద్ అమ్మాయికి రెండు పతకాలు

- రైఫిల్-3 పొజిషన్, 25మీ. పిస్టోల్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణాలు






సిఫ్ట్ కౌర్ సింగ్ ప్రపంచ రికార్డు

చైనాలో జరుగుతున్న ఆసియా గేమ్స్-2023 పోటీల్లో 19వ ఆసియా క్రీడల్లో నాల్గోరోజు భారత షూటర్లు అదరగొట్టారు. మహిళల 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ శర్మ ప్రపంచ రికార్డును నమోదు చేసింది. తెలంగాణ బిడ్డ, హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్ షూటింగ్‌లో సత్తా చాటింది. మహిళల 25మీ. పిస్టోల్ విభాగంలో స్వర్ణం కైవసం చేసుకోగా.. వ్యక్తిగత 25మీటర్ల పిస్టోల్ విభాగంలో రజత పతకాన్ని ఒడిసిపట్టుకుంది. వివరాలు 6లో..

సంక్షోభంలో సంక్షేమం

కీలక రంగాలకు మొండిచేయి



ప్రజలు గౌరవప్రదమైన జీవితం గడిపేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పని చేసే హక్కు ఆహారం-పౌష్టికాహారం పొందే హక్కు విద్యా హక్కు, సామాజిక భద్రతా హక్కు... ఇవన్నీ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు. వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత పాలకులదే. అయితే ఇప్పుడు ప్రజలు తమ కనీస అవసరాల కోసమూ పోరాడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

- సామాజిక భద్రతపై చిన్నచూపు
- బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తున్న మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : పెట్టుబడుల ఉపసంహరణ, ప్రభుత్వ ఆస్తుల విక్రయంపై 2021లో మాట్లాడినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ ఓ మాట చెప్పారు. వ్యాపారం చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధే దాని లక్ష్యమన్నారు. అయితే ఆయన మాటలకు, చేతలకు పొంతనే ఉండదని గడచిన పది సంవత్సరాల బీజేపీ పాలన నిరూపిస్తోంది. సంక్షేమానికి నిధుల కేటాయింపును కుదించడం, పలు పథకాలు, కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయడం వల్ల గత పది సంవత్సరాలలో ప్రజా సంక్షేమం పడకేసింది.

2014-15 తర్వాత కేంద్ర బడ్జెట్ వ్యయం 150.88శాతం పెరిగింది. కానీ సామాజిక భద్రతా పథకాలకు చేసిన బడ్జెట్ కేటాయింపులు మాత్రం తగ్గుతూ వస్తున్నాయి. కోవిడ్ ముందు కాలంతో పోలిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పద్దుల కింద కేటాయింపులు మరింతగా తగ్గిపోయాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ), జాతీయ ఆహార భద్రతా చట్టం కింద చేపట్టిన సామాజిక సాయం కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ), జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) వంటి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. అంతకుముందు సంవత్సరంలో సవరించిన అంచనాలతో పోలిస్తే సామాజిక భద్రతా కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో అవసరాలకు, కేటాయింపులకు మధ్య పెద్ద ఎత్తున వ్యత్యాసం కన్పించింది.

ఉపాధి హామీకి తూట్లు... సామాజిక సాయం హుళక్కి

ఉపాధి హామీ పథకాన్నే తీసుకుంటే బడ్జెట్‌లో దాని వాటా 1.85శాతం (2014-15) నుంచి 1.33శాతానికి (2023-24) తగ్గింది. ఈ పథకానికి ఇంత తక్కువ కేటాయింపులు జరపడం ఇదే మొదటిసారి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీనికి 60 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది గత సంవత్సరపు సవరించిన అంచనాలతో పోలిస్తే 33శాతం తక్కువ. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే జీడీపీలో కనీసం 1.6% అయినా కేటాయించాలని ప్రపంచబ్యాంక్ చెబుతోంది. అయితే ప్రస్తుత కేటాయింపు కేవలం 0.198శాతం మాత్రమే. పైగా బడ్జెట్ కేటాయింపులో ఎక్కువ భాగాన్ని ...2లో

> జీ-20 సదస్సు సందర్భంగా రాజధాని సుందరీకరణ కోసం మోడీ ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కానీ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఇవ్వాల్సిన రూ.6,366 కోట్ల బకాయి అలాగే ఉండిపోయింది. మోడీ ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవడానికి ఇంతకంటే ఉదాహరణ మరేముంటుంది?

టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

పేపర్-1లో 36.89 శాతం, పేపర్-2లో 15.30 శాతం అర్హత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు బుధవారం ఉదయం పది గంటలకు విడుదలయ్యాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15న టెట్ 1,139 కేంద్రాల్లో పేపర్-1, 913 పరీక్షా కేంద్రాల్లో పేపర్-2 రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠి, తమిళం, సంస్కృతం భాషల్లో పరీక్షలు జరిగాయని వివరించారు. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,23,582 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,90,047 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 29,073 (15.30 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారని వివరించారు. ఇందులో మ్యాథ్స్, సైన్స్ విభాగానికి 1,01,134 మంది హాజరుకాగా, 18,874 (18.66 శాతం) మంది పాసయ్యారని పేర్కొన్నారు. సోషల్ స్టడీస్ విభాగానికి ...13లో



ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

కల్లుగీత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కల్లుగీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వారు తాళ్ల ఎక్కే క్రమంలో ...13లో

బిల్లులను తొక్కిపెడుతున్న గవర్నర్

కేరళ ముఖ్యమంత్రి విజయన్ ఆందోళన



- సుప్రీంకు వెళ్తామని వెల్లడి

తిరువనంతపురం: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 8 బిల్లులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ఆమోదానికి పంపి, చాలా కాలం అయినా ఇంతవరకు వాటిపై సంతకం చేయలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల ...13లో

బీఆర్ఎస్‌కు 25 సీట్లు దాటవు

బీజేపీ, ఎంఐఎంలకు సింగిల్ డిజిటే..

- త్వరలో కాంగ్రెస్ బస్సు యాత్ర
- వైఎస్ షర్మిల చేరికపై సమాచారం లేదు
- మైనంపల్లికి రెండు టికెట్లు
- త్వరలో వేముల వీరేశం చేరుతారు : ఇష్టాగోష్టిలో రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సర్వేల ప్రకారం వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 25 సీట్లు దాటవని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలు సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతున్నాయన్నారు. విజయభేరి సభతో సీఎం కేసీఆర్‌కు చలిజ్వరం వచ్చిందన్నారు. ప్రగతిభవన్‌ను ఖాళీచేయాల్సి వస్తుందోనన్న భయం మాత్రం కేసీఆర్‌లో మొదలైందని చెప్పారు. తొమ్మిదేండ్ల ...13లో

నిమజ్జనంపై పోలీసుల డేగ కన్ను

హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో సర్వం సిద్ధం

- 31వేల సిబ్బందితో భద్రత
- గణేష్ ఊరేగింపుపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధమైంది. నిమజ్జన ప్రక్రియ తుది దశకు చేరుకోవడం, మిలాద్ ఉన్ నబీ పర్వదినోత్సవం నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. గురువారం బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు వినాయకుని శోభాయాత్ర కొనసాగనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా నగరానికి చేరుకునే అవకాశముంది. ఈ క్రమంలో హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసేవిధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 25,694 మంది పోలీసులతోపాటు 125 ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. రాచకొండ పోలీస్



కమిషనరేట్ పరిధిలో 6000 మంది పోలీసులు, అదనంగా మరో 1000 మంది సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గణేష్ విగ్రహాలను తీసుకెళ్లే రహదారులతోపాటు ఘాట్ల వద్ద అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మహిళల భద్రత, ఆకతాయిల ఆటకట్టించేందుకు ...13లో

అక్టోబర్ 28న సింగరేణి ఎన్నికలు

6,7 తేదీల్లో నామినేషన్ల దాఖలు, 9న ఉపసంహరణ

- 10న స్క్రూట్నీ, గుర్తుల కేటాయింపు
- ఓటింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు
- ఫలించని యాజమాన్యం ఎత్తుగడలు
- కార్మిక సంఘాల మధ్య చిచ్చుకు యత్నం

వివరాలు 2లో..

గ్రూప్ 1పై అప్పీల్ డిస్మిస్

సర్వీస్ కమిషన్‌కు చుక్కెదురు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేపర్ లీకేజీ తర్వాత కూడా గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఎగ్జామ్‌ను సమర్థంగా నిర్వహించలేకపోయారని సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు తప్పుపట్టింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను సింగిల్ జడ్జి రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును బెంచ్ సమర్థించింది. పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో టీఎస్పీఎస్సీ విఫలమైందని చెప్పింది. ఆ తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. కమిషన్ వ్యవహార తీరు ఫలితంగా లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్ ఆయోమయంగా మారుతోందని అభిప్రాయపడింది. ఒకసారి లీకేజీ అయ్యాక రెండోసారి పరీక్షలను నోటిఫికేషన్ రూల్స్‌కు అనుగుణంగా చేయలేకపోయిందని ఆక్షేపించింది. కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌లోని నిబంధనలు కమిషనే అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. తొలిసారి గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన పరీక్షలకు బయోమెట్రిక్ అమలు చేసినప్పుడు లేని సమస్యలు రెండోసారి పరీక్షల నిర్వహణలో ఎందుకు వచ్చాయని తీర్పులో ప్రశ్నించింది. బయోమెట్రిక్ తీసుకోకపోవడానికి కారణాలను కమిషన్ ...13లో



180 కుటుంబాలు సీపీఐ(ఎం)లోకి

సొంతింటికి వచ్చినంత ఆనందంగా ఉందన్న పూసుగుప్ప ప్రజలు

- పార్టీలోకి ఆహ్వానించిన పోతినేని సుదర్శన్

వివరాలు 2లో..

పింఛనేది బాంచన్..?

నెలాఖరు వచ్చినా అందని ఆసరా

ఒక్క నెలా సమయానికి వచ్చింది లేదు..



- ఏడాదిలో ఒకటి, రెండు నెలలు ఎగవేత
- రాష్ట్రంలో పది రకాల పెన్షన్‌లు.. 44 లక్షల మంది లబ్దిదారులు
- రూ.4వేల కాంగ్రెస్ పింఛన్‌పై మొదలైన చర్చ
- పాలకులు ఎవరైనా ఫస్ట్ తారీఖు పింఛన్ కోసం డిమాండ్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలేవైనా ఆరంభశూరత్వమే కనిపిస్తోందని విమర్శకులంటున్నారు. మొదట్లో హడావుడి చేయడం.. ఆ తర్వాత ఆ స్కీంను గాలికొదిలేయడం ఆనవాయితీగా మారిందనే విమర్శలున్నాయి. అది రైతుబంధైనా.. దళితబంధైనా.. రుణమాఫీ అయినా.. చివరకు 'ఆసరా' పింఛనైనా...అలసత్వమే చోటుచేసుకుంటుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పింఛన్ విషయంలో ఒకనెల 1వ తేదీన వేస్తే.. ఆ తర్వాత నెల 20, లేదంటే నెల చివరి రోజు వేయడం, ఒక్కోసారి రెండు నెలలదీ ఒకేసారి వేయడం, నిర్దిష్టత లేని తేదీల్లో వేస్తూ.. గందరగోళానికి గురిచేస్తూ మధ్యలో ఒకటి, రెండు నెలలు మిస్ చేస్తున్నారని లబ్దిదారులు వాపోతున్నారు. ఖమ్మం జిల్లాలో వికలాంగులు మినహా మిగిలిన వారికి సెప్టెంబర్ ముగింపునకు వచ్చినా ఇంకా పింఛన్ అందకపోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తీరు ఉన్నట్టు సమాచారం.

44 లక్షల మంది ఎదురుచూపు..

రాష్ట్రవ్యాప్తంగా 2014 అక్టోబర్ 1 నుంచి ఆసరా పింఛన్ పథకం ప్రారంభమైంది. ప్రస్తుతం పది కేటగిరీల్లో 43,68,784 మందికి పింఛన్ అందుతుంది. 2023 జూన్ నాటికి కేటగిరీల వారీగా 15,81,630 మంది వృద్ధులు, 15,54,525 మంది వితంతువులు, వికలాంగులు 5,05,836, నేతకారులు 37,071, కల్లుగీత కార్మికులు 65,196, ఫైలేరియా బాధితులు 17,995, డయాలసిస్ రోగులు 4,337, హెచ్ఐవీ రోగులు 35,670, బీడీ కార్మికులు 4,24,292, ఒంటరి మహిళలు 1,42,252 మంది ఉన్నారు. వీరిలో వికలాంగులకు మొన్నటి వరకు రూ.3016 పింఛన్ రాగా కొద్దిరోజుల క్రితం దీనిని రూ.4016కు పెంచారు. మిగిలిన కేటగిరీల వారికి నెలకు రూ.2016 చొప్పున పింఛన్ లభిస్తోంది. 2013-14తో పోల్చుకుంటే 2021-22 నాటికి లబ్దిదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ...13లో

180 కుటుంబాలు సీపీఐ(ఎం)లో చేరిక

నవతెలంగాణ-చర్ల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప గ్రామానికి చెందిన 180 కుటుంబాల ప్రజలు సీపీఐ(ఎం)లో బుధవారం చేరారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ వుయిక రామకృష్ణ, తాటి కన్నారావు, సోడి జగపతి, గుండి చిన్నబి తదితర గ్రామ పెద్దల సమక్షంలో 180 కుటుంబాలకు చెందిన ప్రజలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పూసుగుప్ప జోన్ కన్వీనర్ దొడ్డి హరినాగ వర్మ అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడారు. గిరిజన ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్నది సీపీఐ(ఎం) మాత్రమేనని తెలిపారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే పోడు భూములకు పట్టాలు వచ్చాయని, రూ.200 కోట్ల పైచిలుకు తునికాకు బోనస్ సాధించామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన వనరులను కల్పించడంలో ప్రభుత్వాలు శ్రద్ధ వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూసుగుప్ప గ్రామానికి 150 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా తాలి పేరు ప్రాజెక్టుపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా పూసువాగుపై చెక్ డ్యాం నిర్మాణం చేపడితే మరొక 200 ఎకరాల వరకు సాగులోకి వస్తాయని, చుట్టూ సాగునీటి వనరులు ఉన్నప్పటికీ పాలకుల వివక్షత కారణంగా పూసుగుప్ప అభివృద్ధికి నోచుకోవటం లేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాల పైన తీవ్రమైన దాడి చేస్తోందని విమర్శించారు. 2020 నూతన అటవీ హక్కుల విధానం గిరిజన హక్కులకు గొడ్డలి పెట్టు లాంటిదని తెలిపారు. భూములు, అటవీ సంపద నుంచి గిరిజన జాతిని దూరం చేయటం కోసమే నూతన అటవీ విధానాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. పూసుగుప్ప గ్రామంలోని సమస్యలు పరిష్కారం కోసం అండగా ఉంటామని చెప్పారు. మొత్తంగా సొంత గూటికి చేరటం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) నిరంతరం కృషి చేస్తుందని, పూసుగుప్ప ప్రజలు సీపీఐ(ఎం) బిడ్డలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పూసుగుప్ప ప్రాంతంలో అమరజీవి వుయిక పాపారావు నాయకత్వంలో అనేక పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. సొంత ఇంటికి వచ్చినంత ఆనందంగా వుందన్న పుసగుప్ప ప్రజలు మాట్లాడుతూ చెప్పారు. అనంతరం పార్టీలో చేరిన వుయిక రామకృష్ణ, తాటి కన్నరావు మాట్లాడారు. సీపీఐ(ఎం) మా సొంత ఇల్లని, పార్టీలో తిరిగి చేరటం సొంత ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉందని చెప్పారు. సీపీఐ(ఎం)తో తమ గ్రామానికి ఉన్న బంధం తరతరాలు నాటిదని, ఈ బంధాన్ని విడదీయలేమని తెలిపారు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో కొద్ది కాలం పాటు పార్టీకి దూరమయ్యామని అన్నారు. పార్టీ జిల్లా డివిజన్, మండల నాయకుల చొరవతో తిరిగి సీపీఐ(ఎం)లో చేరినందుకు సంతోషిస్తున్నామని చెప్పారు. తొలుత పార్టీ నాయకులు వుయిక పాపారావు స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను పోతినేని సుదర్శన్ రావు ఆవిష్కరించారు. పాపారావు చిత్రపటానికి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మెన్ యలమంచి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, నియోజకవర్గం నాయకులు కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, పార్టీ చర్ల మండలం కార్యదర్శి కారం నరేష్, నాయకులు బి. రమేష్, సత్రం పల్లి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 28న సింగరేణి ఎన్నికలు

నవతెలంగాణ - సింగరేణి ప్రతినిధి



సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు అక్టోబర్ 28న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి.శ్రీనివాసులు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. 14 కార్మిక సంఘాల్లో 11 కార్మిక సంఘాల నాయకులు ఎన్నికలను వాయిదా వేయాలని లిఖితపూర్వకంగా ఎన్నికల అధికారిని కోరారు. ఏఐటీయూసీ, బీఎంఎస్ సంఘాల నాయకులు మాత్రం ఎన్నికలు నిర్వహించాలని అధికారుల ముందు గట్టిగా వాదించారు. ఈ క్రమంలో ముందుగా ఖరారు చేసుకున్న విధంగా జరగాల్సిన త్రైపాక్షిక సమావేశానికి సింగరేణి యాజమాన్యం, 11 కార్మిక సంఘాల నాయకులు హాజరు కాలేదు. ఏఐటీయూసీ, బీఎంఎస్ నాయకులు మాత్రమే హాజరయ్యారు. వీరితోనే కార్మికశాఖ అధికారి సమావేశమై అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. మెయిల్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేసిన 11 కార్మిక సంఘాల లేఖలను కూడా పరిశీలించిన అనంతరం ఎన్నికల నిర్వహణకే రిటర్నింగ్ ఆఫీసర్ మొగ్గు చూపారు. ఈ నెల 30 వరకు ఓటర్ జాబితా తయారు చేయాలని సింగరేణి యాజమాన్యానికి కార్మిక శాఖ అధికారి లిఖితపూర్వకంగా అందజేశారు.

అక్టోబర్ 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో నామినేషన్లు తీసుకోవచ్చని తెలిపారు. ఎనిమిదో తేదీన నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం కల్పించారు. 10న స్క్రూట్నీ చేసి, గుర్తులను కేటాయి స్తామని ఉత్తర్వులలో వివరించారు. ఓటింగు ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపడు తామని ఎన్నికల అధికారి వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగడానికి కార్మిక సంఘాల నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం సహకరించాలని రిటర్నింగ్ ఆఫీసర్ లేఖలో కోరారు. సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వ హణకు యాజమాన్యంతో పాటు మెజార్టీ కార్మిక సంఘాలు సుముఖంగా లేకపోయి నప్పటికీ కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్టు తెలుస్తోంది.

11 కార్మిక సంఘాలు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో యాజమాన్యంతో పలు అంశాలపై చర్చించాయి. సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికల అనంతరమే జరపాలని కోరుతూ ఆయా కార్మిక సంఘాల నాయకులు విడివిడిగా ప్రాంతీయ కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రాలు పంపగా.. వాటిని పరిగణలోకి తీసుకోలేదు. దీంతో సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియ కార్మిక సంఘాల మధ్య చిచ్చురాజేసినట్టు కనబడుతోంది. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలను కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌లో మార్పులు చేసిన అనంతరమే నిర్వహించాలని యాజమాన్యాన్ని ఉమ్మడిగా డిమాండ్ చేశారు. గెలిచిన సంఘం గుర్తింపు కాలపరిమితి రెండేండ్లు మాత్రమే ఉండాలని, కాంట్రాక్టు కార్మికులకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఏఐటీయూసీ, బీఎంఎస్ సంఘాలు మినహా మిగతా 12 కార్మిక సంఘాలు యాజమాన్యంతో చర్చించాయి. లాభాల వాటా చెల్లింపు సందర్భంగా కార్మికుల నుంచి చందాలు, సభ్యత్వం స్వీకరించే విధంగా కార్మిక సంఘాలకు అనువైన తేదీ ఖరారు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. వేర్వేరుగా జరిగిన సమావేశాలలో ఏఐటీయూసీ, బీఎంఎస్ నాయకులు వి.సీతారామయ్య, యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్, సీఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రియాజ్ అహ్మద్, రాజారెడ్డి, నరసింహారావు, జనప్రసాద్, నరసింహరెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు రాజిరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్టీయూ గని కార్మిక సంఘంతో పాటు పలు సంఘాలు పాల్గొన్నాయి.

ఎస్‌ఏ పదోన్నతికి టెట్ ఉత్తీర్ణత ఉండాలనడం విచారకరం

- తీర్పును పున:సమీక్షించాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పేపర్-2 ఉత్తీర్ణులైన వారికే స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటం విచారకరమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఆ తీర్పును పున్ణసమీక్షించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2010, ఆగస్టు 23కి ముందే సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించబడిందని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యక్ష నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేయబడిందని స్పష్టం చేశారు. అదే ఉద్దేశంతో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుడు ఎవరూ టెట్ రాయలేదని పేర్కొన్నారు. హఠాత్తుగా టెట్ ఉత్తీర్ణులైతేనే పదోన్నతి అనటం పదోన్నతుల కోసం ఎనిమిదేండ్లుగా ఎదురు చూస్తున్న సీనియర్ టీచర్లకు అశనిపాతమైందని తెలిపారు. పోస్టులకు సరిపడా అభ్యర్థులు కూడా లభ్యమయ్యే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం తీర్పుపై పున్ణసమీక్షకు అప్పీల్ చేయాలని వారు కోరారు.

సంక్షోభంలో సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్ వేతనాల చెల్లింపుల కోసం రాష్ట్రాలకు అందజేస్తున్నారు. ఇక ఎన్ఎస్ఏపీకి కేటాయింపులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వాస్తవానికి తగ్గాయి కూడా.

ఈ కార్యక్రమానికి 2014-15 బడ్జెట్‌లో 0.58% నిధులు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది 0.21శాతం మాత్రమే. 2007 నుండి జీవన వ్యయం పెరుగుతున్నప్పటికీ ఈ పథకం కింద వివిధ పద్దులకు అందజేస్తున్న సొమ్ములో మాత్రం మార్పు లేదు. ఉదాహరణకు ఈ పథకం కింద పెన్షన్‌దారులకు నెలకు రూ.200 నుండి రూ.300 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇది దేనికీ సరిపోదని పాలకులకు తెలియని విషయమేమీ కాదు. దేశంలోని సుమారు మూడు కోట్ల మంది ప్రజలకు అరకొర పెన్షన్ మాత్రమే లభిస్తోంది.

ఆహార సబ్సిడీకి నిధులేవి?

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, మహిళలు, పిల్లలకు ఆహార భద్రత కల్పిస్తూ పౌష్టికాహారం అందజేస్తోంది. మరి ఆహార సబ్సిడీ కోసం ప్రభుత్వం ఎంత కేటాయిస్తోందో తెలుసా? 2014-15లో బడ్జెట్‌లో 6.4శాతం కేటాయిస్తే 2023-24కు వచ్చేసరికి కేటాయింపు పెరగాల్సింది పోయి 4.38%కి తగ్గిపోయింది. దేశ ప్రజలలో ఆహార అభద్రతాభావం పెరుగుతోందని ప్రపంచ సూచికలు హెచ్చరిస్తున్నాయి. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలను రూ.89 వేల కోట్లకు తగ్గించింది. గత సంవత్సరపు సవరించిన అంచనాలు మాత్రం ఈ పద్దును రూ.2,87,642 కోట్లుగా చూపాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకానికి ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ఫలితంగా 81 కోట్ల మంది ప్రజల రేషన్ అంచనాలలో 50% తగ్గుదల కన్పించింది.

గర్భిణులు, పిల్లలకూ అరకొర నిధులే

మధ్యాహ్న భోజన పథకానికి (2021లో పేరు మార్చి పీఎం పోషణ్ అని పెట్టారు) ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది 0.25శాతం మాత్రమే. అంగన్‌వాడీ సేవలుగా పిలుస్తున్న సమీకృత బాలల అభివృద్ధి సేవలను (ఐసీడీఎస్) సాక్షమ్ అంగన్‌వాడీ-పోషణ్ 2.0లో విలీనం చేశారు. అయితే ఈ పథకాలకు బడ్జెట్ కేటాయింపులను మాత్రం కుదించారు. సాక్షమ్ అంగన్‌వాడీ-పోషణ్ 2.0కు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.20,544 కోట్లు కేటాయించగా ప్రత్యేకించి ఐసీడీసీకి రూ.18,691 కోట్లు ప్రతిపాదించారు. ఈ పథకాలన్నింటినీ కలిపేసినా బడ్జెట్‌లో కొద్ది మొత్తమే కేటాయించడం గమనార్హం. గర్భిణులకు అందించే సాయాన్ని కూడా కుదించారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకానికి ప్రారంభంలో కొంతమేర నిధులు సమకూర్చినప్పటికీ ఆ తర్వాత దానిని సమర్థ్య కార్యక్రమంలో కలిపేసి ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.2,582 కోట్లు మాత్రమే విదిల్చారు.

ఆరోగ్యం, విద్యకు అంతంతే

ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు పెంచినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుంటే వాస్తవంగా 2శాతం తగ్గాయి. ఆరోగ్య రంగానికి 2019-20 బడ్జెట్‌లో 2.46శాతం కేటాయించగా ప్రస్తుత సంవత్సరంలో అది 2.08శాతానికి తగ్గిపోయింది. కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసినప్పటికీ జాతీయ ఆరోగ్య మిషన్‌కు కేటాయింపులు తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీనికి కేటాయించింది 0.81శాతం. కేటాయింపులు తగ్గడంతో ప్రజలపై అధిక భాగం పడుతోంది. ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాలంటేనే సామాన్యులు భయపడే పరిస్థితి నెలకొంది. ఇక విద్యా రంగానికి కేటాయింపులను గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పాఠశాల విద్య, అక్షరాస్యత, ఉన్నత విద్యకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు 4.6% (2014-15) నుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.5%కి తగ్గిపోయాయి. జీడీపీలో ప్రస్తుత విద్యా బడ్జెట్ 2.9%గా ఉంది. 2986లో నిర్దేశించుకున్న 6% లక్ష్యానికి ఇది చాలా దూరంలో ఉండడం గమనార్హం. మరోవైపు దేశంలో పాఠశాలల సంఖ్య కూడా తగ్గిపోతోంది. 2020-21తో పోలిస్తే 21-22లో 20 వేలకు పైగా పాఠశాలలు మూతపడ్డాయి. బడి మానేస్తున్న విద్యార్థుల సంఖ్య అంతకంతకూ పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

సీఎం కేసీఆర్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



చైనాలో జరుగుతున్న ఆసియా గేమ్స్ -2023లో మహిళల 25 మీటర్ల పిస్టల్ టీం ఈవెంట్ (షూటింగ్)లో తెలంగాణ బిడ్డ ఈషా సింగ్ టీం స్వర్ణ పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈషా సింగ్ టీం 1759 పాయింట్లతో భారత్ కు గోల్డ్ మెడల్ సాధించి, టీమ్ స్పిరిట్‌ను చాటిందని సీఎం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివద్ధికి అమలు చేస్తున్న పటిష్ట కార్యాచరణే జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికల్లో తెలంగాణ క్రీడాకారులు కనబరుస్తున్న ప్రతిభకు నిదర్శనమని సీఎం అన్నారు. తెలంగాణ క్రీడాకారులు రానున్న రోజుల్లో మరెన్నో పతకాలు సాధించి, తెలంగాణ ఖ్యాతిని జగద్వితం చేయాలని సీఎం ఆకాంక్షించారు.

సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

'మిలాద్ ఉన్ నబీ' పండుగ (సెప్టెంబర్ 28)ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ ప్రపంచ శాంతి స్థాపన కోసం మహమ్మద్‌ను చివరి ప్రవక్తగా నియమించాడని ముస్లింలు భావిస్తారనీ, మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన శాంతి, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, ఐకమత్యం, సర్వ మానవ సమానత్వం ప్రపంచమంతా వెల్లివిరియాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీ ప్రజల సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలో గంగా జమున తహజీబ్ పరిరక్షణకు తమ కృషి కొనసాగుతూనే వుంటుందని సీఎం స్పష్టం చేశారు.

క్షేమంగా ఇండ్లకు వెళ్లండి

వినాయక చవితి పర్వదినం ప్రారంభం నుంచి వాడ వాడనా గణేష్ మండపాల ఏర్పాటు, పూజా కార్యక్రమాలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయని, ఈ సందర్భంగా దైవ ప్రార్థనలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసిందని ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర్ రావు అన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి హైదరాబాద్ సహా పలు ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని సీఎం తెలిపారు. వర్షాల నేపథ్యంలో తగు స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ, నిమజ్జనం కార్యక్రమంలో ఆనందోత్సాహాలతో పాల్గొని, క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకే రోజు రావడం దైవేచ్ఛ అని సీఎం అన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగలు జరుపుకుంటూ తెలంగాణ 'గంగా జమున తెహజీబ్' ను మరోసారి ప్రపంచానికి చాటాలని సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ నియమించాం

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్, ఐదుగురు సభ్యులను నియమించినట్టు రాష్ట్ర సర్కార్ హైకోర్టుకు చెప్పింది. ఆ పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ ఎస్. గణేష్ రావు, మరొకరు వేసిన పిల్స్‌ను మంగళవారం చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. ఆ పోస్టుల భర్తీ జరిగిందని ప్రభుత్వ ప్లీడర్ చెప్పడంతో పిల్‌ను విచారణను హైకోర్టు ముగించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే ఆధ్వర్యంలో బెంచ్ ఆదేశించింది.. ఎస్టీ కమిషన్‌ను విడిగా ఏర్పాటు చేయాలనే మరో పిల్‌ను కూడా బెంచ్ విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రానికి నోటీసులు ఇచ్చింది. తెలంగాణ లంబాడీ హక్కుల పోరాట సమితి నగరభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూక్యా దేవా నాయక్ దాఖలు చేసిన పిల్‌పై విచారణను వచ్చే నెల చివరికి వాయిదా వేసింది.

అంగన్‌వాడీ సమ్మెపై దమనకాండ ఆపాలి

సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలి : శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సమావేశంలో వక్తలు

- అంగన్‌వాడీల డిమాండ్లకు పలు సంఘాల మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెపై దమనకాండను ఆపాలనీ, వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.వాణి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, వర్కింగ్ ఉమెన్ కో కన్వీనర్ కమలారెడ్డి (ఏఐటీయూసీ), మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుల్తానా, ఐకేపీ వీఓఏ రాష్ట్ర కమిటీ సభ్యులు ఫైమా, మున్సిపల్ యూనియన్ ముషీరాబాద్ జోన్ నాయకులు సువర్ణ తదితరులు పాల్గొని అంగన్ వాడీ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

పరిష్కరించకుంటే ప్రత్యక్ష పోరాటాల్లోకి ఐద్వా

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొంటామని ఆర్.అరుణజ్యోతి హెచ్చరించారు. బందూకులు పట్టుకుని దొరలను తరిమిన చరిత్ర తెలంగాణ ఆడబిడ్డలదనీ, భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ధర్నాల అవసరమే లేదంటూ అన్ని సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తానన్న సీఎం కేసీఆర్ ఒక్క సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. మోసపూరిత మాటలతో కార్మికులను విడదీసే పాలకుల కుట్రలను తిప్పికొట్టి కార్మికులు ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు.

జోలికొస్తే చెప్పుతో కొట్టండి

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ మహిళలను మగ పోలీసులు తాకరాని చోట తాకుతూ హింసించారని కమలారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి మళ్లీ వస్తే ఏ స్థాయి వారినైనా చెప్పుతో కొట్టాలని సూచించారు. ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వమే సంఘాలు పెట్టి నమ్మించే ప్రయత్నం చేసినా ఏడాది కాలంలోనే భ్రమలు తొలిగి కార్మికులు ఆ సంఘాలను వీడి వస్తున్నారని తెలిపారు.



మంత్రి చర్చలకు పిలవాలి

సంబంధిత మంత్రి చర్చలకు పిలిచి అంగన్ వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్వీ రమ డిమాండ్ చేశారు. మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన మగ పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానన్న సీఎం కేసీఆర్, అధికారంలోకి వచ్చాక బుద్ధిపుడితే చేస్తా..అన్నట్టు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి తెలంగాణనా మనం కోరుకున్నది? అని రమ ప్రశ్నించారు. అంగన్ వాడీ ఉద్యోగులకు ప్రజలు మద్దతు పలుకుతున్నారనీ, ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీలుండగా, అందులో అత్యధికులు మహిళలు, సామాజికంగా బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఉన్నారని రమ తెలిపారు. గత 45 ఏండ్లుగా ఐసీడీఎస్‌లో పని చేస్తూ వీరంతా పేదలకు సేవలందిస్తున్నారని చెప్పారు.

పాండిచ్చేరి ప్రభుత్వం వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిందనీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు హెల్త్ కార్డులు జారీ చేశాయనీ, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సోం తదితర రాష్ట్రాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ అలవెన్స్, వెల్ఫేర్ బోర్డు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాయని చెప్పారు. కర్నాటకలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల నిరసన

- కొనసాగిన సమ్మె

నవతెలంగాణ- విలేకరులు

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. అందులో భాగంగా బుధవారం వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. చేవెళ్ల, షాద్‌నగర్‌లో అంగన్‌వాడీలు వంటావార్పు నిర్వహించారు. వీరికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ మద్దతు తెలిపి మాట్లాడారు. శేరిలింగంపల్లి సెకార్టలో అంగన్‌వాడీ సెంటర్లకు సామాగ్రిని తరలించే ప్రయత్నం చేయడంతో అంగన్‌వాడీలు హఫీజ్‌పేట భవన్ వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఉన్నతాధికారులు తన సమ్మెను విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా బేల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు వంటావార్పు చేపట్టారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేసి, ర్యాలీ తీశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అల్వాల్ (యాప్రాల్) ప్రాజెక్టు ఆఫీస్ వద్ద వంటావార్పు నిర్వహించారు.





యువతకు ఉపాధి అవకాశాలు

- రాష్ట్రంలో లులు గ్రూప్ పెట్టుబడులు : ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ రాష్ట్రం ముందుంటుందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీలో అంతర్జాతీయ సంస్థ లులు మాల్, హైపర్ మార్కెటింగ్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లులు గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేరళ నుంచి యూఏఈ వెళ్లిన యూసుఫ్ అలీ లులు గ్రూప్ స్థాపించి వ్యాపారాన్ని 25 దేశాలకు విస్తరించారని తెలిపారు. 270 హైపర్ మార్ట్‌లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ వేదికల్లో లులు గ్రూప్ అధినేతలు తమను కలిసినప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంపై ఆసక్తి చూపారన్నారు. సరళీకృతమైన వ్యాపార అవకాశాలను కల్పించాలని వారు కోరారన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో మాల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగంలోనూ పెట్టుబడులకు లులు గ్రూప్ ఆసక్తిగా ఉందని చెప్పారు. దాంతో తెలంగాణలో యువతకు, రైతులకు, చేపల సాగుదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కలిగేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో రూ.3500 కోట్ల పెట్టుబడులకు లులు గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసిందని.. గ్రూప్ చైర్మెన్ యూసుఫ్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, లులు గ్రూప్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సింగరేణి పక్షపాతి : ఎమ్మెల్సీ కె. కవిత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ సింగరేణి సంస్థకి పక్షపాతి అనీ, ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను ప్రయివేటీకరించి నిర్వీర్యం చేయాలన్న కేంద్రం కుట్రను కేసీఆర్ అడ్డుకున్నారన్నారు. సింగరేణ సంస్థ లాభాల్లో 32 శాతం వాటాను కార్మికులకు పంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో టీబీజీకేఎస్ సంఘం నాయకులు కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సింగరేణి కార్మికులను సీఎం కేసీఆర్ ఎప్పుడూ మరచిపోరని అన్నారు. అవకాశమున్న ప్రతిసారీ కార్మికులకు ప్రయోజనాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్మికులకు అత్యధిక బోనస్ ప్రకటించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అనీ, 2014లో 18 శాతం బోనస్ ఉండగా 2022 నాటికి 30 శాతానికి పెంచామని చెప్పారు. ఈ సారి 32 శాతానికి పెరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మీసేవా ఉద్యోగుల సమ్మె నోటీసు

- ఐటీ ముఖ్య కార్యదర్శికి అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేతనాలు పెంచాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు సమ్మె నోటీసును తెలంగాణ మీ సేవా ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ బుధవారం అందజేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలనీ, పర్మినెంట్ ఉద్యోగులకు చెల్లించే విధంగానే మీ-సేవా కేంద్రంలో పనిచేస్తున్న వారికి కూడా ఐఆర్ (మధ్యంతర భృతి) ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదనపు పనికి ఓటీ చెల్లించాలని కోరారు. పీఎఫ్ ఖాతాల్లో ఎంప్లాయర్ వాటా యాజమాన్యం, ఉద్యోగి వాటా ఉద్యోగి చెల్లించే విధంగా చూడాలనీ, 2022 మార్చి నుంచి ఇప్పటిదాకా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త సర్వీసులు నిరంతరం పెరుగుతున్న దృష్ట్యా అదనపు సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. కొత్త సర్వీసులకు ట్రైనింగ్ ఇవ్వాలనీ, కేంద్రాల్లో టెక్నికల్ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. మీ-సేవా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఛార్జీలతో సహా అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయనీ, అరకొర వేతనాలతో బతకడం కష్టంగా ఉందని తెలిపారు. వేతనాల పెంపుదల విషయంలో ఏడాది కాలంగా జాప్యం జరుగుతున్నందుకు అనివార్య పరిస్థితుల్లో మీ-సేవా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లబోతున్నారని ప్రకటించారు.

సదరం క్యాంపుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సదరం క్యాంపుల్లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య, కోశాధికారి ఆర్.వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. స్లాట్ బుక్ చేయడం కోసం రూ.500 నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్న మీసేవా కేంద్రాలను సీజ్ చేయాలని కోరారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలిప్పిస్తామని కొంతమంది బ్రోకర్లు జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి డాక్టర్లతో కుమ్మకై అనర్హులకు సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నారని విమర్శించారు.

క్యాంపును పర్యవేక్షించాల్సిన డీఎంహెచ్‌ఓ ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోసం రూ. 5 వేల నుంచి రూ.20వేల వరకు డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నిజామాబాద్, వికారాబాద్, అదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో నేరుగా వెళ్లే వికలాంగులకు పర్సంటేజి తక్కువ వేసి సదరం సర్టిఫికెట్ తిరస్కరిస్తున్నారని విమర్శించారు. మూగ, చెవిటి, మానసిక వికలాంగులకు కోఠి ఈఎన్‌టీ, బోయిన్‌పల్లి ఎన్ఐఎంహెచ్ కేంద్రాల్లో మాత్రమే ఇస్తున్నారనీ, దీని వల్ల దరఖాస్తుదారులు వేల రూపాయలు ఖర్చుపెట్టుకుని హైదరాబాద్‌కు రావాల్సి వస్తున్నదని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ఆ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. నకిలీ వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.




హైదరాబాద్‌లోని చింతల్ బస్తిలో రోడ్డు మీదకు వచ్చిన మొసలి

వ్యారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలు

- ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు

నవతెలంగాణ - గంభీరావుపేట

వ్యారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలు ప్రకటించిందని ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నర్మాల, కోళ్లమద్ది, లింగన్నపేట, గంభీరావుపేటకు సంబంధించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఒక్క రోజులోనే 4 గ్రామాల్లో 378 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించుకున్నామన్నారు. 65 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు, రైతుల గోసలు, అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడిందని అన్నారు. 6 గ్యారెంటీ పథకాలంటూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి ఒక ముఖ్యమంత్రి మారుతారని, మున్సిపాలిటీగా ఉండే గంభీరావుపేటను హామ్లెట్‌గా మారుస్తారని, విద్య, వైద్యం వెనుకంజలో పడి డాక్టర్లు, టీచర్లు లేని దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, టెస్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణపై వివక్షలో ఏ1 కాంగ్రెస్, ఏ2 బీజేపీ

- వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-తాండూరు

తెలంగాణపై వివక్ష చూపడంలో కాంగ్రెస్ ఏ1 అయితే, ఏ2 బీజేపీ అని వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయాలు ప్రకటిస్తే వాటిలో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలన్నారు. కేంద్రీయ విద్యాలయం కూడా ఇవ్వని మోడీ ఏం చెప్పేందుకు తెలంగాణ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వికారాబాద్ జిల్లా తాండూర్‌లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా తాండూర్ రూ.50కోట్లతో పలు అభివృద్ధి పనులను మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు.

గల్లీలో కుస్తీ..ఢిల్లీలో దోస్తీ..ఇదే 'బీజేపీ రాష్ట్ర సమితి' దోస్తానా : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ అన్నట్టుగా బీజేపీ, బీఆర్ఎస్ బంధం ఉందనీ, ఇదే 'బీజేపీ రాష్ట్ర సమితి' దోస్తానా అని వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. బుధవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రధానికి అడుగు పెట్టే అర్హత లేదని బందిపోట్లు అంటున్నారనీ, వారు ఎదురెళ్లి మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. కేసీఆర్ అడుగడు..మోడీ ఇవ్వడనీ, పదేండ్లుగా ఇదే తంతు అని విమర్శించారు. నిజంగా దొరకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమైతే ఐదేండ్లలో మోడీ వచ్చిన ప్రతిసారీ ఎందుకు మొహం చాటేస్తున్నారని ప్రశ్నించారు. విభజన హామీల సంగతి ఏంటని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేంద్రం ఇస్తామన్న 2 కోట్ల ఉద్యోగాల్లో రాష్ట్ర వాటా ఏదని అడిగారా? అని నిలదీశారు. ఏటా బడ్జెట్ లో రాష్ట్రానికి మొండి చేయి చూపుతుంటే ఎందుకు గమ్మున ఉంటున్నారని ప్రశ్నించారు.

ఆశాల సమస్యలపై స్పందించండి

- ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి : తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి
- హైదరాబాద్, కరీంనగర్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో/ కరీంనగర్

ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కరించాలని తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె 3వ రోజు బుధవారం కొనసాగింది. సికింద్రాబాద్‌లోని హరిహరకళా భవన్ హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్, సౌత్ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కారించాలని, లేకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఆశా వర్కర్లు చనిపోయినా పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఆశా కార్మికులు యాక్సిడెంట్ అయి చనిపోతే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆశాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం పెడుతున్న టార్గెట్లు, పని ఒత్తిడి వల్ల 25- 30 ఏండ్ల చిన్న వయసులోనే ఆశా వర్కర్లకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెపోటు వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

జాబ్ చార్ట్ ప్రకటించాలని, పారితోషికం లేని పనులు చెప్పొద్దన్నారు. 6 నెలల పీఆర్సీ బకాయిలు, కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని, ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, సౌత్ కమిటీ అధ్యక్షురాలు ఎం.మీనా మాట్లాడారు. ఈ ధర్నాలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు అజయ్‌బాబు, సీనియర్ నాయకులు ఆర్.మల్లేష్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, కోశాధికారి రాణి, యాదమ్మ, నాయకులు బాలమణి, పద్మ, రాధిక, సఫియా, సంగీత, కవిత పాల్గొన్నారు.

కరీంనగర్ డీఎంహెచ్‌ఓ తీరుపై ఆగ్రహం

కరీంనగర్ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం కోసం చామనపల్లి పీహెచ్‌సీకి వెళ్లిన డీఎంహెచ్‌ఓ.. ఆశాలను సమ్మె బంద్ చేసి గ్రామంలో గర్భిణులను తీసుకురావాలని ఒత్తిడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ ఆదేశించడం వల్ల ఆశా కార్యకర్తలు కాదనలేక 58 మంది మహిళలను ఆరోగ్య మహిళా కార్యక్రమానికి తీసుకొచ్చారని చెప్పారు. కానీ, ఆ ఫొటోలను గ్రూప్‌లో పంపి సమ్మెలో పాల్గొన్న మిగతా ఆశా కార్యకర్తలను ఆందోళనకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ధర్నా వద్దకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి వచ్చి మాట్లాడారు. తాను సమ్మెలో పాల్గొన్న వారిని ఏం అనలేదని, కింది స్థాయి అధికారుల ఒత్తిడి వల్ల ఆ విధంగా జరిగి ఉండొచ్చని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లోనే అమలు చేయాలి



మహిళా రిజర్వేషన్స్‌పై చిత్తశుద్ధి నిరూపించుకోండి..

- అక్టోబర్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి : జీపు జాతాలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-మిర్యాలగూడ

రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం కోసం చేపట్టిన జీపు జాతా బుధవారం నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ మండలానికి చేరుకుంది. జాతా బృందానికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం ముందు నిర్వహించిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. 27 ఏండ్ల పోరాట ఫలితంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్స్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసి మోడీ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా బిల్లు అమలవుతుందని చెప్పడం సరైనది కాదన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లను మభ్య పెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహిళలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

మోడీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగికదాడులు పెరిగిపోయాయని తెలిపారు. కేంద్రంలో ఉన్న ప్రజాప్రతినిధులు, మంత్రులు సైతం మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పుట్టిన పసిపాప నుంచి ముసలి వరకు ఈ దేశంలో మహిళలకు రక్షణ కరువైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం మహిళలు గలమెత్తి ఉద్యమించాలన్నారు. మహిళలకు పని భారం పెరగడం వల్ల.. పౌష్టికాహారం లేక అనారోగ్యానికి గురవుతున్నారని, 57 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. 67 శాతం మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లల్లో 67 శాతం పౌష్టికాహారం లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలకు ఆర్థిక, మానసిక పరిపుష్టి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు గూడు కోసం 125 గజాల ఇంటి స్థలం ఇచ్చి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ షాపులో అందించాలని, డ్వాక్రా మహిళలకు అభయ హస్తం అమలు చేయాలని కోరారు. అనంతరం జాతా బృందాన్ని సన్మానించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలెబోయిన వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సీనియర్ నాయకులు పద్మ, జిల్లా కార్యదర్శి పాదూరి గోవర్ధన, నాయకులు సైదమ్మ, పూలమ్మ, ఊర్మిళ, అరుణ, పార్వతి, నిర్మల, రాధాబాయి, నాగమణి స్వరాజ్యం, రాణి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

'సుప్రీం' ఆగ్రహం!

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల న్యాయ వ్యవస్థ ప్రతిభావంతులైనవారిని దూరం చేసుకోవాల్సి వస్తోందని సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయవలసి రావడం విచారకరం. హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవుల కోసం కొలీజియం ఎంపిక చేసిన జాబితాపై నెలల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్ర

> శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు భారత రాజ్యాంగంలోని ప్రధాన అంగాలు. ప్రజలకు సకాలంలో సరైన న్యాయం అందడం ఎంతో అవసరం. అంతేగాక రాజ్యాంగం ప్రకారం మిగిలిన రెండు వ్యవస్థలు పని చేస్తున్నాయా లేక ఏవైనా ఉల్లంఘనలున్నాయా అన్న అంశాలు కూడా న్యాయవ్యవస్థ పరిధిలోనివే. రాజ్యాంగ అన్వయింపు బాధ్యత దానిదే. కాబట్టి ఇంత కీలకమైన న్యాయ వ్యవస్థలో ఖాళీలన్నిటినీ భర్తీ చేయడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఆ పని వెంటనే చేపట్టాలి. అలాగే కొలీజియం సూచించిన పేర్లలో కొన్నిటిని కారణం చెప్పకుండా తిరస్కరించడం తగదు.

ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో ఈ పరిస్థితి ఎదురైందన్న దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు మోడీ సర్కారుకు మొట్టికాయలుగా భావించాలి. 'అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ బెంగళూరు' దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా వివిధ హైకోర్టుల్లోని జడ్జీ పోస్టుల ఖాళీలు, వాటి భర్తీకి కొలీజియం వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్న తీరు స్పష్టంగా ముందుకొచ్చింది. హైకోర్టు కొలీజియమ్‌లు న్యాయమూర్తుల పదవుల కోసం సిఫార్సు చేసిన దాదాపు 70 పేర్లను కేంద్ర ప్రభుత్వానికిస్తే 2022 నవంబరు నుండి దాదాపు పది మాసాల పాటు పెండింగ్‌లో పెట్టారు. బెంచ్‌లో చేరేందుకు తమ లా ప్రాక్టీస్‌ను వదులుకోవడానికి సుముఖంగా ఉన్న, మెరుగైన ప్రతిభ కలిగిన వారు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధితులు అవుతున్నారని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అకారణంగా కొందరి పేర్లను తొలగించడానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొంది. అంటే సర్కారు తమకు నచ్చని వారిని న్యాయ వ్యవస్థలోకి రానీయకుండా అడ్డుకుంటోందనే కదా! ఖాళీలను అలాగే ఉంచి పరివార్ కుదురు నుండి వచ్చినవారితో న్యాయ వ్యవస్థను నింపేయాలన్నది ప్రభుత్వ పథకం కావచ్చు. కాబట్టి కీలకమైన అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లోకి సంఘీయులను చొప్పించడమే మోడీ సర్కారు లక్ష్యంగా ఉందన్న విమర్శ కాదనలేని వాస్తవం.



ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో మంజూరైన 1,114 జడ్జి పోస్టుల్లో 774మంది మాత్రమే పని చేస్తుండగా 340 ఖాళీలున్నాయి. ఆయా కోర్టుల్లో 60,72,729 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 45,22,626 కేసులు ఏడాది పైబడి పెండింగ్. జడ్జి పోస్టుల్లో 30శాతం పైగా ఖాళీలుంటే కేసుల పెండెన్సీ మరింత పెరుగుతుందే తప్ప పరిష్కారం కావు. "హైకోర్టులో న్యాయమూర్తి పదవులు చేపట్టేందుకు ముందుకు రావడానికి తిరస్కరిస్తున్నారు. అయినా మేం ప్రయత్నించాం, మంచి టాలెంట్ ఉన్నవారిని న్యాయమూర్తులుగా తీసుకునేందుకు కృషి చేశాం, కానీ పేర్ల విభజన కారణంగా మంచి టాలెంట్‌ను కోల్పోవాల్సి వస్తోంది" అని సర్కారు వైఖరి మూలంగా కొలీజియం కృషి వృథా అవుతున్న తీరును సుప్రీం ధర్మాసనం వివరించింది. 'న్యాయం ఆలస్యం చేయడం న్యాయాన్ని తిరస్కరించడమే'నన్న నానుడి అందరికీ తెలిసిందే. ఆ పరిస్థితి ఏర్పడడానికి మూల కారణం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని తాజా విచారణలో స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ 'కొరడా ఝుళిపించి, కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిని ప్రక్షాళన చేయాల్సిన సమయమిదని ఈ తరహాలో ఇకపై జరగరాదని' పేర్కొనడం సబబు అనిపిస్తోంది. ప్రతిభావంతులైన వారిని అన్ని తరగతులు, ప్రాంతాల నుండి న్యాయ వ్యవస్థలోకి తీసుకోవడం ఎంతో అవసరం.

శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు భారత రాజ్యాంగంలోని ప్రధాన అంగాలు. ప్రజలకు సకాలంలో సరైన న్యాయం అందడం ఎంతో అవసరం. అంతేగాక రాజ్యాంగం ప్రకారం మిగిలిన రెండు వ్యవస్థలు పని చేస్తున్నాయా లేక ఏవైనా ఉల్లంఘనలున్నాయా అన్న అంశాలు కూడా న్యాయవ్యవస్థ పరిధిలోనివే. రాజ్యాంగ అన్వయింపు బాధ్యత దానిదే. కాబట్టి ఇంత కీలకమైన న్యాయ వ్యవస్థలో ఖాళీలన్నిటినీ భర్తీ చేయడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఆ పని వెంటనే చేపట్టాలి. అలాగే కొలీజియం సూచించిన పేర్లలో కొన్నిటిని కారణం చెప్పకుండా తిరస్కరించడం తగదు. తన వైఖరిని సరిచేసుకోవడం అవసరం. సుప్రీం ధర్మాసనం తదుపరి వాయిదాగా నిర్ణయించిన అక్టోబర్ తొమ్మిదిలోగా ఖాళీలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలి. కనీసం పెండింగ్ పెట్టిన 70 పేర్లయినా క్లియర్ చేయాలి. అటువంటి విజ్ఞతను ప్రదర్శిస్తుందో లేదో వేచి చూడాల్సిందే!

దేశానికి కావాల్సింది భగత్‌సింగ్‌లే...


"భారతదేశం నేడు దయనీయంగా మారింది. ఒక మతం వారు ఇతర మతం వారిని బద్ధ శత్రువులుగా చూస్తున్నారు. భవిష్యత్తు చీకటిగా కనిపిస్తోంది. ఈ మత రాజకీయాలు దేశాన్ని దెబ్బతీశాయి. ప్రపంచ వేదికపై భారత్‌కు సిగ్గుచేటుగా పరిణమించాయి. ప్రజలపై సాగుతున్న దారుణాల నుండి రాజకీయ ప్రయోజనాలను పొందేందుకే నాయకులు ప్రయత్నిస్తున్నారు." నేటి దేశ పరిస్థితికి సరిగ్గా సరిపోయే మాటలివి. అయితే ఈ మాటలు ఇప్పటివి కావు. నేటికి 96 సంవత్సరాల క్రితం నాటివి. 1927లో... పంజాబ్ నుండి వెలువడే 'కీర్తి' అనే పత్రికలో ప్రచురించబడిన "మత ఘర్షణలు, వాటి నివారణ" వ్యాసంలోనివి. ఆవ్యాస రచయిత పేరు షహీద్ భగత్‌సింగ్! విప్లవ వీరుడిగా.. చిరుప్రాయంలోనే దేశ స్వాతంత్య్రం కోసం ఉరికంబమెక్కిన త్యాగధనుడుగా మనందరికీ తెలిసిన భగత్ సింగ్, మతోన్మాద రాజకీయాలను సమూలంగా వ్యతిరేకించాడన్న వాస్తవం ఈతరంలో చాలా మందికి తెలియదు. నేడు భగత్‌సింగ్ 116వ జయంతి. ఈ సందర్భంగా ఆ అమర వీరుడిని స్మరించుకుంటూ ఆయన మనకందించిపోయిన పోరాట వారసత్వాన్ని అంది పుచ్చుకోవాలి. ఆ వెలుగులో నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు వెతకాలి. అదే ఆయనకు మనమందించే నిజమైన నివాళి కాగలదు.



ఆర్. రాజేశమ్
9440443183

> ఒక దశలో మత రాజకీయాలకు పాల్పడినప్పుడు భగత్‌సింగ్ తన గురువునే ఎదిరించాడు. సహాయ నిరాకరణ ఉద్యమం ఉపసంహరణ తర్వాత లజపతిరాయ్ క్రమంగా మత రాజకీయాలవైపు మరలాడు. 1924 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసినప్పుడు తమ గురువును, ఆయన మత రాజ కీయాలనూ ఓడించాలంటూ భగత్‌సింగ్, అతని సహచరులు ప్రచారం చేశారు. లాలా లజపత్ రాయ్ అవకాశవాద వైఖరిని ఎండగడుతూ "దారి తప్పిన నాయకుడు" పేరుతో ఒక కరపత్రం విడుదల చేసారు. పత్రికల వాళ్లు ప్రశ్నించినపుడు.. "కానీయనివ్వండి, వారెవ్వరో కాదు.. మేరే నాలాయక్ బేటేహై హై!" అని సమాధానమిచ్చాడట లజపత్‌రాయ్. మత రాజకీయాలను భగత్‌సింగ్ ఎంత తీవ్రంగా వ్యతిరేకించాడో.. ఈ సంఘటన రుజువు చేస్తుంది.

బ్రిటిష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తం చేయడానికి 23 ఏండ్ల చిరు ప్రాయంలోనే ప్రాణార్పణ గావించిన విప్లవ యోధుడు షహీద్ భగత్‌సింగ్. 1931, మార్చి 23న నాటి బ్రిటిష్ పాలకులు భగత్‌సింగ్, రాజ్‌గు రు, సుఖదేవ్‌లను లాహోర్ జైలులో ఉరితీశారు. పరాయి పాలకులను దేశం నుండి తరిమికొట్టాలనే ఆకాంక్షతోనే ఆగి పోకుండా.. స్వతంత్ర భారతదేశంలో ఎలాంటి విధానాలు అవలంబిస్తే ప్రజలకు మేలు కలుగుతుందనే విషయంలోనూ సమగ్ర దృక్పథం కలిగిన కొద్దిమంది స్వాతంత్య్ర ఉద్యమకారుల్లో భగత్‌సింగ్ ఒకడు. ఆయన 28 సెప్టెంబర్, 1907న నేటి పాకిస్థాన్ లోని ఫైసలాబాద్ జిల్లా, బంగా గ్రామంలో జన్మించాడు. యుక్త వయస్సులోనే స్వాతంత్య్రోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. 'పంజాబ్ కేసరి' లాలా లజపతిరాయ్ నాయకత్వంలో నాడు ఉధతంగా కొనసాగుతున్న విప్లవకర ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొ న్నాడు. నాటి యువతను ఉత్తేజపరిచిన నౌజవాన్ భారత్ సభ, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాడు.1928లో సైమన్ కమిషన్ రాకను నిరసిస్తూ లాలా లజపతిరాయ్ నాయకత్వంలో పెద్దయెత్తున ధర్నాలు, హర్తాళ్లు కొనసాగాయి. లాహోరులో జరిగిన నిరసన ప్రదర్శనపై విరుచుకుపడిన బ్రిటిష్ పోలీసులు లజపతిరాయ్‌ను లాఠీలతో తీవ్రంగా గాయపరిచారు. నవంబర్ 17న ఆయన ఆస్పత్రిలో కన్నుమూశాడు. తమ గురువు హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినబూనిన భగత్‌సింగ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్‌లు నెలతిరక్కుండానే బ్రిటిష్ పోలీసు అధికారి జాన్ సాండర్స్‌ను లాహోర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగానే కాల్చి చంపారు. దేశ ప్రజల్లో విప్లవభావాలు మరింతగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో.. 1929 ఏప్రిల్ 8న భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులు ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబులు పేల్చారు. ప్రాణనష్టం జరగని రీతిలో బాంబులు వేసి, నినాదాలిస్తూ, కరపత్రాలు పంచుతూ అక్కడే నిల్చుండి అరెస్టయ్యారు. అసెంబ్లీపై బాంబు దాడి కేసుతో పాటు, సాండర్స్ హత్యకేసును తిరగదోడిన బ్రిటిష్ ప్రభుత్వం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష వేసింది.



గాంధేయ మార్గానికి భిన్నంగా విప్లవ కార్యాచరణ ద్వారా దేశ స్వాతంత్య్రం కోసం ఎంతోమంది వీరపుత్రులు ఉద్యమించారు. స్వాతంత్య్ర పోరాట చరిత్రలో వీరు నెరపిన పోరాటం కూడా సముజ్వల ఘట్టంగా నిలిచిపోయింది. ఈ తరహా విప్లవవీరుల్లో షహీద్ భగత్‌సింగ్‌ది విశిష్టస్థానం. దేశానికి రాజకీయ స్వాతంత్య్రం సాధించడంతోనే ఆగిపోకుండా, స్వతంత్ర భారతానికి ఆర్థిక స్వాతంత్య్రం కూడా సిద్ధించాలని, సామాన్యుడి సంక్షేమం సాకారం కావాలంటే దేశం సామ్యవాద పంథాను అనుసరించాలనే సమగ్ర రాజకీయ దృక్పథంతో ఉద్యమించిన వీరుడు భగత్‌సింగ్.

ప్రజాస్వామ్య, హేతువాద, సామ్యవాదం కోసం కార్యాచరణ

పద్దెనిమిదేళ్ల చిరుప్రాయానికే వివిధ రాజకీయ విధానాలకు సంబంధించిన అధ్యయనంలో భగత్ మునిగిపోయాడు. సింక్లేర్, విక్టర్ హ్యూగో, దాస్తోవస్కీ, బుఖారిన్, మార్క్స్, లెనిన్ రచనలను విస్తారంగా చదివాడు. ఈ విస్తృత అధ్యయనం వెలుగులో.. ప్రజాస్వామ్యం, హేతువాదం, సామ్యవాద వ్యవస్థ సాధన కోసం తన రాజకీయ కార్యాచరణ కొనసాగాలని నిర్దేశిం చుకున్నాడు. 'ఒక మనిషిని మరొక మనిషి, ఒక జాతిని వేరొక జాతి.. పీడించే సాంఘిక ధర్మాని' కి ముగింపు పలకడమే తన రాజకీయ లక్ష్యంగా భగత్‌సింగ్ ప్రకటించాడు. తెల్లోడిని తరిమికొట్టి నల్లోడికి అధికారం కట్టబెట్టడమే స్వాతంత్య్ర పోరాట ఉద్దేశం కాదని భగత్‌సింగ్ తెగేసి చెప్పాడు. అన్ని రకాల పీడనలకు అంతం పలికినప్పుడే భరతమాతకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని గాఢంగా విశ్వసించాడు. నాడు భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాంప్రసాద్ బిస్మిల్ మొదలగు విప్లవకారుల వేదికగా హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ కొనసాగేది. భగత్‌సింగ్ చొరవతో సామ్యవాద స్థాపన సంస్థ లక్ష్యాల్లో చేరి, సంస్థ పేరు హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌గా మారింది. 'వందేమాతరం' నాటివరకు విప్లవకారుల రణన్నినాదంగా ఉండేది. భగత్‌సింగ్ రాకతో 'ఇంక్విలాబ్ జిందాబాద్' తోడైంది. భవిష్యత్తు భారతం ఎలా ఉండాలనే అంశంపై స్పష్టమైన దక్పథం గల విప్లవకారుడు భగత్‌సింగ్. పల్లెల్లోని రైతులను, ఫ్యాక్టరీల్లోని కార్మికులను చైతన్యపరచినప్పుడే దేశంలో సమ సమాజం సిద్ధిస్తుందని కలలుకన్నాడు. బ్రిటీష్ పెట్టుబడిదారుల నుండి రాజ్యాధికారం భారతీయ పెట్టుబడిదారులకు మారి నంత మాత్రాన ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆయన నమ్మాడు. దోపిడీ వ్యవస్థలన్నీ సమూలంగా అంతమయ్యే వరకు స్వాతంత్య్ర పోరాటం కొనసాగాల్సిందేనని ఆయన తన సహచరులకు చెబుతుండేవాడు.

మతరాజకీయాలు తప్పని..గురువునే ఎదిరించిన భగత్

భగత్‌సింగ్ ప్రాపంచిక దృక్పథంలో హేతువాదం కీలకాంశంగా నిలిచింది. మతం, మానవ పరిణామం, సమాజ పరిణామం మొదలగు అంశాలను భగత్ శాస్త్రీయంగా విశ్లేషించేవాడు. అన్ని రకాల మూఢాచారాలను తీవ్రంగా నిరసించే వాడు. సమాజంలోని ప్రతీ అంశాన్ని హేతుబద్ధ ఆలోచనా సరళితో విశ్లేషించి అవగతం చేసుకోవాలని యువతకు బోధించే వాడు. స్వాతంత్య్ర సముపార్జన కోసం మిలిటెంట్‌గా ఉద్యమిస్తున్న తరుణంలోనే ప్రజల పోరాట శక్తిని బలహీనపరిచే మత రాజకీయాల దుష్ట స్వభావాన్ని భగత్‌సింగ్ స్పష్టంగా గుర్తించగలిగాడు. మత రాజకీయాలను సమూలంగా వ్యతిరేకించాలని తమ సంస్థ సభ్యులకు నిర్దేశించేవాడు. భగత్‌సింగ్ స్థాపించిన యువజన సంఘం 'నౌజవాన్ భారత్ సభ'లో మతోన్మాద భావజాలమున్నవారికి ప్రవేశం నిషిద్ధం. మతాన్ని రాజకీయాల నుండి దూరంగా ఉంచాలని, ప్రజల్లో మత సామరస్యం పెంపొందించేలా సభ్యులు కషి చేయాలని సంఘం నియమావళిలో పొందుపర్చారు. భగత్‌సింగ్, ఇతర విప్లవకారులకు రాజకీయ గురువు లాలా లజపతిరాయ్ మృతికి ప్రతీకారం తీసుకోవడం కోసమే భగత్‌సింగ్ బందం చేసిన శాండర్స్ హత్య అంతిమంగా వారి ఉరిశిక్షకు కారణమైంది. అంతగా ఆరాధించిన లజపతిరాయ్.. ఒక దశలో మత రాజకీయాలకు పాల్పడినప్పుడు భగత్‌సింగ్ తన గురువునే ఎదిరించాడు. సహాయ నిరాకరణ ఉద్యమం ఉపసంహరణ తర్వాత లజపతిరాయ్ క్రమంగా మత రాజకీయాలవైపు మరలాడు. 1924 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసినప్పుడు తమ గురువును, ఆయన మత రాజ కీయాలనూ ఓడించాలంటూ భగత్‌సింగ్, అతని సహచరులు ప్రచారం చేశారు. లాలా లజపత్ రాయ్ అవకాశవాద వైఖరిని ఎండగడుతూ "దారి తప్పిన నాయకుడు" పేరుతో ఒక కరపత్రం విడుదల చేసారు. పత్రికల వాళ్లు ప్రశ్నించినపుడు... "కానీయనివ్వండి, వారెవ్వరో కాదు.. మేరే నాలాయక్ బేటేహీ హై!" అని సమాధానమిచ్చాడట లజపత్‌రాయ్. మత రాజకీ యాలను భగత్‌సింగ్ ఎంత తీవ్రంగా వ్యతిరేకించాడో... ఈ సంఘటన రుజువు చేస్తుంది.

శ్రామికవర్గ చైతన్యంతోనే ప్రజల ఐక్యత సాధ్యం

పైన ఉదహరించిన 'కీర్తి' పత్రిక వ్యాసంలోనే.. "ప్రజల మధ్య అనవసర గొడవలు నిరోధించడానికి.. ప్రజల్లో శ్రామిక వర్గ ఐక్యతను, అసలు సమస్యలపై ఉద్యమించే చైతన్యాన్ని పెంపొందించడం చాలా అవసరం" అని భగత్‌సింగ్ స్పష్టీకరించాడు. వలసవాద సంకెళ్లను ఛేదించడం కోసం మతం, కులం మొదలైన విభజనలకు అతీతంగా ప్రజల ఐక్యతను సాధించాలి. కలకత్తా నగరంలో మతఘర్షణలను అడ్డుకోవ డానికి.. హిందూ, ముస్లిం వర్గాల కార్మికులు చేతులు కలిపి, మతో న్మాదులను ఐక్యంగా ఎదుర్కొన్న వైనాన్ని ఉదహరించిన ఆయన.. సామాజిక విభజనలను అధిగమించిన శ్రామికవర్గ చైతన్యం తోనే ప్రజల ఐక్యత సాధ్యమని తేల్చిచెప్పాడు. గదర్ వీరులు మతాన్ని రాజకీయాల నుండి వేరు చేసి, మతాన్ని వ్యక్తిగత అంశంగా పరిగణించారని.. మతోన్మాద ప్రమాదాన్ని నిలువరించడానికి ఇదే సమర్థవంతమైన పరిష్కారం అని భగత్‌సింగ్ పేర్కొన్నారు. మతోన్మాద శక్తుల స్వార్థ రాజకీయాలను విఫలం చేసి.. ప్రజల ఐక్యతను నిలబెట్టాలనే దృఢ దీక్షతో షహీద్ భగత్‌సింగ్ తన జీవితాంతం ఉద్యమించాడు. భారత జాతీయవాదానికి, వలసవాద వ్యతిరేక పోరాటానికి మతతత్వం కలిగించే ప్రమాదాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. "వలసవాదం లాగే మతతత్వం సైతం ప్రజలకు పెద్ద శత్రువు" అంటూ తన సహచరులకు చెబుతుండేవాడు.

కానీ నేడు మతరాజకీయాలపై పాలన సాగిస్తున్న దేశాన్ని చూస్తే షహీద్ భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజం ఈ దేశంలో ఇంకా అందనంత దూరంలోనే ఉండిపోయిందని అర్థమవుతోంది. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. కోట్లాది మంది సామాన్య ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాలకులు కొద్దిమంది పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్నారు. ఈ గడ్డు పరిస్థితుల నుండి దేశ రాజకీయాలను సక్రమ మార్గంలో పయనింప జేయడానికి, మతపరమైన మూఢనమ్మకాల మానసిక బానిసత్వం నుండి ప్రజలు విముక్తి పొందడమే నిజమైన స్వాతంత్య్రం. స్వాతంత్య్రవీరులు కలలుగన్న సమ సమాజం నిర్మించడానికి.. షహీద్ భగత్‌సింగ్ తాత్విక చింతనను, ఆయన పోరాట వారసత్వాన్ని కొనసాగించడమే సరైన పరిష్కారం.దానికి ఆ అమర వీరుడి ఆశయాలు నేడు మనకు సరైన తోవను చూపెట్టే దిక్సూచిగా ఉపకరిస్తాయి.

(నేడు షహీద్ భగత్‌సింగ్ జయంతి)

మెయిల్ @ నవతెలంగాణ


కార్మికుల సంక్షేమం గాలిలో దీపమేనా?

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం రోజురోజుకూ గాలిలో దీపంగానే మారుతోంది. ఈ రంగంలో తాపి, మట్టి, సెంట్రింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, రాడ్ బైండింగ్, పెయింటర్, టైల్స్ ఇలా సుమారు 20లక్షల మంది కార్మికులుగా పనిచేస్తున్నట్టు ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. కానీ వారి జీవన భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యం. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఆయా పనుల్లోని కార్మికులకు సంక్షేమ బోర్డు పేరుతో గుర్తింపు కార్డులనందించింది. మంచిదే కానీ... ఇది పేరుకు మాత్రమేనని స్పష్టమవుతున్నది. సహజ, ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన కార్మికుల కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. సహాయం కోసం దరఖాస్తు అందజేసిన కొన్ని రోజుల్లో బాధిత లబ్దిదారులకు సత్వరమే ఆయా పథకల ప్రయోజనాలందించాల్సి ఉండగా ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సాయం కోసం సంవత్సరాల కొద్ది ఎదురుచూస్తుండటంతో ఆయా కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో జీవనాన్ని సాగిస్తున్నాయి. గతిలేని పరిస్థితుల్లో ఇతరుల వద్ద అప్పులు తెచ్చి, కాలం వెళ్లదీస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి అందించే సహాయం వడ్డీలకే సరిపోవడం లేదు. కొంతమంది కార్మికులు అవగాహన లేమితో కార్మికులుగా తమ పేర్లను సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోలేదు. వారు పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గాయపడినా ఆర్థిక సహాయం గురించి తెలియకపోవడంతో నష్టపోతున్నారు. ఇవన్నీ కార్మిక శాఖ ప్రత్యేక చొరవ తీసుకుని వారికి అవగాహన కల్పించాల్సినవే. ఇవే కాదు రాష్ట్రంలోని ప్రతి జిల్లా, పట్టణాల్లోని లేబర్ అడ్డాల్లో కార్మికుల సౌకర్యార్థం ప్రభుత్వం మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఎండా, వానల నుండి రక్షించుకునేందుకు షెడ్డులను నిర్మించాలి. అలాగే కార్మికుల రవాణా సౌకర్యార్థం మోటార్ సైకిళ్లతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, కర్నాటక, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలోనూ అమలు చేయాలి. కార్మికులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయార్థం రుణాలందించాలి. ప్రతియేటా సంక్షేమ బోర్డు నుండి అర్హులైన వారికి ఆయా వృత్తుల పనిముట్లను సబ్సిడితో కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి. అప్పుడే కార్మిక కుటుంబాలు ఎంతోకొంతైనా బాగుపడతాయి.

-ఈదునూరి మహేష్,
సెల్:9949134467

ఈపిఎస్-95 పెన్షన్ స్కీమ్ : సుప్రీం తీర్పు, కేంద్రం దివాళాకోరు ఉత్తర్వులు!

'పెన్షన్ దయా దాక్షిణ్యాలతో ఇచ్చేది కాదు. పెన్షన్ పొందటం ప్రాథమిక హక్కు' అని సుప్రీంకోర్టు కూడా తీర్పు నిచ్చింది. వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం, సమాజ అభివృద్ధికి జీవితాంతం సేవలందించిన కార్మికులు పెన్షన్ పొందడం అనేది ప్రాథమిక హక్కు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నుకోబడిన ప్రభుత్వాలు తమ ఉద్యోగులకు వృద్ధాప్యంలో పెన్షన్ చెల్లించడం అనేది కనీస బాధ్యత. కానీ భారతదేశంలో తన కార్మికులకు, వృద్ధాప్యంలో రక్షణ కల్పించడానికి సంబంధించి ఎలాంటి సామాజిక భద్రతా వ్యవస్థ లేదు. సామాజిక భద్రతను విస్తరించి మెరుగుపరచి అందరికీ వర్తింప జేయడానికి బదులుగా పింఛన్ ప్రయోజనాన్ని ఎత్తివేసి దాని ప్రయోజనాన్ని కుదించడానికి ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాల కనుగుణంగా పనిచేస్తున్నవి. ఉద్యోగులు, కార్మికులు కష్టపడి పోరాడి సాధించుకున్న పెన్షన్ హక్కును ప్రభుత్వాలు కాలరాస్తున్నవి. కార్మికులకు సంబంధించిన సొమ్మును భవిష్యనిధి నుండి ఫించన్ ఫండ్‌కు బదిలీ చేస్తున్నారు. యజమానులు ప్రావిడెంట్ ఫండ్‌లోని పెన్షన్ ఫండ్ ఖాతాకు వారి వాటాను బదిలీ చేయడం అనేది వాస్తవంగా జరగటం లేదు.



ఎస్ఎస్ఆర్ఏ ప్రసాద్
9490300867

ఉద్యోగుల పెన్షన్ స్కీమ్-95 (ఈపిఎస్) ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ నుండి అమలు ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వేతర సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు మొదలైన వివిధ వర్గాల ప్రజలకు వర్తింప జేస్తూ అనేక పెన్షన్ పథకాలున్నాయి. ఈ పథకాలన్నీ చాలా తక్కువమందికి కవర్ అవుతున్నాయి. అంటే 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం కార్మికవర్గంలో కేవలం 12శాతం మందికి మాత్రమే వర్తిస్తున్నాయి. 2020 నేషనల్ కమిషన్ ఆఫ్ పాపులేషన్ రిపోర్టు ప్రకారం 2022 మార్చి నాటికి సుమారు 30కోట్ల మంది ప్రావిడెంట్ ఫండ్‌లో సభ్యులుగా ఉంటారని అంచనగా వేయగా, సగటున 4.6కోట్ల మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. ఈపిఎస్-95 కింద దాదాపు 75లక్షల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారు. కానీ తక్కువ ఆదాయం కలిగిన ప్రావిడెంట్ ఫండ్‌దారులకు మాత్రమే పెన్షన్ చెల్లించబడుతోంది. నెలకు రూ.15వేలకన్నా అధికంగా సంపాదిస్తున్న కార్మికులకు పెన్షన్ చెల్లించుట లేదు. ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఈపిఎస్-95 కింద పరిమిత ప్రయోజనాలను కూడా లేకుండా చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రావిడెంట్ ఫండ్‌పై పన్ను విధించే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. భారీ నిరసనల నేపథ్యంలో దానిని ఉపసంహ రించుకున్నది. కార్మికులు వారి కుటుంబ అవసరాల కోసం ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల్లోని వారి సొంత సొమ్మును ఉపసంహరించుకోకూడదని కూడా నిర్ణయించింది. కార్మికుల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా ఈ నిర్ణయాన్ని కూడా ఉపసంహ రించుకోవాల్సి వచ్చింది. అయినా కూడా ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకిస్తున్నప్పటికీ, 15శాతం వాటాను షేర్ మార్కెట్‌లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, ఆ వాటాను మరింత పెంచాలని కూడా యోచిస్తోంది. ప్రావిడెంట్ ఫండ్‌తో పాటు అన్ని పొదుపు పథకాల వడ్డీ రేట్లను తగ్గించి వాటిలోని నిధులను షేర్ మార్కెట్టుకు తరలించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రావిడెంట్ ఫండ్‌తో పాటు 1952 సామాజిక భద్రతా చట్టాలను, నిబంధనలను రద్దు చేసి ఒకే లేబర్ కోడ్ కిందకు తీసుకొనివచ్చింది. యజమానుల, కార్మికుల వాటాను ప్రస్తుతం ఉన్న 12శాతం నుండి 10శాతం తగ్గించాలని సూచించింది. కార్మికుడు కనుక తన వాటాను పదిశాతం కన్నా ఎక్కువ చెల్లించాలని కోరుకుంటే అభ్యంతరం లేదు. కానీ యజమాని మాత్రం 10శాతం కన్నా ఎక్కువ చెల్లించనవసరం లేదు. ఆవిధంగా యజమానులు ప్రావిడెంట్ ఫండ్ చట్ట పరిధిలోనే వంద కోట్ల రూపాయల ఆదాయాన్ని కూడబెట్టుకోవచ్చు. అంతేకాక అనేక సంస్థల్లో పనిచేసే కార్మికులు ప్రావిడెంట్ ఫండ్ కింద కవర్ కాకుండా నష్టపోతారు. తద్వారా ఆయా సంస్థల యజమానులు అధికంగా లాభం పొందుతారు. ఉద్యోగి, యజమాని అంగీకరిస్తే, ప్రావిడెంట్ ఫండ్, ఈపిఎస్-95 వాటాను వేతన పరిమితికి మించి లేక పూర్తి వేతనాన్ని కూడా జమ చేయవచ్చు. అయితే ఈ నిబంధన 2014 వరకు మాత్రమే ఉంది. ఎవరైతే కార్మికుడు పూర్తి వేతనాన్ని తన వాటాను చెల్లించినా కూడా, అధిక పెన్షన్‌ను ఆ కార్మికుడికి చెల్లించబడలేదు. ఈ విషయంలో సుప్రీం కోర్టు కార్మికులకు కొంత ఉపశమనం కలిగించే తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల వలన తీర్పు స్ఫూర్తితో అమలు చేయబడలేదు. ఆ విధంగా ఉత్తర్వులనిచ్చి కేంద్ర ప్రభుత్వం తన అనాసక్తిని బయటపెట్టుకుంది.

ఆ విధంగా ఈపిఎస్-95 అమలు అనేది హాస్యాస్పదంగా మారింది. నేటికీ లక్షలాది మంది కార్మికులు అతి తక్కువ పెన్షన్ పొందుతున్నారు. కనీస అర్హత కలిగిన, అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ పొందుట అనేది అందని ద్రాక్షగా మారింది. కనీస పెన్షన్‌ను రూ.9వేలు అనే డిమాండ్‌కు మద్దతు విస్తృతంగా రావడంతో, అప్పటి యూపీఏ-2, ప్రభుత్వం కనీస పెన్షన్ రూ.వెయ్యికి పెంచాలని నిర్ణయం చేసింది. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ దాన్ని అమలు చేసింది. కానీ, పెన్షన్ సాధ్యమైనంత మేరకు తక్కువగా ఉండే విధంగా షరతులతో కూడిన



ఫార్ములాను రూపొందించి అమలు చేసింది. అనేక ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల సంఘాలు, పోరాటాలు, ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. పెన్షన్‌లో పెంపుదల లేకుండా, నేటికీ అనేకమంది పెన్షనర్లు కేవలం రూ.వెయ్యి మాత్రమే పెన్షన్ పొందుతున్నారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ 4 నవంబర్ 2022న ఈపిఎస్-95 పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా ఉత్తర్వులిచ్చింది. తీర్పులోని ఒకే ఒక అంశానికి ఈ ఉత్తర్వులు పరిమితమైంది. పెన్షనర్స్‌లోని ఒక చిన్న విభాగానికి మాత్రమే, అధిక పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆ విధంగా అతి తక్కువ పెన్షన్ పొందే అనేక మంది పేద పెన్షనర్లకు అధిక పెన్షన్ పొందే అర్హత లేకుండా తిరస్కరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు సుప్రీం కోర్టు తీర్పు స్ఫూర్తిని, ఉద్దేశ్యాన్ని నీరు కార్చింది.

సుప్రీం కోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయుటకు ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌కు ఎనిమిది వారాల గడువు అనగా 29 డిసెంబర్ 2022 వరకు సమయం ఇచ్చింది. సాధారణంగా కార్మికులు ప్రత్యేకించి పెన్షనర్ల పట్ల ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ యొక్క ఉదాసీన వైఖరికి ఇది పూర్తిగా అద్దం పడుతోంది. ఈ ప్రభుత్వ ఉత్తర్వు పెన్షనర్లకు, ప్రావిడెంట్ ఫండ్ చందాదారులకు మార్గనిర్దేశనం చేయడం కన్నా సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయడం నుంచి తప్పించుకోనుటకు ఉద్దేశించిందిగా అనిపిస్తుంది. అందుకే సుప్రీంకోర్టు ఇచ్చిన సమయంలో చివరి తేదీని ఎంచుకొని ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. నిజానికి ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ ఉద్దేశ్యపూర్వకంగా, పెన్షనర్ల ఇష్టానికి వ్యతిరేకంగా, వారికి నష్టం చేకూర్చే విధంగా రెండు నెలల గడువును పెంచింది. ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌కు గనుక చిత్తశుద్ధి ఉండి ఉంటే, ఈ ఉత్తర్వులను రెండు నెలల ముందే ఇచ్చి ఉండేవారు. పెన్షన్ లబ్ధిదారులందరూ రెండు నెలలలోపు అధిక పెన్షన్ ఎంపిక చేసుకొనుటకు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో త్వరపడాల్సిన అవసరం ఏర్పడింది. అటువంటి తాజా ఎంపికను చేసుకుంటునప్పుడు, సంబంధిత రికార్డులు ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ వద్ద అందు బాటులో ఉన్నప్పటికీ రికార్డులు సమర్పించే, బాధ్యతను పెన్షనర్స్‌పై నెట్టి ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ ఆ బాధ్యత నుండి తప్పించుకొనుటకు ఉత్తర్వులు జారీ చేసింది.

> ఈపిఎస్-95 అమలు అనేది హాస్యాస్పదంగా మారింది. నేటికీ లక్షలాది మంది కార్మికులు అతి తక్కువ పెన్షన్ పొందుతున్నారు. కనీస అర్హత కలిగిన, అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ పొందుట అనేది అందని ద్రాక్షగా మారింది. కనీస పెన్షన్‌ను రూ.9వేలు అనే డిమాండ్‌కు మద్దతు విస్తృతంగా రావడంతో, అప్పటి యూపీఏ-2, ప్రభుత్వం కనీస పెన్షన్ రూ.వెయ్యికి పెంచాలని నిర్ణయం చేసింది. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ దాన్ని అమలు చేసింది. కానీ, పెన్షన్ సాధ్యమైనంత మేరకు తక్కువగా ఉండే విధంగా షరతులతో కూడిన ఫార్ములాను రూపొందించి అమలు చేసింది. అనేక ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల సంఘాలు, పోరాటాలు, ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.

ఉద్యోగులుగా వేతన పరిమితి రూ.5వేలు లేదా రూ.6,500లు మించి జీతంపై జమచేసిన పెన్షనర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈపిఎస్-95లో సభ్యులు, ముందస్తు సవరణ పథకం ఉద్యోగుల పెన్షన్ పథకం కింద ఉమ్మడి ఎంపికను ఉపయోగించుకున్నారు. అటువంటి వారి ఎంపికను ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ తిరస్కరించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం, యజమానుల నుండి శాసన, ప్రభుత్వ ఆర్థికపరమైన చర్యలు అవసరం. అవేంటంటే కనీస పెన్షన్ పెంపు, దాని అమలు కోసం కేంద్రం బడ్జెట్‌ను కేటాయించడం చేయాలి. ఈపిఎస్-95 కోసం యజమాని, ప్రభుత్వ వాటాల పెరుగుదల, 50 ఏండ్లు నిండకముందే పెన్షన్ చెల్లింపు, ధరల పెరుగుదలకనుగుణంగా పదవీ విరమణ వయసును 58 నుండి 60కు పెంచే అవసరాన్ని గుర్తించాలి. కనీస పెన్షన్ నెలకు రూ.9వేలకు తక్కువ కాకుండా నిర్ణయించడం లాంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే అంత ఈజీగా కేంద్రం చేయదు. ఎందుకంటే ఫెన్షన్‌ను హక్కుగా కాకుండా భిక్షగానే వారు అమలు చేస్తున్నారు. ఈపీఎస్-95పై సుప్రీం తీర్పును కేంద్రం అమలు చేయాలంటే దశలవారి ఆందోళనల ద్వారానే సాధ్యం.

బిజినెస్

బైజూస్‌లో వేలాది మందిపై వేటు..!

- కొత్త సీఈఓ ప్రణాళికలు



న్యూఢిల్లీ : కరోనా కాలంలో ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ తీవ్ర ఆర్థిక కటకటను ఎదుర్కొంటుంది. పొదుపు చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు దఫాలుగా ఉద్యోగులను తొలగించిన బైజూస్ మరోమారు వేలాది మంది సిబ్బందిని ఇంటికి పంపించే యోచనలో ఉందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. బైజూస్ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) అర్జున్ మోహన్ నియామకం తర్వాత కొత్త ప్రణాళికలు వేస్తున్నారని సమాచారం. దాదాపుగా 4000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని మంగళవారం ఆయన కంపెనీలోని సీనియర్ ఉద్యోగులకు తెలియజేసినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు వెల్లడించారు. సంస్థ సామర్థ్యం అంచనాలను అందుకోలేని ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులపైనా వేటు పడొచ్చు. సీనియర్ మేనేజ్‌మెంట్‌పై వెచ్చిస్తున్న ఖర్చును తగ్గించుకునే క్రమంలో ఆ విభాగం వారిపై ఎక్కువ ప్రభావం ఉండనుందని తెలుస్తోంది. ఫలితంగా ఉద్యోగుల వేతనాల కోసం వెచ్చిస్తున్న వ్యయాన్ని తగ్గించుకోవాలన్నది కీలక ప్రణాళిక. అలాగే వివిధ విభాగాలను విలీనం చేసి అన్నింటినీ బైజూస్ కిందకే తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారని తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోనే సంస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు విభాగాల్లోనూ ఒకే సిబ్బందిని ఉంచాలని యోచిస్తోంది. దీంతో అదనంగా ఉన్నవారిని బయటకు పంపనున్నారు. కరోనా సమయం 2021లో బైజూస్‌లో 52వేల మంది పని చేయగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 35వేలకు తగ్గిందని అంచనా.. భవిష్యత్తులో మరింత మందికి ఉద్వాసనలు పలకడంతో సిబ్బంది సంఖ్య ఎంతకు చేరనుందో వేచి చూడాలి.

పీఎన్‌బీ షేర్ల జిగేల్

- ఆరు నెలల్లో 80 శాతం ర్యాలీ



ముంబయి : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్లు స్టాక్ మార్కెట్‌లో పరుగులు పెడుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో ఏకంగా 81.48 శాతం ర్యాలీ చేశాయి. బీఎస్‌ఈలో బుధవారం 2.75 శాతం పెరిగి రూ.81.52కు చేరింది. ఇది 52 వారాల గరిష్ఠ స్థాయికి ఎగిసింది. ప్రస్తుత నెలలో పీఎన్‌బీ షేరు కొనుగోళ్ల డిమాండ్‌తో 28 శాతం లాభాలను పంచింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలు నమోదు చేయడం.. మదుపర్లలో విశ్వాసాన్ని పెంచింది. 2023-24 తొలి త్రైమాసికంలో రూ.1,255 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో కేవలం రూ.308.4 కోట్ల లాభాలకు పరిమితమయ్యింది.

లావా కొత్త బ్లేజ్2 ప్రో 5జి ఆవిష్కరణ

న్యూఢిల్లీ : దేశీయ మొబైల్ తయారీ కంపెనీ లావా కొత్తగా లావా బ్లేజ్ 2 ప్రో 5జినుఆవిష్కరించింది. బడ్జెట్ ధరలో ఈ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 8జిబి, 12.జిబి వేరియంట్ ధరను రూ.12,499గా నిర్ణయించింది. అక్టోబర్ 3 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభం అవుతాయని తెలిపింది. 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఎలక్ట్రానిక్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో కూడిన 50 ఎంపి ప్రధాన కెమెరాతో పాటు ముందు భాగంలో సెల్ఫీల కోసం 8 ఎంపి కెమెరాను అమర్చినట్లు పేర్కొంది.

ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ రూ.200 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ : శీతలీకరణ పరికరాల తయారీదారు, ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి కంపెనీ రూ.200 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపింది. అహ్మదాబాద్‌లో జరిగిన తమ 14వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వృద్ధి ప్రణాళికలను ప్రకటించినట్లు పేర్కొంది. వచ్చే మూడేండ్లలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించనున్నట్టు ఆ కంపెనీ సీఎండీ చంద్రకాంత్ పటేల్ పేర్కొన్నారు.

రూపే క్రెడిట్ కార్డ్‌లకు భలే డిమాండ్

- చిన్న నగరాల నుంచి ఆదరణ

న్యూఢిల్లీ : దేశంలో రూపే క్రెడిట్ కార్డ్‌లకు భారీగా డిమాండ్ పెరుగుతోందని ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ జడ్‌ఈటీ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. యూపీఐ చెల్లింపులకు రూపే క్రెడిట్ కార్డులు అనుసంధానం చేసేందుకు ఆర్బీఐ అనుమతించడంతో వాటికి ఆదరణ పెరుగుతోంది. భారత్‌లోని 706 చిన్న పట్టణాలు, నగరాల నుంచి రూపే క్రెడిట్ కార్డులకు వస్తున్న డిమాండ్ ఆధారంగా జడ్‌ఈటీ ఓ నివేదిక రూపొందించింది. ముఖ్యంగా టైర్ 2, 3, 4 నగరాల్లో రూపే క్రెడిట్ కార్డుల వాడకం పెరిగిపోయింది. అంతర్జాతీయ పేమెంట్ నెట్‌వర్క్‌లైన మాస్టర్, వీసా కార్డుల కంటే రూపే క్రెడిట్ కార్డులనే వినియోగదారులు ఎక్కువ కోరుకుంటున్నారు. జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో తమ వేదికగా రూపే క్రెడిట్ కార్డులకు 37 శాతం డిమాండ్ వచ్చిందని తెలిపింది. ఇదే త్రైమాసికంలో మాస్టర్ కార్డు క్రెడిట్ కార్డులకు 32 శాతం, వీసా కార్డులకు 31 శాతం మాత్రమే డిమాండ్ వచ్చిందని సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మనీష్ ష్రా తెలిపారు.

హైసెన్స్ నుంచి కొత్త టివి మోడల్స్

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల సంస్థ హైసెన్స్ ఇండియా మార్కెట్లోకి మూడు కొత్త టివి మోడల్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. యు7కె, యు6కె, ఇ7కెలను ఆవిష్కరించినట్టు ఆ సంస్థ పేర్కొంది. క్యూఎల్ఇడి డిస్ప్లే, 120హెచ్‌జడ్ హెచ్‌ఆర్ఆర్ ప్యానెల్, డాల్బీ విజన్ అండ్ అట్మోస్ ఫీచర్లను కలిగి ఉన్నాయని తెలిపింది. ఇవి 43, 50, 55, 65 అంగుళాల పరిమాణంలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ప్రారంభ ధర రూ.24,999గా నిర్ణయించినట్టు పేర్కొంది.

యూటీఐ ఎంఎఫ్ భారీ విస్తరణ

న్యూఢిల్లీ : ప్రముఖ యూటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యూటీఐ ఎఎంసీ) భారీ విస్తరణను ప్రకటించింది. సెప్టెంబర్ 29న ఒకే రోజు 29 నూతన ఆర్థిక కేంద్రాలను ప్రారంభించనున్నట్టు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ నాలుగు శాఖలను తెరువనుంది. దేశ ఆర్థిక పరిశ్రమలో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తూ, పెట్టుబడిదారులకు మెరుగైన ఆర్థిక సేవలు అందించే లక్ష్యంతో ఈ అడుగు వేసినట్టు పేర్కొంది. రేపు ప్రారంభించిన శాఖల్లో తెలుగు రాష్ట్రాల్లో అనంతపురం, కరీంనగర్, కర్నూల్, ఖమ్మం పట్టణాలు ఉన్నాయని తెలిపింది.

రాష్ట్రంలో ఎస్‌హెచ్‌జిలకు రూ.140 కోట్ల రుణాలు

- ఇండియన్ బ్యాంక్ మెగా క్యాంప్ ఏర్పాటు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ బుధవారం 'మెగా ఎస్‌హెచ్‌జి అవుట్‌రీచ్' క్యాంప్‌ను నిర్వహించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇమ్రాన్ అమిన్ సిద్ధిఖీ, ఎఫ్ఐ సెర్ప్ తెలంగాణ డైరెక్టర్ నరసింహా రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ క్యాంప్‌లో తెలంగాణ ఎస్‌హెచ్‌జిలకు రూ.140 కోట్లు, ఆంధ్రప్రదేశ్ ఎస్‌హెచ్‌జిలకు రూ.870 కోట్ల రుణాలు మంజూరు చేశారు. అదనంగా ఎంఎస్ఎంఇ ఔత్సాహికవేత్తలకు రూ.47.28 కోట్ల రుణాలు మంజూరు చేశారు. బ్యాంక్ ఉన్నతిలో ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యుల పాత్ర కూడా కీలకంగా ఉందని అమీన్ సిద్ధిఖీ అన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ ఎస్‌హెచ్‌జి గ్రూపులను సన్మానించారు.

ఉత్తమ పర్యాటక గ్రామాలుగా పెంబర్తి, చంద్లాపూర్

'వరల్డ్ టూరిజం డే' సందర్భంగా అవార్డుల అందజేత

- తెలంగాణ హస్తకళలు, పర్యాటక కేంద్రాలకు లభించిన గుర్తింపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామాల పురస్కారాలను తెలంగాణలోని జనగామ జిల్లాకు చెందిన పెంబర్తి, సిద్ధిపేట జిల్లాకు చెందిన చంద్లాపూర్ లు దక్కించుకున్నాయి. బుధవారం 'వరల్డ్ టూరిజం డే' సందర్భంగా ఢిల్లీ ప్రగతి మైదాన్ లోని భారత మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. కేంద్ర పర్యాటక శాఖ సెక్రెటరీ విద్యావతి ఈ అవార్డులను అందజేశారు. తెలంగాణకు దక్కిన అవార్డులను రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సిద్ధిపేట్ జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, చంద్లాపూర్ గ్రామ సర్పంచ్ సూరగోని చంద్రకళలు అందుకున్నారు. కాగా ఇత్తడి, కంచు లోహాలతో తయారు చేసే దేవతల విగ్రహాలు, కళా ఖండాలు, గృహ అలంకరణ వస్తువులతో పెంబర్తి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. అలాగే రంగనాయక స్వామి దేవాలయం, పరిసర ప్రాంతాలు గ్రామీణ పర్యాటకానికి ప్రసిద్ధి చెందడంతో పాటు ఇక్కడి గొల్లభామల చీరలకున్న ప్రత్యేకత కారణంగా చంద్లాపూర్ ఉత్తమ గ్రామంగా నిలిచింది.

సీఎం కేసీఆర్ కృషి వల్లే రాష్ట్రానికి అవార్డుల పంట : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గ నిర్దేశం, కృషి వల్లే తెలంగాణ రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు వస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ అవార్డులను అందుకున్న పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు ప్రకటించారు. పర్యాటక రంగంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశీయ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నామని తెలిపారు.

30న సెక్యూరిటీ గార్డుల రాష్ట్ర సదస్సు

వారికి జీవో 21 ప్రకారం వేతనాలివ్వాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు, ఇతర సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలనీ, జీవో నెంబర్ 21 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ సరిహద్దుల్లో సైనికులు సైన్యం కాపలా కాస్తుంటే దేశ ఉత్పత్తులు, ప్రజల ఆస్తులు, అనేక ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు సెక్యూరిటీ గార్డులు రక్షణ కల్పిస్తున్నారన్నారు. అటువంటి సెక్యూరిటీ గార్డుల జీవితాలకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 22 వేలకుపైగా సెక్యూరిటీ సర్వీసెస్ పరిశ్రమలో 22వేలకు పైగా ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీలున్నాయనీ, వాటిలో 90 లక్షల మందికిపైగా ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారని చెప్పారు. వారంతా బడుగు, బలహీన వర్గాల వారేనన్నారు. వారు రోజుకు 12 గంటల షిఫ్టులో పనిచేస్తున్నారని తెలిపారు. అదనపు పని చేస్తే ఓటీలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కూడా అమలు కావడం లేదని తెలిపారు. ప్రస్రా చట్టం ప్రకారం వారికి ఇవ్వాల్సిన ఉద్యోగ నియామక పత్రాలు కూడా ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సుధాకర్, నాయకులు అనిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఎలుకల బీభత్సం

- కలెక్టర్ సీరియస్.. విచారణకు ఆదేశం
- హుటాహుటిన పాఠశాలకు డీఈవో



నవతెలంగాణ- వైరా

ఖమ్మం జిల్లా వైరాలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 15మంది విద్యార్థినీలపై ఎలుకలు దాడి చేసిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు సోమశేఖరశర్మ హుటాహుటిన వైరాకు చేరుకున్న ఆయన విద్యార్థుల గదులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

అనంతరం ఎలుకల దాడికి సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్ బత్తుల రమను, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల పరిసరాలు, డార్మేటరీలు అధ్వానంగా తయారై ఎలుకల మందలు పెరిగిపోయినట్టు విద్యార్థినులు డీఈఓకు వివరించారు. కిచెన్‌ను పరిశీలిస్తున్న సమయంలో ఎలుకలు సంచారం చేయడంతో గమనించిన సిబ్బంది.. డీఈవో సమక్షంలోనే ఒక ఎలుకను చంపారు. దాంతో టీఎస్‌ఆర్ఎస్ ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందిపై డీఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల అందరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. ఎలుకలను పూర్తిస్థాయిలో నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈఓ వెంట సూపరింటెండెంట్ ప్రసాద్ ఉన్నారు.

లండన్‌లో ఘనంగా గణేశ్ శోభాయాత్ర



నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ ఫ్రెండ్స్ యూత్(హెచ్‌వైఎఫ్‌వై)-లండన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు జరిగాయి. బుధవారం గణేశ్ విగ్రహ శోభాయాత్ర సైతం భారీగా నిర్వహించారు. భారీ ఎత్తున రీడింగ్ నగర వీధుల్లో ప్రవాసుల నత్యాలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన కుటుంబాలే కాకుండా స్థానిక బ్రిటిష్ వాసులూ పాల్గొన్నారు. ఆట పాటలతో సంబరాలు చేసుకున్నారు. 'గణపతి బప్పా మోరియా', జై బోలో గణేష్ మహారాజ్ కి జై' అంటూ నినాదాలు చేశారు. సంస్థ అధ్యక్షుడు అశోక్ దూసరి మాట్లాడుతూ హైదరాబాద్ ఒక కాస్మోపాలిటన్ ప్రాంతం అని, అక్కడ ఎలాగైతే ప్రజలంతా కలిసి మెలిసి ఉంటారో, ఇక్కడ కూడా అలాగే అందరినీ కలుపుకొని ఈ పండుగ జరుపుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. లడ్డు వేలంపాటలో జీవన్, సుమన్ గోలి, మధు గులాయి కలిసి 1500 పౌండ్లకు దక్కించుకున్నట్టు చెప్పారు. అనంతరం థేమ్స్ నదిలో గణపయ్యలను నిమజ్జనం చేశారు. ఆ సంఘం నాయకులు జాహ్నవి దూసరి, సతీష్‌రెడ్డి, శ్రీకత్‌రెడ్డి జింకల, సుస్మిత, శ్రీనివాస, లక్ష్మి, హర్షరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుమన్ గోలి, నీలిమ, మధు గులైగారి, భావన, జీవన్, మమత, మహేందర్, శ్వేతా, అనిల్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నట్టు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎన్ఎండీసీలో విజిలెన్స్ వారోత్సవాలు

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎండీసీలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది 2023 వారోత్సవాలకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంస్థ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవా లన్నారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త పోకడలను అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగులకు విజిలెన్స్ శిక్షణ కార్యక్రమాలను సోమవారం నుంచే ప్రారంభించినట్లు ఎన్ఎండీసీ తెలిపింది. తొలి రోజు బీడీఎల్, మిధాని సీవీఓ ఉపేంద్ర వెన్నమ్, మంగళవారం జరిగిన సెషన్‌కు సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ సీవీఓ కన్వల్‌ప్రీత్ హాజరయ్యారని పేర్కొంది. ప్రతీ ఉద్యోగి పారదర్శకంగా పని చేయాలని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ అన్నారు.

గవర్నర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముహమ్మద్ ప్రవక్త జన్మదినమైన ఈద్ మిలాద్-ఉన్-నబీ శుభ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ముహమ్మద్ ప్రవక్త కరుణ, సహనం, ఐక్యత, సామరస్యం, సార్వత్రిక సౌభ్రాతత్వాలకు సంబంధించిన బోధనలు అందరి శ్రేయస్సు కోసం కృషి చేయడంలో మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని గవర్నర్ పేర్కొన్నారు. విశ్వాసం, శ్రద్ధ, దయ, కరుణతో మన తోటి ప్రజలకు సేవ చేసినప్పుడు అత్యంత గౌరవనీయమైన ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

విదేశీ ఉద్యోగాలు పొందేలా తగిన శిక్షణ

- రాణి కుముదిని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర యువత విదేశీ ఉద్యోగాలు పొందేలా అవసరమైన నైపుణ్యాల పెంపునకు తగిన శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థుల కోసం ఆమె జర్మనీ అస్పిల్డింగ్ (వొకేషనల్ ట్రైనింగ్)ను ప్రారంభించారు. టామ్ కామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జర్మన్ కాన్సులేట్ జనరల్ మైకెలా కుచ్లెర్, టామ్ కామ్ సీఈవో డాక్టర్ విష్ణు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటలో నిరాశే..

- మూడో వన్డేలో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి
- రోహిత్, కోహ్లి శ్రమ వృధా
- మ్యాక్స్‌వెల్ మ్యాజిక్ బౌలింగ్



రాజ్‌కోట్: మూడో వన్డేలో భారత్‌కు నిరాశ తప్పలేదు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 353పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 286పరుగులకే కుప్పకూలింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో చేజిక్కించుకుంది. అంతకుముందు టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు టాప్ ఆర్డర్ బ్యాటర్స్ రాణించారు. వార్నర్(56), మార్ష్(96), స్మిత్(74), లబూషేన్(72) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. ఓపెనర్లు వార్నర్-మార్ష్ కలిసి తొలి వికెట్‌కు 78పరుగులు జతచేశారు. ఆ తర్వాత వార్నర్ ఔటైనా.. మార్ష్-స్మిత్ కలిసి 2వ వికెట్‌కు 134పరుగులు జతచేశారు. ఆ తర్వాత లబూషేన్ కూడా అర్ధసెంచరీతో రాణించడంతో ఆసీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 352పరుగులు చేసింది. ఆసీస్ జట్టు 25ఓవర్లలో వికెట్ నష్టానికి 188పరుగులు చేసి 400కు పైగా పరుగులు చేసేలా కనిపించినా.. భారత బౌలర్లు ఆ తర్వాత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ ఆ మార్క్‌ను అందుకోలేకపోయింది.

ఛేదనలో భారత్‌కు ఓపెనర్లు రోహిత్-సుందర్ కలిసి తొలి వికెట్‌కు 74పరుగులు జతచేశారు. ఆ తర్వాత కోహ్లి(56) అర్ధసెంచరీతో మెరిసాడు. దీంతో భారత్ 26.3 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఆ దశలో ఆసీస్ ఆల్‌రౌండర్ మాక్స్‌వెల్ మ్యాజిక్ చేశాడు. టాపార్డర్ బ్యాటర్స్ రోహిత్, కోహ్లి, సుందర్, శ్రేయస్‌ను ఔట్ చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేచాడు. జడేజా(35), కేఎల్ రాహుల్(26) పర్వాలేదనిపించినా.. సూర్యకుమార్ (8) నిరాశపరిచాడు. దీంతో టీమిండియా 49.4ఓవర్లలో 286పరుగులకు ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి)రాహుల్ (బి)ప్రసిధ్ 56, మిచెల్ మార్ష్ (సి)ప్రసిధ్ (బి)కుల్దీప్ 96, స్మిత్ (ఎల్‌బి)సిరాజ్ 74, లబూషేన్ (సి)శ్రేయస్ (బి)బుమ్రా 72, క్యారీ (సి)కోహ్లి (బి)బుమ్రా 11, మ్యాక్స్‌వెల్ (బి)బుమ్రా 5, గ్రీన్ (సి)శ్రేయస్ (బి)కుల్దీప్ 9, కమిన్స్ (నాటౌట్) 19, స్టార్క్ (నాటౌట్) 1, అదనం 9. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 352పరుగులు.

వికెట్ల పతనం: 1/78, 2/215, 3/242, 4/267, 5/281, 6/299, 7/345

బౌలింగ్: బుమ్రా 10-0-81-3, సిరాజ్ 9-0-68-1, ప్రసిధ్ 5-0-45-1, జడేజా 10-0-61-0, సుందర్ 10-0-48-0, కుల్దీప్ 6-0-48-2.


భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి అండ్ బి)మ్యాక్స్‌వెల్ 81, సుందర్ (సి)లబూషేన్ (బి)మ్యాక్స్‌వెల్ 18, కోహ్లి (సి)స్మిత్ (బి)మ్యాక్స్‌వెల్ 56, శ్రేయస్ (బి)మ్యాక్స్‌వెల్ 48, కేఎల్ రాహుల్ (సి)క్యారీ (బి)స్టార్క్ 26, సూర్యకుమార్ యాదవ్ (సి)మ్యాక్స్‌వెల్ (బి)హేజిల్‌వుడ్ 8, జడేజా (ఎల్‌బి) సంఘా 35, కుల్దీప్ (బి)హేజిల్‌వుడ్ 2, బుమ్రా (సి)లబూషేన్ (బి)కమిన్స్ 5, సిరాజ్ (సి)కమిన్స్ (బి)గ్రీన్ 1, ప్రసిధ్ (నాటౌట్) 1, అదనం 0. (49.4 ఓవర్లలో ఆలౌట్) 286పరుగులు.



వికెట్ల పతనం: 1/74, 2/144, 3/171, 4/223, 5/233, 6/249, 7/257, 8/270, 9/286, 10/286

బౌలింగ్: స్టార్క్ 7-0-53-1, హేజిల్‌వుడ్ 8-0-42-2, కమిన్స్ 8-0-59-1, గ్రీన్ 6.4-0-30-1, మ్యాక్స్‌వెల్ 10-0-40-4, సంఘా 10-0-41-1.

ఆటలు



హైదరాబాద్‌కు చేరిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు

భారీ భద్రత నడుమ హోటల్‌కు తరలింపు

హైదరాబాద్: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆడేందుకు పాకిస్తాన్ జట్టు భారత్‌కు చేరుకుంది. బుధవారం లాహోర్ నుంచి దుబాయ్ మీదుగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరకున్న పాకిస్తాన్ ఆటగాళ్లను భారత భద్రత నడుమ హోటల్‌కు తరలించారు. ఇందులో 18మంది ఆటగాళ్లు, 13మంది సహాయక సిబ్బందితో కూడిన పాక్ బృందం ఉంది. వీరంతా లాహోర్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు విచ్చేశారు. వీరికి కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎయిర్ పోర్టు నుంచి నేరుగా వారికి కేటాయించిన హోటల్ కు తరలించారు. రేపు(29న) హైదరాబాదులోని ఉప్పల్ స్టేడియంలో పాకిస్తాన్ జట్టు న్యూజిలాండ్‌తో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రేక్షకులకు అనుమతించని సంగతి తెలిసిందే.

గురి తప్పని షూటర్లు

- మహిళల రైఫిల్-3 పొజిషన్, 25మీ. పిస్టోల్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణం
- హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్‌కు రెండు పతకాలు



హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో నాల్గోరోజు భారత షూటర్లు అదరగొట్టారు. మహిళల 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ శర్మ ప్రపంచ రికార్డును నమోదు చేసింది. బుధవారం జరిగిన పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్, మహిళల 25మీ. పిస్టోల్ టీమ్ విభాగాల్లో నాల్గోరోజు భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కాయి. పురుషుల స్కీట్‌లో అనంత్‌జీత్ సింగ్, మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ టీమ్, మహిళల వ్యక్తిగత 25మీ. పిస్టోల్ విభాగంలో ఈషా సింగ్ రజత పతకాలను సాధించారు. అలాగే మహిళల 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో భారత్‌కు మరో రజతం దక్కింది. పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్, పురుషుల 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్‌తోపాటు మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్‌లో రమిత కాంస్య పతకాలను సాధించారు. సెయిలింగ్ ఐఎల్‌సిఎ 7 విభాగంలో విష్ణు శరవణన్ కాంస్యం సాధించాడు. నాల్గోరోజు భారత్‌కు దక్కిన పతకాల్లో సెయిలింగ్ మినహా.. మిగతా పతకాలన్నీ షూటింగ్‌లో వచ్చాయి.

ఈషా బంగారం...

హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్ షూటింగ్‌లో మెరిసింది. మహిళల 25మీ. పిస్టోల్ విభాగంలో స్వర్ణం కైవసం చేసుకోగా.. వ్యక్తిగత 25మీటర్ల పిస్టోల్ విభాగంలో రజత పతకాన్ని ఒడిసిపట్టుకుంది. 25మీ. పిస్టల్ విభాగంలో మను బాకర్, రిథిమ్ సంగ్వాన్, ఈషా సింగ్‌లతో కూడిన భారత మహిళల జట్టు 1759 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది.



సెయిలింగ్‌లో విష్ణు శరవణన్‌కు కాంస్యం

సెయిలింగ్‌లో భారత్‌కు మరో పతకం దక్కింది. పురుషుల డింగీ ఐఎల్‌సిఎ-7 విభాగంలో 24 ఏళ్ల విష్ణు శరవణన్ 34 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు. సింగపూర్ సెయిలర్‌లో జున్ హాన్ ర్యాన్ స్వర్ణం, దక్షిణకొరియా సెయిలర్ జీమిన్ రజత పతకాలు సాధించారు. పురుషుల విండ్ సర్ఫర్ ఈవెంట్‌లో మరో సెయిలర్ ఇబాద్ అలీ కాంస్యం ఖాయం చేశాడు.

ఈ రేసులో 52 పాయింట్లతో ఇబాద్ అలీ మూడో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ పతకాల సంఖ్య 22కి చేరింది. ఇందులో ఐదు స్వర్ణాలు, ఏడు రజతాలు, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ఆరో స్థానంలో కొనసాగుతోంది.

క్రికెట్‌లో యువరాజ్ రికార్డు బద్దలు..

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో నేపాల్ జట్టు కెప్టెన్ విధ్వంసం సృష్టించింది. గ్రూప్-ఎలో భాగంగా జరిగిన ఈ పోటీలో నేపాల్ కెప్టెన్ కేవలం 9బంతుల్లోనే అర్ధసెంచరీ కొట్టి యువరాజ్ సింగ్(11బంతుల్లో అర్ధసెంచరీ) పేరిట ఉన్న రికార్డును బ్రద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 20ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. నేపాల్ ఆటగాడు

టి20 ఫార్మాట్‌లో నమోదైన ప్రపంచ రికార్డులివీ..

- అంతర్జాతీయ టి20ల్లో ఒక జట్టు 300కు పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి.
- కుషాల్ మల్ల 34 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. అంతర్జాతీయ టి20ల్లో ఇదే వేగవంతమైన సెంచరీ. రోహిత్ శర్మ, డేవిడ్ మిల్లర్(35 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నారు.
- ఈ ఫార్మాట్‌లో 9బంతుల్లోనే అర్ధసెంచరీ చేయడం ఇదే తొలిసారి. దీపేంద్ర సింగ్ మంగోలియాపై కొట్టి చరిత్రకెక్కాడు. దీంతో 2007 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ 12 బంతుల్లో అర్ధసెంచరీ రికార్డు బ్రద్దలైంది.
- ఈ ఫార్మాట్‌లో ఇదే అతిపెద్ద విజయం. 273 పరుగుల తేడాతో నేపాల్ జట్టు మంగోలియాపై నెగ్గింది. గతంలో చెక్ రిపబ్లిక్ జట్టు టర్కీపై 257 పరుగుల తేడాతో గెలుపొందింది.
- 520-ఈ మ్యాచ్లో దీపేంద్ర సింగ్ స్ట్రయిక్‌రేట్ ఇది. అంతర్జాతీయ టీ20ల్లో పది కంటే ఎక్కువ బాల్స్ ఆడిన ప్లేయర్లలో ఇదే అత్యధిక స్ట్రయిక్‌రేట్.
- 26 సిక్సర్లలో అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో ఇదే అత్యధికం. గతంలో ఐర్లాండ్‌పై ఆఫ్ఘనిస్థాన్ 22 సిక్సర్లు బాదింది.

తొమ్మిది బంతుల్లోనే నేపాల్ బ్యాటర్



కుషాల్ మల్ల (50బంతుల్లో 137నాటౌట్; 8ఫోర్లు, 12సిక్సర్లు) విధ్వంసానికి తోడు.. కెప్టెన్ రోహిత్ పడేల్ (27బంతుల్లో 61; 2ఫోర్లు, 6సిక్సర్లు) అర్ధసెంచరీతో మెరిసాడు. ఇక చివర్లో దీపేంద్ర సింగ్ (10బంతుల్లో 52నాటౌట్; 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఛేదనలో మంగోలియా జట్టు 41 పరుగులకే ఆలౌటైంది. దీంతో నేపాల్ జట్టు 273 పరుగుల తేడాతో మంగోలియాపై ఘన విజయం సాధించింది. టి20 ఫార్మాట్‌లో ఇదే అతి పెద్ద విజయం.

మల్టీజోన్-2లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి

- మంత్రి సబితకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మల్టీజోన్-2 పరిధిలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలను పూర్తి చేశారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా క్యాడర్ స్ట్రెంత్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు హైకోర్టుకు వెళ్లారని పేర్కొన్నారు. మల్టీజోన్-2 పరిధిలోని పదోన్నతులు, బదిలీలు నిలిపేశారని తెలిపారు. మల్టీజోన్-1 పరిధిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు పూర్తి చేశారని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల బదిలీలకు ఆప్షన్లు ఇవ్వాలంటూ షెడ్యూల్ జారీ చేశారని వివరించారు. దీంతో మల్టీజోన్-2 పరిధిలోని ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. విద్యామంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని మల్టీజోన్-2 పరిధిలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి చేయాలని కోరారు. మల్టీజోన్-2 ఉపాధ్యాయులు పదోన్నతుల సందర్భంగా నష్టపోకుండా చూడాలని తెలిపారు. మల్టీజోన్-1 ఉపాధ్యాయుల పదోన్నతుల తేదీ నుంచే మల్టీజోన్-2 ఉపాధ్యాయులకు పదోన్నతుల పోస్టులో సర్వీసు లెక్కించుటకు రెట్రోస్పెక్టివ్‌గా పదోన్నతులను వర్తింపచేయాలని సూచించారు.

స్వరాష్ట్రంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలోనే ఆర్యవైశ్యులకు సముచిత గౌరవం, గుర్తింపు లభించిందని తెలంగాణ రాష్ట్ర పోలీస్, గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మెన్ కోలేటి దామోదర్ తెలిపారు. 75 ఏండ్ల చరిత్రలో రాని గుర్తింపు ఈ తొమ్మిదేండ్లలోనే వచ్చిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్యులకు ఐదెకరాల భూమిని ఇచ్చిన మానవతావాది కేసీఆర్ అని తెలిపారు. అవసరమైన కొన్ని ప్రాంతాల్లో ఆర్యవైశ్య భవనాల నిర్మాణానికి స్థలాలతోపాటు నిధులిచ్చిన దార్శనికుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. వారికి రాజకీయ పదవులిచ్చారని వివరించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి బాసటగా నిలిచిన కేసీఆర్‌కు ప్రతిఒక్కరూ అండగా నిలిచి బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయానికి కృషి చేయాలని కోరారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ అర్హతపై ఆర్డినెన్స్ తేవాలి : టీఎస్‌పీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతులు పొందడానికి నిర్దేశించిన టెట్ ఉత్తీర్ణత కావాలన్న ఎన్‌సీటీఈ నిబంధన జారీచేసిన తేదీ నుంచి వర్తించే విధంగా ఆర్డినెన్స్ తేవాలని టీఎస్‌పీటీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్‌అలీ, పిట్ల రాజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలా చేయకుంటే పదోన్నతుల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఆటంకాలు వస్తాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం ముందుకు సాగాలంటే అందుకనుగుణంగా సవరణ ఆదేశాలను ఎప్పటికప్పుడు జారీ చేయడం ఒక్కటే పరిష్కారమని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చివరి పేద వరకూ ఇల్లు

నిర్మాణ దశలో మరో 30వేలు

- 24 నియోజకవర్గాల్లో 36వేల మంది ఎంపిక
- 2, 5వ తేదీల్లో పంపిణీ : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చివరి పేద వరకూ అందరికీ అందించడమే ప్రభుత్వ ఆశయమని పశు సంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మూడో విడతలో భాగంగా బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆన్‌లైన్ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. ఆన్‌లైన్ లాటరీ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలోని 24నియోజకవర్గాల్లో మూడో విడతలో 36,884 మంది లబ్దిదారులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ విడతలో వికలాంగులు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించడంతో వికలాంగులకు 1,843, ఎస్సీలకు 6,271, ఎస్టీలకు 2,215, ఇతరులకు 26,555 కేటాయించామన్నారు.



లోకల్ కోటాతో కలిపి మొత్తం 39,804 ఇండ్లను కేటాయించినట్టు తెలిపారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, మరో 30వేల ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. ఎంపికైన వారికి రెండు విడతల్లో వచ్చేనెల 2, 5వ తేదీల్లో ఇండ్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందనలు తెలిపారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. మూడో విడత ఇండ్ల కేటాయింపులో పారదర్శకత కోసం ఎన్ఐసీ సహకారంతో ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక చేశామన్నారు.

మంత్రులు మహమూద్ అలీ, నగర మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బెగ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, బేతి సుభాష్ రెడ్డి, అరికెపూడి గాంధీ, సుధీర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో ఆన్‌లైన్ డ్రా కార్యక్రమం సాగింది. అలాగే హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు వెన్నంటి నిలిచిన కొండ లక్ష్మణ్‌బాపూజీ : మండలి చైర్మెన్ గుత్తా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు కొండ లక్ష్మణ్‌బాపూజీ వెన్నంటి నిలిచారని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని శాసనసభ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్, శాసన మండలి చీఫ్‌విప్ భాను ప్రసాదరావు, ఎమ్మెల్సీలు వాణి దేవి, మధుసూదనా చారి, బోగారపు దయానంద్, ఎల్. రమణ, శేరి సుభాష్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, బీఆర్ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాభవన్‌లో వార్‌రూమ్, కనెక్ట్ కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన మాణిక్‌రావు ఠాక్రే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్ .

ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో వార్‌రూమ్, కనెక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వాటిని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పరిశీలకులు దీపదాస్ మూన్షి, మీనాక్షి నటరాజన్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రోహిత్ చౌదరి, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, మధుయాష్కీ, ప్రేమ్‌సాగర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ వార్‌రూమ్, కనెక్ట్ సెంటర్లు ఎన్నికల కోసం పనిచేస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించి పార్టీ క్యాడర్‌కు సూచనలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇది పార్టీ క్యాడర్‌కు భరోసా కల్పిస్తుందని చెప్పారు.

65 లక్షల ఎకరాల్లో వరి సాగు

మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈ వానాకాలంలో 65 లక్షల ఎకరాల్లో వరి సాగైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు ఇది అత్యధికమని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇది ఒక రికార్డుస్థాయి అన్నారు. ఒక్క నాగర్ కర్నూలు జిల్లాలో గతం కంటే 24 వేల ఎకరాల్లో వరి పంటను వేశారనని తెలిపారు. సిద్దిపేట, సంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలలో పెరిగిందన్నారు. మరోవైపు యాసంగి సాగుకు సన్నద్ధం చేయాలని అధికారులకు సూచనలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన ఆయిల్‌పామ్, యాసంగి సాగు తదితరుల అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాది యాసంగిలో 74 లక్షల ఎకరాల్లో సాగైందనీ, ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ వానాకాలంలో ఇప్పటి వరకు కోటి 26 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు, మరో 12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు 1.93లక్షల ఎకరాలకు చేరిందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అందుబాటులో ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు తెలిపారు. రబీ పంటల సాగు కోసం అన్ని రకాల ఎరువులు కలిపి 18.64 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించినట్టు తెలిపారు. సుమారు 75 నుంచి 80లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగవుతాయని అంచనా వేసినట్టు తెలిపారు. రబీసాగు కోసం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చామనీ, 9.2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందన్నారు. గత యాసంగి కంటే సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిమేరకు 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రానికి లేఖ రాసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 21.34 లక్షల రైతులకు చెందిన రూ.11,812.14 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. బ్యాంకు ఖాతా మూతపడడం, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు చేస్తామన్నారు. రుణమాఫీ సందేహాల నివృత్తి కోసం రాష్ట్రస్థాయిలో 040 23243667 నంబరులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు కొండిబ, అదనపు సంచాలకులు విజయ్ కుమార్, ఆగ్రోస్ ఎండీ రాములు తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 5న ఛలో డైరెక్టరేట్

- జీవో 142 రద్దు పోరాట కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో జీవో 142ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న ఛలో డైరెక్టరేట్ నిర్వహించాలని జీవో 142 రద్దు పోరాట కమిటీ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశమై పోరాట కార్యాచరణను ఖరారు చేసింది. సెప్టెంబర్ 28, 29న రెండు రోజులు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులకు, ఇతర ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ, 30న జిల్లా కేంద్రాల్లో ప్రెస్ మీట్ నిర్వహణ, అక్టోబర్ 2న మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పణ, 3న హైదరాబాద్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుల ప్రెస్ మీట్, 4న ఛలో డైరెక్టరేట్ ప్రణాళిక రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను జిల్లాల్లో అమలు చేయాలని వారు వైద్యారోగ్యశాఖ ఉద్యోగులను కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు సాయిరెడ్డి, యాదానాయక్, శ్యాంసుందర్, వెంకటేశ్వర్ రెడ్డి, నెహ్రూ చంద్, రాబర్ట్‌బ్రూస్, ప్రసాద్, రామలక్ష్మి, చంద్రప్రకాష్, పసియుద్దీన్, రాజశేఖర్, దేవ్‌సింగ్, సత్యనారాయణ, సుదర్శన్, బలరాం, మహాల, వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7
నవతెలంగాణ
సమస్త తెలుగు ప్రజల దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం - చార్మినార్
గురువారం | సెప్టెంబర్ 28, 2023 | www.navatelangana.com

డ్రాప్ బాల్ నేషనల్ పోటీకి పుల్లారెడ్డి విద్యార్థులు



నవతెలంగాణ - చైతన్యపురి

ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో జరిగే డ్రాప్ బాల్ నేషనల్ పోటీకి పుల్లారెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థులు సెలెక్ట్ అవడం ఎంతో సంతోషించే విషయమని పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ అన్నారు. ఘజియాబాద్‌కు బుధవారం సెలెక్ట్ అయిన విద్యార్థులు బయలుదేరి వెళ్తుండడంతో వారిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రాప్ బాల్ కోచ్ రవి, ఎన్సీసీ ఆఫీసర్ నందు, పీటీ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రగతి డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ- చైతన్యపురి

ప్రగతి డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారంఆర్కేపురంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ ఆర్ రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సీతారాం రెడ్డిలు హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని అన్నారు. ఈ పోటీ ప్రపంచాన్ని తట్టుకొని నిలబడాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, ప్రిన్సిపల్ చెన్నా రెడ్డి, డైరెక్టర్ మంజు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జై చందర్ పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సరూర్ నగర్ పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్స్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కిసర నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. వారంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని గుర్తు చేశారు. ముఖ్యంగా కరోనా విపత్తు సమయంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. డబ్ల్యూహెచ్ఓ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని కొనియాడారు. అలాంటి వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అని అన్నారు. నేటికీ ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే ఆశా వర్కర్ల పని భారం విపరీతంగా పెరిగింది అన్నారు. చాలీచాలని జీతాలతో ఆశాలు అప్పుల పాలవుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశాలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ. 18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు, సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఈ. నరసింహ, ఆలేటి ఎల్లయ్య, ఎం వీరయ్య, వృత్తిదారుల నాయకుడు సిహెచ్ వెంకన్న, గిరిజన సంఘం నాయకులు గోపీనాయక్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, రమ్య, హేమలత కృష్ణవేణి, అన్నపూర్ణ, శోభ, రజిత, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల పట్టాలివ్వాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

ఇండ్లు లేని నిరు పేదలకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తుకు బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.283 లో గతంలో పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలాల కోసం సుమారుగా10 ఎకరాల స్థలాన్ని నాటి ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. కానీ అందుకు సంబంధించిన ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ళుగా నివాస యోగ్యత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు ప్రభాకర్, యాదయ్య, అంజయ్య, బాధిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- వేడుకల్లో డీజే సౌండ్ సిస్టం వినియోగించడం నిషేధం
- అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి : సీఐ మన్మోహన్



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

గణేష్ నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకొని.. క్షేమంగా తిరిగి ఇంటికి వెళ్లాలని ప్రజలకు సీఐ మన్మోహన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ గణపతి నిమజ్జనంలో డీజే సౌండ్ సిస్టం నిషేధమన్నారు. ఆల్కాహాల్ సేవించినా, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన కేసు నమోదు చేసి, కోర్టుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. నగరంలో నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 28న ఉదయం 6 గంటల నుంచి 29న సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయాలని ఆదేశించారు. అలాగే బెల్ట్ షాపుల్లో ఎవరైనా అక్రమ మద్యం అమ్మినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, ఇనాం గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బైరన్ ఖాన్ చెరువులో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పూర్తైనట్లు తెలిపారు. మూడు క్రేన్లను అందుబాటులో ఉంచినట్లు తె3లిపారు. పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించడం జరుగుతుందన్నారు. సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేశామని, దీనిని ప్రజలందరూ గమనించాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు నిమజ్జన ప్రాంతానికి దూరంగా ఉండాలన్నారు. వేడుకల్లో పెద్ద పెద్ద కర్రలు, ఆయు ధాల వంటివి వినియోగించుకోవడం నిషేధమని అని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా ముందస్తుగానే పోలీస్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామ న్నారు. సమాచారం ఇవ్వాల్సిన ఫోన్ నెం. 8712662650, పెట్రోల్ మొబైల్ ఫోన్ నెంబర్స్ 8712662651 8712662652 కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

చరిత్రలో ఒక విపత్తుగా మిగిలిపోయిన మూసీ వరదలు

ఎఫ్బీహెచ్ నేత్రత్వంలో సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్ (సీడీఎస్), డెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ (డీహెచ్టీ), జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్ (జేబీఆర్ఏసీ) సహకారంతో 1908 వరదల సమయంలో 150 మందికి పైగా ప్రాణాలను కాపాడిన ఉస్మానియా జనరల్ ఆసుపత్రి ఉద్యానవనంలోని "ప్రాణదాత చింతచెట్టు" కింద 1908 మూసీ వరదల బాధితులకు నివాళులు అర్పించడానికి మన నగర పర్యావరణాన్ని, వారసత్వాన్ని పరిరక్షించే అవసరంపై స్మారక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.



150పైగా మందిని కాపాడిన

ప్రాణదాత చింతచెట్టు

నవతెలంగాణ - ధూల్ పేట్

మూసీ వరదలు హైదరాబాద్ చరిత్రలో ఒక విపత్తుగా మిగిలిపోయిందని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్బీహెచ్) చైర్మన్, ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ అన్నారు.

మూసీ వరదలకు 115 ఏళ్లు..

1908లో సెప్టెంబర్ 28న సంభవించిన వినాశకరమైన మూసీ మహావరదలకు సరిగ్గా 115 ఏళ్లు అని ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ అన్నారు. ఈ విషాదానికి పర్యవసానంగా నాటి పాలకులు..నిపుణులైన ప్రణాళికాకర్తల సహాయంతో పటిష్టమైన వివిధ నగర అభివృద్ధి ప్రణాళికలను, పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఇది మన నగరాన్ని ఆధునిక నగర ప్రణాళికకు మాదిరి అన్నారు. 1908లో మూసీ నది వరదలకు 150 మందికి ఆశ్రయం కల్పించిన చింతచెట్టు చరిత్రను వివరించారు. వరదల అనంతరం హైదరాబాద్ 7వ నిజాం 1914 లో సిటీ ఇంప్రూవ్ మెంట్ బోర్డు సంస్థ ఏర్పాటు చేసి నగరాన్ని ఒక లేక్ సిటీ, గార్డెన్ సిటీ, సైకిల్ సిటీ, సమగ్ర డ్రైనేజ్ వ్యవస్థ పరంగా హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలో ఒక ముఖ్య నగరంగా ఎదగడమే ఎజెండాగా ప్రణాళికలను రూపొందించి..నగర సుందరీకరణలో నిమగ్నమయ్యారన్నారు. ఏ నగరానికైనా మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం అని అన్నారు. హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అమలు విషయంలో కూడా ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించి కాలుష్య రహిత, శబ్దరహిత నగరం, ప్రణాళికాబద్ధమైన రవాణా వ్యవస్థ, వసతులు, డ్రైనేజీ వ్యవస్థ, ఘన వ్యర్థాలను శుద్ధి తదితర ప్రణాళికలను రూపొందించడం వలన నగరానికి క్రమబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. నగరంలోని వారసత్వ చారిత్రక భవనాల రక్షణ, వాటిలోని కనీసం 5, 6 భవనాలకు యునెస్కో గుర్తింపు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ మహోన్నత కార్యంలో సమాజంలోని పౌరులను భాగస్వాములను చేయడం ద్వారా మరింత పటిష్టమైన రూపకల్పన జరుగుతుందని అని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



ఎఫ్బీహెచ్ జాయింట్ సెక్రెటరీ సంఘమిత్ర మాలిక్, చింతచెట్టు, పర్యావరణంపై పాట పాడారు. పాఠశాల విద్యార్థులు, యువతను స్వాగతిస్తూ ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ భవిష్యత్ అభివృద్ధి వారిపైనే ఆధారపడి ఉందని, వారి భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ నాగేంద్ర..మూసీ నది పరిరక్షణను గుర్తు చేస్తూ, ఈ దిశలో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సజ్జన్ సింగ్ ప్రకృతి 5 ప్రాథమిక అంశాలైన నీరు, గాలి, భూమి, ఆకాశం, మన సహజ వనరుల ఉనికిని గౌరవించడం, దాని పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రామ్మోహనరావు జీవితంలో చెట్టు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నయీం ఉల్లా షరీఫ్ గంగా జమునా తహజీబ్‌ను గుర్తుచేశారు. 1908లో మరిన్ని చెట్లు ఉంటే మరిన్ని ప్రాణాలను కాపాడేవని ధనుంజయ్ అభిప్రాయపడ్డారు. మసూద్ వ్యాసాలు రాయడం, కార్యకలాపాలు చేయడంతో పర్యావరణ పరిరక్షణకు సహకారం పై మాట్లాడారు.

వర్షపు నీటి సంరక్షణ నిపుణుడు సుభాష్ రెడ్డి సందర్శకుల కోసం చింతచెట్టు ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి ఒక శిలాఫలకాన్ని లిఖించి ప్రవేశ ద్వారం వద్ద ఉంచాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని అభ్యర్థించారు. 1908లో మూసీ వరదల సమయంలో ప్రజల దుస్థితిని వివరిస్తూ విద్యార్థులు పర్యావరణ సమస్యలకు సంబంధించిన పాటలు పాడారు. మూసీ వరదలకు నివాళిగా చింతచెట్టును స్మరిస్తూ పాల్గొన్నవారు ఒక మొక్కను నాటారు. పరాశర్జీ, బాబు గురుజీ అందించిన 'లావణి' పాట వినాశకరమైన వరదలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని సివిల్ సొసైటీ గ్రూపులు, పర్యావరణవేత్తలు, ఉస్మానియా వైద్య కళాశాల వైద్యులు, ఏపీఎస్ఎ, అమన్ వేదిక, రెసిడెన్షియల్ అసోసియేషన్ కోవా, చత్రి, ఎస్ఆర్ డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, డెక్కన్ అకాడమీ, తదితర సంస్థల సభ్యులు, జె.బి.ఆర్ ఆర్కిటెక్చర్, (జేబీఆర్ఏసీ) ఇంజనీరింగ్ , ఫార్మసీ, కాలేజ్, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్ నగర్, ఫోకస్, పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ పర్యటక రంగ

అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక పర్యటక ప్రదేశాలను అభివృద్ధి చేసి, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాల కామర్స్ మేనేజ్మెంట్ విభాగం మూడు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక వేడుకల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భౌగోళికంగా దక్కను పీఠభూమిపై ఉండి సంవత్సరం పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణం వుండే తెలంగాణ రాష్ట్రంలో పర్యటక రంగం ఇప్పటికే దేశవిదేశీ పర్యటకులను ఆకర్షిస్తున్నదని, మరింత అభివృద్ధి చేయడం ద్వారా ఇదొక ఆదాయ వనరుగా కూడా తోడ్పడుతుందని భావిస్తున్నట్లుగా చెప్పారు. చారిత్రక, భాషా, సాంస్కృతిక వైవిధ్యం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలని, ఆ స్ఫూర్తిని ఇనుమడింపజేసే కట్టడాలు, దేవాలయాలు, మెట్లబావుల పునరు ద్ధరణ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. 100 ఏండ్ల చారిత్రక భవనంలోని సిటీ కళాశాల బీబీఏ ట్రావెల్ టూరిజం కోర్సు అందించటం అభినందనీయమని, పర్యాటక అభివృద్ధి సంస్థ క్షేత స్థాయిలో విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్షిప్పులు అందిస్తుందని హామీ ఇచ్చారు.

ప్రపంచ సంస్కృతికి మీనియేచర్ హైదరాబాద్..

కాలు కదుపకుండా అభివృద్ధిని సాధించలేమని, ఆదిమ కాలంలో ఆహారం, రక్షణ కోసం పరుగులు పెట్టిన మనిషి... ఇవ్వాళ జ్ఞానవిజ్ఞానాల కోసం, ఆనందానుభూతుల కోసం దేశ విదేశాలు పర్యటిస్తున్నాడని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్.మామిడి హరికృష్ణ అన్నారు. ప్రపంచమంతా తిరిగి చూడలేని వాళ్ళు భారతదేశాన్ని, దేశమంతా తిరగలేని వాళ్ళు తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్రమంతా తిరిగి చూడలేని వాళ్లు హైదరాబాద్ నగరాన్ని తిరిగి చూస్తే చాలని, ప్రపంచ సంస్కృతికి హైదరాబాద్ ఒక మీనియేచర్ అని అన్నారు. హిస్టారికల్ టూరిజం, ఏకో టూరిజం, మెడికల్ టూరిజం, టెంపుల్ టూరిజం పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధ ప్రాంతాలను రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చేస్తూ దేశంలో అగ్రగామిగా నిలబెట్టే విధంగా కృషి చేస్తుందని కొనియాడారు. దీని వలన గత కొన్ని సంవత్సరాలుగా దేశవిదేశీ పర్యటకుల సంఖ్య పెరిగిందని అన్నారు. విద్యార్థులు కొత్తకొత్త ప్రదేశాలు తిరిగి చూడటమే కాక, అయా ప్రాంత విశేషాలను అక్షర బద్ధం చేయాలని, అక్కడి ప్రత్యేకలను ఇతరులకు తెలియజేయాలని సూచించారు.

ఐఆర్ సిటిసి జనరల్ మేనేజర్ సత్య కిశోర్ మాట్లాడుతూ.. ట్రావెల్ టూరిజం కోర్సు చేసిన విద్యార్థులకు అనేక ఉద్యోగ ఉపాధి అవకాశాలున్నాయని అన్నారు. ఈ విషయమై విద్యార్థులకు తగిన సూచనలు, అవసరమైన సమాచారం అందించటానికి తమ సంస్థ కళాశాలతో ఒక అవగాహన ఒప్పందం చేసుకోవచ్చని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. చదువుకుంటూనే ఉపాధి అందించగల కోర్సులలో చేరటానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. బిబిఏ ట్రావెల్ టూరిజం కోర్సు ఈ సంవత్సరమే ప్రారంభించామని, అన్ని సీట్లు నిండటమే కాక అనేక దోస్త్ ద్వారా అనేక దరఖాస్తులు అందుకున్నామని అన్నారు. అనంతరం మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేతలైన వివిధ కళాశాలల విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సభలో కామర్స్ మేనేజ్మెంట్ హెడ్ డాక్టర్.రత్న ప్రభాకర్, డాక్టర్.రవీంద్ర బాబు, డాక్టర్.జయా కాగడా, డాక్టర్.శిరీష పాల్గొన్నారు.

రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర సర్కార్



- చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ, 24గంటలూ ఉచిత విద్యుత్, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు, రైతు బీమా ఇలా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అదే విధంగా సహకార సంఘం బ్యాంకు ద్వారా రైతులకు వ్యాపార రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, డైరెక్టర్లు ఎల్బాల సుదర్శన్ రెడ్డి, తిరుపతి గిరిరాజ్, సప్పిడి కొండల్ రెడ్డి, సి.ఈ.ఓ ఆలిస్, మేనేజర్ నారాయణ రెడ్డి, బ్యాంకు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

బీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం ఆధ్వర్యంలో ఈ నెల 30న జరగబోయే ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష సందర్భంగా బుధవారం రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ గురించి సీఎం కేసీఆర్‌కు గతేడు కిందట వినతి పత్రం ఇచ్చినట్లు గుర్తుచేశారు. సుమారు ఒక లక్ష 50 వేల ఆర్యవైశ్యుల జనాభా గల ఏకైక తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అని అన్నారు. ఇతర సంస్థలు మహాసభకు పోటీ కాదు అని, 120 ఏండ్ల కల ఆర్యవైశ్య మహాసభ అని అన్నారు. రాష్ట్రంలో అధికంగా బీద ఆర్యవైశ్యులు కూడా నివసిస్తున్నారని..వారందరూ ఆర్థికంగా ఎదగాలంటే కార్పొరేషన్ ఒకటే మార్గం అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణు కుంట్ల గణేష్ గుప్తా, మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్ చింతల రవికుమార్ గుప్తా, మహాసభ కార్యదర్శి మొగిలి ఉపేందర్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు అర్థం లక్ష్మయ్య, కిరణ్, జిన్నం వేణు, వనపర్తి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడలోని వాసవీ శివనగర్ గోపి మెమోరియల్ హై స్కూల్‌లో మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి సహకారంతో బుధవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారిని ఆస్పత్రికి పంపించారు. ఆపరేషన్ చేయించుకున్న వారిని మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పలకల నరసింహారెడ్డి, సుధాకర్ చారి పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించిన మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డికి బాధితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.

కార్మికులు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-కీసర

వైద్య శిబిరాలను కార్మికులు వినియోగించుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 2 తేదీ వరకు చేపట్టిన "స్వచ్ఛతహీ సేవా "కార్యక్రమంలో భాగంగా బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంపు నిర్వహించారు. సిబ్బందికి మందులు పంపిణీ చేశారు. అనంతరం నాసిన్ చెరువులో వ్యర్థాలను, చెత్తను సిబ్బందితో తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరిత, రాజమల్లయ్య, వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ రామారం శ్రీహరి గౌడ్, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మణీయుడు

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమా రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడు అని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక ఉద్యమకారుడిగా, ప్రజాస్వామ్య వాదిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడి గా భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు.





న్యాయవాది గా పలువురి తరపున న్యాయ పోరాటం చేసిన ప్రజాస్వామిక వాది అన్నారు. కొండా లక్ష్మణ్ చేసిన నిస్వార్థ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్ రెడ్డి, కె.రాములు, జి.పర్వతం, సిహెచ్ మదన్ మోహన్ రావు, ఎస్ స్వామిరెడ్డి, జి.గోపాల్ అధికారులు కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి అర్పించారు.

కాప్రాలో..

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108 జయంతిని భాషనరుషి కోపరెటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సీతాంజనేయులు ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్‌లోని పద్మాశాలీ టౌన్‌లో నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో భావనరుషి కోపరెటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కమిటీ కార్యదర్శి రమేష్, నాగభూషణం, విశ్వేశ్వర్‌రావు, మల్లీశ్వరి, శివలీల, వసుధ నాయకులు ఉన్నారు.

జవహర్‌నగర్‌లో...

కొండా లక్ష్మణ్ బాపూజీ బలహీన వర్గాల చైతన్యానికి ప్రతీకగా నిలిచారని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. పద్మశాలీ సంఘం అధ్యక్షులు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి ముకుందాం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్. పద్మశాలి సంఘం ప్రతినిధులు కుందారపు పోశయ్య, ఆంజనేయులు, కృష్ణ, బాబా, శంకర్, సురేష్, లక్ష్మి నారాయణ, రాములు, నర్సింహా, రాములు, సీతా మార్కండయ్య, భాస్కర్, శ్రీనివాస్, తదితరలున్నారు.



లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-కాప్రా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ డిస్ట్రిక్ట్ 320-సి జిల్లా వైస్ గవర్నర్ వి.కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన లయన్స్ ఐ కేర్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం సైనిక్‌పురి నేరేడ్‌మెట్ లయన్స్ ఐ కేర్ విజన్ సెంటర్ వద్ద మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరం ద్వారా లయన్స్ పేదలకు చేసే సేవలు అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో చుట్టు పక్కల కాలనీ ప్రజలు 150మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఇండి గ్లోబల్ డయాగ్నొస్టిక్స్ డైరెక్టర్ సుబ్బారావు నేతృత్వంలో బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం నేరేడమెట్ లయన్స్ ఐ కేర్ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా పాల్గొన్న పిట్ల మోహన్‌రాజ్, డి. శ్రీనివాసరెడ్డి శిబిరం నిర్వాహకులను అభినందించారు. ఈ క్యాంపులో క్లబ్ ప్రెసిడెంట్ విజయకుమార్, సెక్రటరీ సిహెచ్ వరప్రసాద్, 320 సి జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ మండా సురేష్ కుమార్, కె. శ్రీనివాస రెడ్డి, మనోజ్ కుమార్ యాదవ్, గడియారం గణేష్, డా.హేమంత్, డా. హరిగోపాల్, శ్రీమతి కల్పన, డా.రత్నకుమార్, రామకృష్ణ రవిశంకర్ తదతరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



నవతెలంగాణ-కాప్రా

భగత్ సింగ్ ఆశయాల సాధకు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా పలు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ కుల, మత, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంతరాలు లేని సమాజం కోసం కల కన్నారని చెప్పారు. నేడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం జాతీయోద్యమ వీరుల స్ఫూర్తికి భిన్నంగా పరిపాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. స్వాతంత్రం వచ్చి 76 ఏండ్లు అవుతున్నా ప్రజలకు నేటికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందడం లేదన్నారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ వలన విద్య పేదవర్గాలకు అందని ద్రాక్షగా మారిందని వాపోయారు. జాతీయ నూతన విద్యా విధానం 2020తో ప్రాథమిక, ఉన్నత విద్య ప్రయివేట్ పరం అవుతుందన్నారు. ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వం విద్యను అమ్ముతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను కొనే స్థోమత లేక పేదల పిల్లలు బాలకార్మికులుగా మారుతున్న దుస్థితి దేశంలో పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.5,177 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్లు, స్కాలర్షిప్స్ ఇవ్వడం లేదని తెలిపారు. విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలని సూచించారు. నూతన సంక్షేమ, గురుకుల హాస్టళ్లకు సొంత భవనాల నిర్మాణం చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్‌సింగ్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్, అరుణ్, నిఖిల్, బాలాజీ, శివ, అనిల్, శివ, విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల చుట్టూ తిరుగుతున్న
గుండ్లపోచంపల్లి మున్సిపల్ రాజకీయాలు

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ రాజకీయాలు మహనీయుల విగ్రహాల చుట్టూ తిరుగుతున్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ పాలకవర్గ సభ్యులు మున్సిపల్‌లో కౌన్సిల్ తీర్మానం చేసుకొని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాత్రికి రాత్రి మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. కాగా మున్సిపల్ అనుమతులు లేకుండానే కేవలం కౌన్సిల్ తీర్మానంతో విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం పక్కనే ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం కన్నా ఎక్కువగా ఎత్తు ఉండడంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దేశ స్వతంత్రం



కోసం పోరాడిన మహానుభావుల విగ్రహాలు ఏర్పాటు చేయడంలో తప్పు లేదు. కానీ గతంలో సర్పంచ్‌గా పని చేసిన దళిత వర్గానికి చెందిన బెర్రి ఈశ్వర్ ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం కన్నా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ఎత్తు ఎక్కువగా ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటు చేయడం పట్ల దళిత సమాజం నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇలా ఉంటే స్థానిక బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చౌరస్తా చిన్నదిగా ఉందని ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతారని విగ్రహాల ఏర్పాటుకు అనమతులు ఇవ్వవద్దని మున్సిపల్ కమిషనర్ రాములకు ఫిర్యాదు సైతం చేశారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ రాములను వివరణ కోరగా విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని రాత్రికి రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారని పోలీస్ స్టేషన్ సైతం ఫిర్యాదు చేసినట్టుగా తెలిపారు. విగ్రహం ఎవరూ ఏర్పాటు చేస్తున్నారో దాని వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలిసిన విషయమేనని సమాధానం ఇచ్చారు.

లక్ష్మారెడ్డికి మంత్రి మల్లారెడ్డి పరామర్శ



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగ లక్ష్మారెడ్డి తండ్రి భూమిరెడ్డి ఇటీవల మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న కార్మిక శాఖ మంత్రి చామకుర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బుధవారం దశదిన కర్మలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంసీపల్లి మాజీ సర్పంచ్ వంగ పద్మాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణంలో కార్పొరేటర్ గీత



నవతెలంగాణ-ఉప్పల్

వెంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి సంకల్పించిన 111వ కల్యాణంలో భాగంగా 54వ శ్రీనివాస కల్యాణం నిర్వాహకులు ఈస్ట్ కల్యాణపురి అధ్యక్షులు సతీష్ కుమార్, నాగలక్ష్మి దంపతులు నిర్వహించిన యోగ చైతన్య సంస్థ హైదరాబాద్ ఈస్ట్ కల్యాణపురి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన శ్రీనివాస కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణం సతీష్ కుమార్, నాగలక్ష్మి దంపతులు చేయడం సంతోషమని అన్నారు. శ్రీనివాసుని ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డిరేణుక దంపతులు, రత్నకుమార్‌రెడ్డి రజిత దంపతులు, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, జగన్, శ్యామ్ బాలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ అధికారులు
అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో డెంగ్యు, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల ప్రస్తుత స్థితిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎఅండ్ హెచ్ఓ ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వ్యాధిగ్రస్తులు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫాగింగ్ కార్యకలాపాలు నిర్వహించడం, కాంటాక్ట్ ట్రేసింగ్, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం. ఆరోగ్య కేంద్రాల్లో తగినంత మందుల సరఫరాను నిల్వ ఉంచాలని, ప్రయివేటు నర్సింగ్ హోమ్, హాస్పిటల్స్‌లో నమోదవుతున్న కేసులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని
సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) నాయకులు ఎర్రం శ్రీనివాస్

నవతెలంగాణ-ఉప్పల్

ప్రభుత్వం వైద్యం గాలిలో దీపం అనే చందంగా రామంతపూర్ వెంకారెడ్డి నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిస్థితి అధ్వానంగా తయారైందని దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదని సీపీఐ(ఎం) నాయకులు ఎర్రం శ్రీనివాస్, హబ్సిగూడ ఇన్‌చార్జి ఎండీ. గౌస్, కుమారస్వామిలు అన్నారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్పిటల్‌లో మౌలిక వసతుల లేవని వాపోయారు. బోర్ వెల్ మోటార్ ఉన్నప్పటికీ సింటెక్స్ ట్యాంకులు, పైప్‌లైన్ పాడవడంతో నీరు వృథాగా పారి భవనం కప్పు పాడైపోతుందన్నారు. భవనంపై చెట్లు మొలవడంతో కూలే పరిస్థితి ఉన్నదని పేర్కొన్నారు. డ్రయినేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. రోగులకు పరీక్షలు నిర్వహించిన రిపోర్ట్స్ ఇచ్చే ప్రింటర్ పాడైపోయిందన్నారు. ఈ సమస్యలపై పాలకులను కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భీష్మాచారి, యాదగిరి, రాము, పాండు, అరుణ్, వెంకటేష్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, అవకాశాలపై అవగాహన



నవతెలంగాణ-కాప్రా

అభయ అసోసియేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఒమేగా కాలేజీలో మహిళల భద్రత, ఉద్యోగ అవకాశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ వేజ్ ఎంప్లాయిమెంట్ ఫిట్స్ అవార్డు గ్రహీత సుచిత్ర మాట్లాడుతూ.. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అవశ్యకతను వివరించారు. వేజ్ ఎంప్లాయిమెంట్‌లో ఉన్న ఇబ్బందులు ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. పార్వతీ, యాదమ్మలు మాట్లాడుతూ.. ఉమెన్స్ సేఫ్టీ గురించి పేర్కొన్నారు. ఆడవాళ్లు వర్క్ ప్లేస్‌పలో పడుతున్న ఇబ్బందుల ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కెరీర్ ఆపర్చునిటీస్‌పై గౌరీగౌస్ విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి ఆపర్చునిటీస్ ఉంటా యో వాటిని ఎలా తెలుసుకోవాలో తెలిపారు. అభయా జాయింట్ సెక్రెటరీ తులసి అలివేణి మాట్లాడుతూ.. అన్ని రకాలైన హెల్ప్ లైన్ నెంబర్స్ అందరికీ తెలిసేలా చూడాలన్నారు. వాటిని ఏఏ పరిస్థితుల్లో వాడుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో ఒమేగా ప్రిన్సిపాల్ భవానీ, అభయ మెంబర్ భానుమతికి ధన్యవాదాలు తెలిపారు.

'భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి'



నవతెలంగాణ-మేడ్చల్

భగత్ సింగ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల అధ్యక్షుడు ఆదిల్ అన్నారు. బుధవారం భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వీరుడని కొనియాడారు. కుల,మత, ఆర్థిక, అంతరాలు లేని సమాజం ఏర్పాటు కోసం కలలు కన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు పవన్, నాయకులు ప్రసాద్, నిఖిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా బుధవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవర యాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షులు పెండెం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పార్టీల కతీతంగా భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ఎస్సీసెల్ అధ్యక్షులు హరిగోపాల్, ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు దుర్గయ్య, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు నాగరాజు గౌడ్, నర్సింగ్ రావు, రాజు, సుధాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, యన్.శ్రీనివాస్, సాయిలు, అశోక్, కిరణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, ఎన్ ఎస్‌యూఐ నాయకులు సాయి, మనీష్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ హోర్డింగులు ఏర్పాటు చేస్తే
కఠిన చర్యలు : పంచాయతీ సెక్రటరీ



నవతెలంగాణ-శామీర్‌పేట

అక్రమ హోర్డింగులు ఏర్పాటు చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ మౌనిక హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఓ స్తంభానికి అక్రమంగా ఏర్పాటు చేసిన ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు సంబంధించిన హోర్డింగును బుధవారం శామీర్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనిక జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శామీర్‌పేట ఎంపీడీఓ వాణి గరుదాస్ ఆదేశాలమేరకు హోర్డింగు తొలగించామని తెలిపారు. ఎవరైనా తమ వ్యాపారాలకు, రాజకీయాలకు సంబంధించి హోర్డింగు ఏర్పాటు చేస్తే అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు.

బండారి లక్ష్మారెడ్డిని కలిసిన ఎస్. రాజు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ. ఎస్.రాజు ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట కుషాయిగూడ స్వాశక్తి ఇండస్ట్రియల్ ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్ చైర్మెన్ సి. హెచ్. ఏసురత్నం, వైస్ చైర్మెన్ టీ.వీ.రమణ, ప్రెసిడెంట్, సి. హెచ్. బాబూరావు, వైస్ ప్రెసిడెంట్, ఈ. జగన్. సెక్రటరీ, కె. సుదర్శన్, జాయింట్ సెక్రటరీ, కె. స్వామి తదిరతులున్నారు.

డ్రాయింగ్ కాంపిటీషన్‌లో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఉప్పల్

కల్టివేటింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటేషన్‌లో శ్రీనివాస హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 54 మంది పాల్గొనగా పి. ఆరాధ్య, ఎస్. మనస్విని, యం. సహస్రా, యం. వర్షిత, సి. హెచ్. రాజ్ ఇమాన్యుయేల్, కె. శ్రీమన్, యస్. వర్షిత, జిల్లా స్థాయి డ్రాయింగ్ కాంపిటేషన్‌కు ఎంపికయ్యారు. పి. ఆరాధ్యా ఎస్. మనస్విని, యం. సహస్రా, బంగారు పతకాలను గెలుచుకున్నారు. యం. వర్షిత, సి . హెచ్. రాజ్ ఇమాన్యుయేల్ వెండి పతకాన్ని సాధించారు. శ్రీమాన్, యస్. వర్షిత కాంస్య పతకాన్ని దక్కించుకు న్నారు. యస్. మనస్విని రాష్ట్రస్థాయి డ్రాయింగ్ కాంపిటేషన్‌కు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మురళీకృష్ణనన్, సత్యా రేష్మా సుష్మా విద్యార్థులకు అభినందించి మెడల్స్ అందజేశారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం



నవతెలంగాణ-కాప్రా

వినాయక చవితి ఉత్సవాలల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని వివిధ మండపాల్లోని గణపతికి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రత్యే పూజలు నిర్వహించారు.



చర్లపల్లి డివిజన్‌లోని విరాట్ నగర్, కృష్ణారెడ్డి నగర్, పరిమళానగర్ కాలనీ, ఆదర్శనగర్, లక్ష్మీ నగర్, ఆఫీసర్స్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లోని వినాయకుడికి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.


ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ డీఐ కాలనీలో శరత్ ఏర్పాటు చేసిన వినాయకుడికి బండారి లక్ష్మారెడ్డి పూజలు చేశారు. యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త మన్నే సుబ్రహ్మణ్యంతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యువసేన యూత్



అసోసియేషన్ సభ్యులు నాను, వై. రాము, వై. రఘు, మోహన్ రాజేష్, సాయినాయుడు, రాజా, భరత్ రెడ్డి, నాగుబాబు, బాలు, విశాల్, చోటు, వినయ్, రామిరెడ్డి, గణేష్, బాల్జీ, తరుణ్, తేజ, ఇంద్రారెడ్డి, నరేష్, సుంకం పవన్, చందు, జి. కృష్ణ, సుదర్శన్, నిఖిల పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడిగా
వంశరాజ్ బాల్ నరసింహ



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడిగా వంశరాజ్ బాలా నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా టి.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగరాజు, సహాయ కార్యదర్శి బాబురావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా తిరుపతి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా సంపత్ రావు, గంగాధర్ రావు, ఎస్ ఎం ప్రసాద్, డిఎం రవి, శ్రీనివాస్ రెడ్డి, గణేష్ నాయక్, సలహాదారులు గా డిఎస్ ప్రసాద్, ఎండి ఖైజా మోహిన్ ఉద్దీన్, ఏబీఎన్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లెనిన్ క్లబ్ క్లాత్ స్టోర్‌ను ప్రారంభించిన జూపల్లి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి నియోజక వర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీలో, లులూ మాల్ సెంటర్‌లో లెనిన్ క్లబ్ క్లాత్ స్టోర్‌ను కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారం బాగా వృద్ధి చెందాలని కోరుతూ ఫ్రాంచేజీ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లెనిన్ క్లబ్ ఫ్రాంచైజీ యజమాని పి. ఎస్.ఆర్ ఆంజనేయులు ,ఇమ్మని చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి



ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక విగ్రహాల నిమజ్జనం శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం సాయంత్రం వినాయక నగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్‌లో గణ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ప్రత్యేక పూజకు హాజరైన ఆయనను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్ల శ్రీనివా స్, సతీష్ కుమార్,పిట్ల నాగరాజు, ఆగమయ్య, బాలరాజు యాదవ్, పార్థ సారధి, నహీం ఖాన్, సయ్యద్ ముబ్బు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌లతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలి



- సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర ఆశా వర్కర్ల మూడవరోజు నిరవధిక సమ్మెలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ సభ్యులు కే.కృష్ణ నాయక్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను, స్కీం వర్కర్లను కట్టు బానిసలుగా చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూనియన్ నాయకులతో, ఆశా వర్కర్లతో కలిసి చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 20 సంవత్సరాలుగా ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న వారికి కనీస వేతనం ఆమడ దూరంలో ఉందని, దేశంలో రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి కార్మిక వర్గానికి, ప్రజలకి తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నయన్నారు. ఆశ వర్కర్లు పారితోషకం రూ. 9750 ఇస్తుంటే కుటుంబాన్ని ఎలా పోషిస్తారని అన్నారు. ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి సర్వేలు చేస్తున్నప్పుడు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వారికి రాష్ట్ర ప్రభుత్వం టూ వీలర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ మంజూరు చేయాలని, ప్రమాద బీమా ఐదు లక్షలు ఇవ్వాలని, రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు అనిత, మౌనిక ,వినోద ,సౌభాగ్య, కళ్యాణి ,అశ్విని, సరళ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం.. వాహనాలు సమకూర్చిన ఆర్టీఏ

- ఉత్సవ సమితికి 666 వాహనాల అందజేత
- గ్రేటర్‌తో పాటు పటాన్‌చెరులో పూలింగ్ పాయింట్లు
- పర్యవేక్షించిన జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం గురువారం హుస్సేన్‌సాగర్‌లో జరగనుంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. కాగా ఈ నిమజ్జన ఉత్సవాలు సజావుగా సాగేందుకు ఏటా రవాణాశాఖ తమవంతు సహకారం అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో పరిధిలో నేడు జరిగే సామూహిక గణేష్ నిమజ్జనానికి అవసరమైన వాహనాలను రవాణాశాఖ సమకూర్చింది. గ్రేటర్‌వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వేలాది గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు రవాణాశాఖ హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ అధ్వర్యంలో ఏర్పాటైన ప్రాంతీయ రవాణా అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు మొత్తం 666 వాహనాలను సమకూర్చాయి. వీటిలో భారీ ట్రేలర్‌లతో పాటు హెచ్‌జీవీ టస్కర్స్, హెచ్‌జీవీ 6టైర్లు మొదలుకొని టాటాఏస్ వరకు ఉన్నాయి. ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్ కేంద్రం నుంచి 41, ఆర్టీఏ నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ఉప్పల్‌లో 110, ఈస్ట్ జోన్‌లో 48, నార్త్ జోన్‌లో 27, వెస్ట్ జోన్, గచ్చిబౌలిలో 85, సౌత్ జోన్‌లో 69, పటాన్‌చెరువులో 94, ఇబ్రహీంపట్నంలో 108, మియాపూర్‌లో 40, మేడ్చల్‌లో 29, కొత్తూరులో 15 వాహనాలను ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఆర్టీఏ వెహికల్ పూలింగ్ సెంటర్ల సందర్శన

గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం వాహనాలను కేటాయించేందుకు 12ప్రాంతాల్లో రవాణాశాఖ వెహికల్ పూలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఆయా కేంద్రాల నుంచి ఉత్సవ సమితీ కమిటీ సభ్యుల సూచన మేరకు ఆర్టీఏ అధికారులు వాహనాలు అందజేస్తారు. ఈ క్రమంలో ఆయా కేంద్రాలను హైదరాబాద్ జేటీసీ పాండురంగ నాయక్ బుధవారం సందర్శించారు. వాహనాల కేటాయింపు ప్రక్రియను పరిశీలించారు. ఇందులో భాగంగా నెక్లెస్‌రోడ్ వద్ద ఖైరతాబాద్ ఆర్టీవోలు ఎల్.రాంచందర్ ఇన్‌చార్జిగా ఉన్న కేంద్రాన్ని సందర్శించారు. వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో ఎంవీఐలు శ్రీనుబాబు, ఏవో శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. అక్కడి నుంచి సీపీ.వెంకటేశ్వర రావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న టోలిచౌకి సెంటర్‌ను సందర్శించారు. అనంతరం జి.సదానందం ఇన్‌చార్జిగా ఉన్న బండ్లగూడ కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీవో సదానందం జేటీసీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సుభాష్ చంద్రారెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మలక్‌పేట్ పాయింట్, జి.సురేష్ రెడ్డి, రవీంద్రకుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న నాగోల్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్, ఉప్పల్ సెంటర్లు, వి.శ్రీనివాస్ రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్న తిరుమలగిరి నార్త్‌జోన్ పాయింట్‌తో మిగతా పాయింట్లలో వాహనాల కేటాయింపు ప్రక్రియ ఎలా కొనసాగుతుందో ఫోన్లో అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్‌లో ఎంతో అంగరంగ వైభవంగా జరిగే వినాయక సామూహిక నిమజ్జనానికి కావాల్సిన వాహనాలను ప్రతియేటా రవాణాశాఖ అందిస్తోంది. 'ఇప్పటివరకు సుమారు 666 వాహనాలను అందించాం. ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుని ఈ సామూహిక వినాయక నిమజ్జనోత్సవాన్ని సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు చేసుకోవాలి' అని జేటీసీ కోరారు.



ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ పోరాట యోధుడు, పద్మశాలి కులస్తుల ఆరాధ్యుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో గల ఆయన విగ్రహానికి సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బేతి గోపాల్, వివిధ ప్రాంతాలకు చెందిన పద్మశాలి సంఘ సభ్యుల తో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి, ఐడీపీఎల్ లో నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా గాజుల రామారం, సూరారం, గాంధీ నగర్, పాపిరెడ్డి నగర్, శ్రీరాంనగర్, చింతల్ ఆల్విన్ కాలనీ, జగద్గిరిగుట్ట మీదుగా ఐడీపీఎల్ చౌరస్తా వరకు కులస్తులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐడీపీఎల్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేసినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతామన్నారు. కేసీఆర్ బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. పద్మశాలి కులస్తుల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మునిపల్లి జనార్ధన్, యారమాద హరినారాయణ, సామల వెంకటేష్ ,పల్లె దత్తాత్రేయ, భోగ రాజేష్, జల్ద లక్ష్మీనాథ్, భోగ ఋషి, గూడూరు లక్ష్మీనరసింహులు మాదాసు అనంత రాములు, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



- డాక్టర్ పుట్ల శ్రీనివాస్

నవతెలంగాణ-మల్కాజిగిరి

గణేష్ నిమజ్జనం పురస్కరించుకొని భక్తుల ఆరోగ్య విషయంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్యులకు సూచించారు. బుధవారం గణేశ నిమజ్జనానికి సఫీల్గూడ సరస్సున ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య శిబిరం సందర్శించారు. గణేశ విగ్రహాల నిమజ్జనాన్ని వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరపున ఏర్పాట్లను పరిశీలించారు. 108 వాహనాన్ని క్షుణ్ణంగా తనికీ చేశారు. నిమర్జనం సమయంలో భక్తుల ఏదైనా అవాంఛనీయ సంఘటనలకు ప్రమాదాలకు గురి అయితే చికిత్స అందించేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. విధుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి, సిబ్బందిని డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. అన్ని అత్యవసర మందులు ఆర్ఎస్ యాంటీ స్నేక్ వెనమ్ యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ల నిలువలను తనికి చేశారు.

కాంగ్రెసోళ్లకు 'మల్లన్న' సినిమా చూపిస్తా

- నియంతలా వ్యవహరించిన మైనంపల్లి
- రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సీహెచ్.మల్లారెడ్డి
- నియోజకవర్గం, కార్యకర్తలకు అండగా ఉంటా : మర్రి రాజశేఖర్‌రెడ్డి
- మల్కాజిగిరి నియోజకవర్గంలో భారీ ర్యాలీ



నవతెలంగాణ-మల్కాజిగిరి

కాంగ్రెసోళ్లకు 'మల్లన్న' సినిమా చూపిస్తా అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆనంద్‌బాగ్ చౌరస్తా నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఈస్ట్ ఆనంద్ బాగ్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి మల్కాజిగిరి చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ అంటే రౌడీలు, గూండాలు, కబ్జాకోరులు, దగాకోరులు అన్నారు. కాంగ్రెస్ అంటే స్కాంలు, బీఆర్ఎస్ అంటే స్కీంలు అన్నారు. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డిది పిట్ట కొంచెం కూత ఘనం అన్నారు. ఆయన మల్కాజిగిరి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి డబ్బులు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ అంటే దొంగల ముఠా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మైనంపల్లి హన్మంతరావు నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివద్ధి చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఏ నాయకున్నీ తిరుగనీయలేదని,తనకు వచ్చిన నిధులను సక్రమంగా ఉపయోగించలేదని విమర్శించారు. నియంతలా వ్యవహరించి మంత్రులను, నాయకులను, మంత్రి హోదాలో ఉన్న తనను కూడా ఇక్కడ తిరుగనీయలేదన్నారు. కేసీఆర్ మైనంపల్లికి ఎన్నో అవకాశాలు ఇచ్చినా పయోగించుకోలేదన్నారు. విద్యావంతుడైన మర్రి రాజశేఖర్ రెడ్డిని ఈసారి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం బీజేపీకి చెందిన సంతోష్ గుప్తా, బీజేవైఎం నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రత్యేక పరిస్థితుల్లో మల్కాజిగిరి : మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి నియోజకవర్గం ప్రత్యేక పరిస్థితుల్లో ఉందని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. క్యాడర్ అయోమయంలో ఉందని, కార్యకర్తలకు భరోసా ఇస్తానని తెలిపారు. మహేంద్రాహిల్స్ లో రిజర్వాయర్ కట్టాలన్నారు. చెరువుల వల్ల కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో డ్రయినేజీ పనులు కూడా చేయాల్సి ఉందన్నారు. గెలిపిస్తే అందుబాటులో ఉండి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఏకే మురుగేష్, నాయకులు బద్దం పరుశారం రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఖలీల్, వెంకన్న పాల్గొన్నారు.

నర్సింహా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-దుండిగల్

నర్సింహా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు చైర్మెన్ జె. నర్సింహా రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నర్సింహా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఎమ్ఎన్‌జె ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. ఈ శిబిరంలో అనేకమంది విద్యార్థులు పాల్గొని విరివిగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ నాన్న గారి జన్మదిన పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణ రక్షణకు ఈ రక్తం ఉపయోగపడుతుంది పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.ఆర్. లోకనాథం మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. ఒకరి రక్తదానం తలసేమియాతో బాధపడుతున్న వారికి ప్రాణదానం అవుతుందని తెలిపారు. యుక్త వయసులో రక్తదానాన్ని చేసినటువంటి యువతను అభినందించారు. కళాశాల కోశాధికారి జె త్రిలోక్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.మోహన్ బాబు,డీన్. రామదాసు, కన్వీనర్ సౌమ్య, పలు విభాగ అధిపతులు, అధ్యాపకులు ,కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

వామన్ మేస్త్ర నాయకత్వంలో దేశంలో థర్డ్ ఫ్రంట్

- సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ చైర్మెన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఢిల్లీలో గురువారం వామన్ మేస్త్ర నాయకత్వంలో థర్డ్ ఫ్రంట్ కూటమి సమావేశానికి సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ పూర్తి మద్దతు ఇస్తుందని సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ చైర్మెన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ తెలిపారు. థర్డ్ ఫ్రంట్‌లో సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ పూర్తిగా భాగస్వామ్యం అవుతుందన్నారు. ఇండియా, ఎన్‌డీఏ కూటమిలు అగ్రవర్ణాల నాయకత్వంలో పని చేస్తున్నాయన్నారు. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు సమావేశానికి దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకత్వంలో ప్రత్యామ్నాయ మూడో రాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకత్వంలో పని చేస్తున్న పార్టీలన్నీ థర్డ్ ఫ్రంట్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రేపు ఢిల్లీలో జరిగే థర్డ్ ఫ్రంట్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేపీహెచ్‌బీలో వేల కోట్లతో అభివృద్ధి చేశాం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ డివిజన్‌లో వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం 44 వ రోజు పాదయాత్ర లో డ్రీమ్ వ్యూ కాలనీ, విశ్వంబరా, శ్రీల పార్క్, బుద్ధ వర్టెక్స్, శిల్ప గోపాల్ నగర్ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ప్రతి కాలనీ అసోసియేషన్ నందు విభిన్న రకాల పార్కులను రూపకల్పన చేశామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ ఇండోర్ స్టేడియంలు.. వాకి టాకీలు నిర్మించడమే కాకుండా వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే కాకుండా పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారన్నారు. ప్రపంచ కుబేరులందరూ కూడా హైదరాబాద్ మహానగరాన్ని పెట్టుబడులకు అనుకూల నగరంగా చూసుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం అక్టోబర్ 3వ తేదీన కేపీహెచ్‌బీలో ముఖ్యఅతిథిగా కేటీఆర్ ప్రగతి నివేదన సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గర్వించే గొప్ప నేత కొండా లక్ష్మణ్ బాపూజీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత, ఉద్యమకారుడిగా, ప్రజాస్వామిక మానవతావాది కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని పురస్కరించుకుని, ఆల్విన్ కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో నిర్వహించిన జయంతి వేడుకలలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగరావు, రవీందర్ ముదిరాజులతో కలిసి ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సమ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్, ఉపాధ్యక్షులు కాశినాథ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, నరేష్, వినయ్, జనార్ధన్, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఐడీపీఎల్ చౌరస్తాలో పద్మశాలి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి సందర్భంగా బుధవారం చిత్రపటానికి సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్, పద్మశాలిలు పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌ఆర్‌సీ డీఎస్పీగా నరేష్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ మల్కాజిగిరి ఏసీపీగా పని చేసిన పి.నరేష్‌రెడ్డి ఎస్‌హెచ్‌ఆర్‌సీ డీఎస్పీగా నియామితులయ్యారు. గత డీఎస్పీ ఆకుల శ్రీనివాస్ మల్కాజిగిరి ఏసీపీగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నరేష్‌రెడ్డి వచ్చారు.

అల్వాల్‌లో అంగన్వాడీల వంటావార్పు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ అంగన్ వాడిలు వంట వార్పు నిరసన కార్యక్రమం నిర్వహించారు. 16వ రోజు సమ్మెలో భాగంగా అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్ (యాప్రాల్) ప్రాజెక్టు ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడు తూ...ప్రభుత్వం వెంటనే తమను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు మానుకొని, వెంటనే సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. కాప్రా మండల సీఐటీయూ కార్యదర్శి పి. గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు పెద్దపీట ఇస్తుందన్నారని చెబుతూ అంగన్వాడీలకు న్యాయం చేయడం లేదని చెప్పారు. రాష్ట్రంలో అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తే నష్టం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శివ రాణి, భాగ్యరేఖ, రమా దేవితో పాటు టీచర్లు ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనమైన పూజలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని రంగారెడ్డి నగర్ డివిజన్ గిరినగర్ లోని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నేతి నరేష్, మిందర్ సింగ్, జె.శివ, జె.సంపత్, పి రఘువీర్, లక్ష్మీ ప్రసాద్, రాజశేఖర్, రాహుల్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



- పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అన్నారు. బుధవారం ఆయన జయంతి పురస్కరించుకొని ఐడిపిఎల్ చౌరస్తాలో ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి వివిధ ప్రాంతాల పద్మశాలి సంఘాల అధ్యక్షులు ,కులస్తులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పద్మశాలి కులస్తుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అడుగుజాడల్లో నడవాలని ఆయనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ది మల్లేష్, మారుతి, శ్రీనివాసులు, నరసయ్య, పాలడుగు సత్యనారాయణ, కంది శ్రీశైలం, ఎలుగేటి తదితరులు పాల్గొన్నారు.



వినాయక నవరాత్రుల సందర్భంగా, ఆల్విన్ కాలనీ 124 డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ నేత, డివిజన్ లోని ఎన్టీఆర్ నగర్, మహంకాళి నగర్, ఆశానగర్, తదితర కాలనీలో వినాయక మండపాలను సందర్శించి, తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా వినాయక మూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించమన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండే విధంగా భగవంతుని కృప ఎల్లవేళలా ఉండాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు భక్తులు యువకులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

బోరబండలో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోరబండ ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజు నగర్‌లో నివాసం ఉండే లింగంపల్లి సారంగపాణి (50) భార్య ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. అతని సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. అయితే అతనికి కొంత ఆర్థిక ఇబ్బందులు ఉండటం వల్ల బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసుకొని సర్దార్ జమాల్ ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి తలసాని



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ పరిధిలోని వెస్ట్ మారేడ్‌పల్లి గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో బుధవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. మంత్రితోపాటు బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత, కాలేజీ అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అనంతరం లాస్యనందిత మాట్లాడుతూ విద్యార్థులందరికీ అన్నివిధాల అండగా ఉంటున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు.

ఉదయం 6 నుంచే శోభాయాత్ర

- నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలకు సర్వం సిద్ధం
- ఉదయాన్నే కదలనున్న ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లో గణేశ్ నిమజ్జనోత్సవాలకు సర్వం సిద్ధమైంది. నగరంలో గురువారం ఉదయం నుంచే శోభ యాత్ర ప్రారంభంకానుంది. ముందుగా ఖైరతాబాద్ గణేషుని శోభాయాత్ర ఉదయం 6గంటలకు ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఖైరతాబాద్ గణేషున్ని దర్శించు కునేందు భారీసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. దాంతో ఆప్రాం తమంతా కిక్కిరిసిపోయింది. ఉదయం 6గంటలకు ఖైరతా బాద్ గణేషుని శోభయాత్ర ప్రారంభంకానుందని, మధ్యా హ్నం 12 నుంచి 2గంటల మధ్య నిమజ్జనం చేయనున్నట్లు భాగ్యనగ ర్ గణేష్ ఉత్సవ సమితి తెలిపింది. శోభయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నగరంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బాలాపూర్ నుంచి ప్రారంభమయ్యే శోభయాత్ర పాతబస్తీ, ఆబిడ్స్ మీదుగా ట్యాంక్ బండ్‌వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో శోభాయాత్రలు సాగే మార్గాలల్లో సాధారణ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని అదనపు సీపీ, ట్రాఫిక్ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ట్యాంక్ బండ్‌పై జరిగే నిమజ్జనాన్ని తిలకించేందుకు గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశముందన్నారు.సందర్శకుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సాగర్ చుట్టూ ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాల్లోనే సందర్శకులు వాహనాలను నిలపాలని సూచించారు.

బస్సుల రాకపోకలపై నియంత్రణ

నిమజ్జనం రద్దీని బట్టి ఆర్టీసీ బస్సుల రాకపోకలపై సైతం నియంత్రణ ఉంటుదని పోలీస్ అధికారులు తెలిపారు. హుస్సేన్ సాగర్‌కు కొద్ది దూరంలోనే సిటీ బస్సులను నిలివే వేస్తారు. అక్కడి నుంచి భక్తులు, సందర్శకులు నడుచుకుంటూ వెళ్లాల్సిఉంటుంది. మెహిదీపట్నం బస్సులను మసాబ్ ట్యాంక్ వరకు, కూకట్ పల్లి బస్సులు ఖైరతాబాద్ చౌరస్తా వరకు అనుమతిస్తారు. ఇక సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులు సీటీవో, ప్లాజా, ఎస్‌బీహెచ్, క్లాక్ టవర్, చిలకలగూడ చౌరస్తా ఉప్పల్ బస్సులను రామంతాపూర్ టీవీస్టూడియో, దిల్‌సు ఖ్‌నగర్ బస్సులు గడ్డి అన్నారం, చాదర్‌ఘాట్, రాజేంద్రగన్ బస్సులు దానమ్మ హట్స్, మిదాని బస్సులు ఐఎస్ సదన్, నారాయణగూడా వైఎంసీఏ వద్దకు అనుమతిస్తారు. ఇక జిల్లాల ఉంచి ఎంజీబీఎస్ వెళ్లే ఆర్టీసీ బస్సులను సైతం వివిధ ప్రాంతాలకు మళ్లిస్తారు.



గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ రోనాల్డ్ రోస్

గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని వినాయక విగ్రహాలను బేబీ పాండ్స్, చెరువులో వేసే సందర్భంలో ఓ పద్ధతి ప్రకారంగా తరలించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తున్న సందర్భంగా పూజ పూర్తయిన తర్వాత పూజా సామాగ్రిని చెరువులో వేయకుండా సపరేట్‌గా వేయాలన్నారు. ఒక ప్రాం తంలో వేసేందుకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఏర్పడే స్కార్ప్‌ను వెనువెంటనే తొలగించాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది 24 గంటల పాటు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఈఎన్.సీ జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రె, అడిషనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ అదనపు కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి

- హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేష్ నిమజ్జనానికి వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. నిమజ్జనంలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం హైదబాద్ జిల్లాలో గణేష్ శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపుల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించటానికి 108 అంబులెన్సులు, ప్రయివేటు హాస్పిటల్స్ అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించటానికి వీలుగా అయా ప్రాంతాల్లో కార్పొరేట్ హాస్పిటల్స్‌ను కూడా సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రతి కంట్రోల్ రూంలో ఒక సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారి నిరంతరం ఆరోగ్య సేవలను పర్యవేక్షిస్తారని తెలిపారు. నిమజ్జనం పాయింట్స్‌లలో ఒక 108 అంబులెన్సు ఉంటుందని తెలిపారు. బేబీ పాండ్స్ వద్ద ప్రయివేటు అంబులెన్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 36 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, భక్తులు వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

నిమజ్జనం సందర్భంగా సేవలను అందించే ప్రయివేటు హాస్పిటల్స్

1.సీజన్స్ హాస్పిటల్, అంబర్‌పేట
2.అస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్, అమీర్‌పేట్
3.అపోలో హాస్పిటల్స్, డీఆర్‌డీఓ హైదర్‌గూడ,
4.నవజీవన్ హాస్పిటల్స్, కంటోన్మెంట్
5.ప్రిన్స్ ఎస్‌రా హాస్పిటల్, డబీర్‌పూర్
6.రెనోనా నీలిమా హాస్పిటల్, లంగర్ హౌస్
7.కేఏఎం మల్టీస్పెషాల్టీ హాస్పిటల్, జంగంపేట్
8.యశోదా హాస్పిటల్, సికింద్రాబాద్ అండ్ మలక్‌పేట
9.ఆన్స్ హాస్పిటల్, చంపాపేట్
10.ఫోకస్ హాస్పిటల్, చంపాపేట్
11.కేర్ హాస్పిటల్, నాంపల్లి
12.కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్
13.మెడ్స్ హాస్పిటల్, నానిపురా
14.పల్స్ హాస్పిటల్, పద్మారావు నగర్
15.సెంటర్ హాస్పిటల్, శ్రీరాంనగర్
16.అల్పా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్, సురజ్భాన్

పౌష్టికాహార లోపంతో ఎన్నో అనారోగ్య సమస్యలు

- మాధవిలత కొంపెల్ల



నవతెలంగాణ - బంజారాహిల్స్

పౌష్టికాహార లోపంతో అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారాని విరంచి ఆస్పత్రి చైర్‌పర్సన్ మాధవిలత కొంపెల్ల అన్నారు. జాతీయ పౌష్టికాహార మాసాన్ని పురస్కరించుకొని పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన ఆస్పత్రి యాజమాన్యం ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వద్దులలో పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించడంతో పాటూ వారిలో సరైన అవగాహన కలిపించే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్,వారు నెలంతా వైద్యులు, సిబ్బంది, రోగులకు పలు అవగాహనా కార్యక్ర మాలు చేపడుతున్నారు. అలాగే వైద్యులు,హాస్పిటల్ సిబ్బందికి ప్రత్యేక క్విజ్ కార్యక్రమంతో పాటూ ఆరోగ్యక రమైన వంటకాల పోటీ నిర్వహించారు. దీంతో పాటూ వైద్యులు,నర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక పోస్టర్ తయారీ పోటీతో పాటూ ఆహారాన్ని రుచి చూడడంపై కూడా ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ మాసం మొత్తం జరిగిన ఈ పోటీలో బుదవారం ముగింపు కార్యక్రమానికి హాజరైన మాధవి లత కొంపెల్ల మాట్లాడారు. భారతీయ ఆహార పద్ధతులలో అన్ని రకములైన పోషకాలు ఉండేలా సంపూర్ణమైన భోజనాన్ని వడ్డిస్తారని చెప్పారు. అంతే గాకుండా శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, వ్యాధి నిరోధక పోషకాలు లాంటివి సమపాళ్లలో ఉండేలా మన భోజనం ఉంటుందని వివరించారు. ఆస్పత్రి సీఈఓ డా.సాయి రవి శంకర్ మాట్లాడుతూ సమతుల్యమైన శరీరాభివృద్ధికి మంచి పౌష్టికాహారం ఎంతో అవసరమని వివరించారు.ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు, మహిళలు, వద్దుల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలోనూ పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. డయాబెటీస్, హృద్రోగాల వంటి వాటి ఎన్నో రోగాలను నియంత్రించడానికి కూడా కీలకమైన పోషకాలతో కూడిన ఆహారం ఎంతో కీలకమని వివరించారు. అందుకే పౌష్టికాహార ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్విజ్ పోటీలో విజేతగా నిలిచిన దీప్తి, ఆరోగ్య కరమైన వంటల పోటీలో విజేతగా నిలిచిన వాసవితో పాటూ పోస్టర్ తయారీలో మొదటి స్థానాన్ని సాధించిన ట్యూబా, రుచి చూడడం పోటీ లో గెలిచిన సౌమ్యలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాలలో డా శ్రీదేవి గుట్ట, కన్సల్టెంట్ గైనకాలజిస్టు, విరించి హాస్పిటల్ - అపర్ణ నెమలికంటి, డైటీషియన్, విరించి హాస్పిటల్స్ తో పాటూ వైద్యులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు యువత కషి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 108 వ జయంతి సందర్భంగా బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కమిషనర్‌తో పాటు ఈ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు శంకరయ్య, సరోజ విజయలక్ష్మి, కష్ణ, యాదగిరిరావు, శ్రీవాత్స, యూసీడీ జాయింట్ కమిషనర్ వెంకట్ రెడ్డి, ఎంటమాలజి చీఫ్ డాక్టర్ రాంబాబు, సిపిఆర్‌ఓ మహమ్మద్ ముర్తుజా, ఓ.ఎస్.డీ వేణుగోపాల్, అనురాధ, పి.ఆర్.ఓ పద్మ, అసిస్టెంట్ మున్సిపల్ కమి షనర్లు జీవన్ కుమార్, వెంకటరమణ తదితరులు కొండా బాపూజీ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులో కీలక భూమి పోషించిన రాజకీయ నాయకుడని అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తన చిన్న తనం నుండే తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. మారుమూల గ్రామంలో జన్మించి శాసన సభ్యుడిగా గెలుపొంది తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేశారని అన్నారు. నిఖార్సైన తెలంగాణ వాదిగా ప్రజలకు పోరాట స్పూర్తిగా నిలిచారని కమిషనర్ అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుండే విధంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరున ఉద్యానవన యూనివర్సిటీ నెలకొల్పిన విషయం మనందరికీ తెలుసునని కమిషనర్ వెల్లడించారు.

అడగని హామీలనూ నెరవేర్చే ప్రభుత్వం మాది



- ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

అడగాని హామీలనూ సైతం నెరవేర్చే ప్రభుత్వం దేశంలో దాదాపు బీఆర్ఎస్ ఒక్కటేనని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గంలోని సుమారు వందమంది లబ్దిదారులకు బీసీ బంధు చెక్కులను సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, డివిజన్ అధ్యక్షులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలోనీ అధ్యక్షులు,ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్స్ కాలేజీ విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సీఎంఏ ఇంటర్ ఫలితాలలో హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యా సంస్థ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఐదుగురు ఆలిండియా ర్యాంకులు సాధించినట్టు బ్రాంచ్ జోనల్ అడ్మిన్ ఇన్‌చార్జిలు ఎస్‌ఎం వలి, ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని బ్రాంచ్ అకాడమిక్ ప్రిన్సిపాల్ ఆంజనేయ రెడ్డి, పూర్ణ తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ అత్యున్నత బోధనా విధానం, క్రమశిక్షణ విద్యార్థిని విద్యార్థుల విజయానికి కారణమని బ్రాంచ్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విజయం ద్వారా మాస్టర్ మైండ్స్ మరే ఇతర విద్యాసంస్థలకు అందనంత ఎత్తుకు ఎదిగినట్లుగా భావిస్తున్నామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బ్రాంచ్ ప్రిన్సిపాల్ అభినందించారు. వన్నెం రెడ్డి హేమంత్ ఆల్ ఇండియా రెండో ర్యాంకు, పి చంద్ర ధనుష్ ఆల్ ఇండియా నాలుగో ర్యాంకు, ఎం మనస్విని ఆల్ ఇండియా ఐదో ర్యాంకు ,వి మాన్సీ ఆల్ ఇండియా 21వ ర్యాంకు, సనపల వరుణ్ ఆల్ ఇండియా 24 ర్యాంకు సాధించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

గణపతి వేడుకలు.. నిత్యం అన్నదానం



నవతెలంగాణ-ఓయూ

గణపతి నవరాత్రులను పురస్కరించుకుని సికింద్రాబాద్ చిలకలగూడా మున్సిపల్ మైదానంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండపల్లి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా మండపంలో మహా గణపతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతీరోజు వర్గీల్ పండితులచే శాస్త్రీయంగా లక్ష పుష్పార్చన, మహా గణపతి హెూమం, నవగ్రహ హెూమం, కుంకుమార్చన, మహాలక్ష్మీ హెూమం, సుబ్రమణ్య హెూమం, చండికాపారమేశ్వర హెూమం, రుద్రాభిషేకం, లక్షఫల నివేదన లాంటి పూజలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా బండపల్లి సతీష్ మాట్లాడుతూ ప్రతీరోజు మహా మండపం వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గణనాధుడిని నిమజ్జనం అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. లోకాకళ్యాణార్థం మొదటిసారి గణపతి లడ్డును వేలం వేయబోతున్నామని తెలిపారు.

నిమజ్జనం నాడు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అప్లికేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అనంతరం అశేష భక్త జనం సమక్షంలో లడ్డు వేలం పాట రూ. 1,116 లతో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గణేష్ లడ్డు వేలంపాట ద్వారా వచ్చిన డబ్బు సేవా కార్యక్రమాలకు ఖర్చు పెడతానని బండపల్లి వెల్లడించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే గణనాథుని శోభాయాత్ర.. భక్తుల కోలాహలం మధ్య సందడిగా కొనసాతుతుందన్నారు.


ఆర్యవైశ్య కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బేగంపేట్

ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల కోసం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మర్యల జగదీశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, 2018లో జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ మానిఫెస్టోలో కూడా చేర్చడం, అలాగే ఆ తరువాత జరిగిన అన్ని ఉప ఎన్నికల్లో కూడా ప్రకటించారన్నారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని కానీ ఇచ్చిన హామీ పూర్తి కావడం లేదన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామిని నెరవేర్చేలా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఈ నెల 30వ తేదీ శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్షలో ఆర్యవైశ్య సోదర, సోదరీమణులందరు పెద్ద ఎత్తున పాల్గొని దీక్షను జయప్రదం చేయాలని కోరారు. మన బలం - మన గలం రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా అందరూ. రావాలని కోరుతున్నామన్నారు. సురేష్, శ్రీనివాస్ రావు, హరీష్ కుమార్, ప్రకాష్, నరసింహ రావు, శ్రీధర్, వీరేశం, రవి కుమార్, ప్రభాకర్, వెంకట రమణ, రామచంద్రం, రవీందర్, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

బోయిన్‌పల్లి విద్యా గణపతి మండపం వద్ద బుధవారం కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ మండపం వద్ద అన్న ప్రసాదాలు స్వీకరించేందుకు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాణా ప్రతాప్ యువసేన ప్రతినిధులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.
నవతెలంగాణ-కంటోన్మెంట్



నచ్చిన పర్యాటక ప్రదేశాలన్ని ఇంటి వద్దే ప్లాన్ చేసే సౌకర్యం



- అందుబాటులోకి ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

ప్రపంచంలో ఎక్కడికైనా టూర్ ప్లాన్ చేసుకోవడం లేదా పర్యాటక కేంద్రానికి వెళ్లేందుకు ప్లాన్ చేసుకోవడం ఇక సులువైంది. దేశవిదేశాలల్లో విమానంలో ఎక్కడి వెళ్లాలన్నా 'ఫ్లైబో డాట్ కామ్' ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్‌లో కొత్త అధ్యాయానికి నాందిపలికింది. బుధవారం బంజారా హిల్స్‌లోని తాజ్ కృష్ణ, హెూటల్‌లో ఫ్లైబో డాట్‌కామ్ బ్రోచర్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. దేశవిదేశాలల్లో నచ్చిన పర్యాటక ప్రదేశానికి వెళ్లివచ్చేందుకు ప్రయాణాన్ని సులువు చేసింది. వెళ్లాలనుకున్న ప్రదేశానికి ముందస్తుగా ప్రయాణికులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే విధంగా ఏర్పాటు చేశారు. తాజ్ కృష్ణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా సినీ హీరో విక్టరీ వెంకటేష్, నగర సీపీ సీవీ ఆనంద్, సీవీ ఆనంద్ సతీమణి లలితా ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన ప్రయాణం, ఒత్తిడి లేని ప్రయాణాన్ని ప్రస్తుతం ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. సులువైన ప్రయాణాలు, త్వరగా గమ్యానికి చేర్చే అనువైన విధానాలను కోరుకుంటున్నారన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని సంస్థ నిర్వాహకులను కోరారు. ప్రయాణాలకు సులువుగా మార్చే ప్రక్రియ వివిధ సంస్థలు ఏర్పడుతున్నప్పటికీ మధ్యతరగతి వారికి అందుబాటులో ప్రయాణించే మార్గాన్ని ఏర్పరిచే 'ఫ్లైబో డాట్ కం సంస్థ' మరింత చేరువు కావాలని, అన్ని వర్గాల ప్రజలకు ప్రయాణాలు సులువుగా మార్చాలని కోరారు. అనంతరం 'ఫ్లైబో డాట్ కామ్' ఎండీ మర్రి శశాంక్ మాట్లాడుతూ మా సంస్థకు బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్కడి వెళ్లాలన్నా ఆన్‌లైన్‌లో ఫ్లైయిట్ టికెట్ బుక్ చేసుకోవచ్చారు. అనుకున్న ప్రదేశాలకు తీసుకెళ్లడం, అక్కడ అన్ని సౌకర్యాలతోపాటు, తిరిగి ఇంటి వరకు చేర్చే బాధ్యత తీసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి అసౌకర్యాలకు లోనుకోకుండా చూసుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పీవీ సింధు తల్లిదండ్రులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు విడుతల్లో 'డబుల్' ఇండ్ల పంపిణీ

- 24 నియోజకవర్గాల్లో.. 36,884వేల మంది లబ్దిదారులు
- స్థానిక కోటాతో కలిపి 39,804 ఇండ్ల కేటాయింపు
- 3.55 లక్షల దరఖాస్తుల్లో 1.37 లక్షలకుపైగా అర్హుల గుర్తింపు
- వచ్చేనెల 2, 5 తేదీల్లో ఇండ్ల పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంటోంది. ఇప్పటికే 68వేలకుపైగా ఇండ్లు పూర్తిచేయగా.. వివిధ ప్రాంతాల్లో మరో 30వేల ఇండ్ల నిర్మాణ దశలో ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. మొదటి, రెండవ విడుతలో భాగంగా గ్రేటర్ పరిధిలోని 24,900 మంది లబ్దిదారులను ఎంపిక చేసి.. వారికి ఇండ్లు పంపిణీ కూడా చేసింది. ఈ నేపథ్యంలో మూడో విడుత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి సంబంధించి బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎన్ఐసీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో ఆన్‌లైన్ డ్రా తీశారు. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో మొత్తం 39,804 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. వీరిలో జీహెచ్ఎంసీ పరిధిలో 36,884 మంది లబ్దిదారులుండగా.. స్థానిక కోటా కింద 2,920 మందికి ఇండ్లు కేటాయించారు. వీరికి రెండు దశల్లో వచ్చేనెల 2, 5వ తేదీలో ఇండ్లు పంపిణీ చేయనున్నారు.

మూడో విడుత- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు ఇలా..

జిల్లా	లబ్ధిదారులు
హైదరాబాద్	23610
మేడ్చల్-మల్కాజిగిరి	7144
రంగారెడ్డి	5667
సంగారెడ్డి	463
మొత్తం	36884

జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం 24 నియోజకవర్గాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం 3.55లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటింటి సర్వేలో ఈనెల 24, 25వ తేదీనాటికి 1,37,506 మంది దరఖాస్తులు అర్హత కలిగినట్టుగా అధికారులు గుర్తించారు. గ్రేటర్ పరిధిలో సుమారు 111 ప్రాంతాల్లో లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. ఇందులో ఇప్పటివరకు పూర్తయిన సుమారు 68 వేలకుపైగా ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్ కలెక్టరే ట్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ లాటరీ డ్రాలో మూడో విడుతలో గ్రేటర్ లోని 24 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించి 36,884 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్(23,610), రంగా రెడ్డి(5667), మేడ్చల్-మల్కాజిగిరి (7144), సంగారెడ్డి జిల్లాలకు (463) మంది చొప్పున లబ్దిదారులు ఉండగా.. స్థానిక కోటా కింద 2,920 మందిని ఎంపిక చేశారు.

స్థానిక కోటాలో కేటాయింపు ఇలా..

నియోజకవర్గం	లబ్దిదారులు
కుత్బులాపూర్	730
పటాన్‌చెరువు	802
రాజేంద్రనగర్	40
మహేశ్వరం	29
మేడ్చల్	768
ఇబ్రహీంపట్నం	300
చేవెళ్ల	151
మొత్తం	2920

రిజర్వేషన్ ఆధారంగా లబ్దిదారులు ఎంపిక

జిల్లా	లబ్దిదారులు	పీహెచ్	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు
హైదరాబాద్	23610	219	3566	1029	18796
మేడ్చల్-మల్కాజిగిరి	7144	293	1215	429	5207
రంగారెడ్డి	5667	75	943	322	4327
సంగారెడ్డి	463	0	79	25	359
మొత్తం	36884	587	5803	1805	8652

యథావిధిగా రిజర్వేషన్ అమలు..

ఇదిలావుంటే రెండవ విడుతలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ప్రభుత్వం వికలాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కోటా అమలు చేసిన విషయం తెలిసిందే. బుధవారం నిర్వహించిన మూడో విడత ఇండ్ల కేటాయింపులోనూ రిజర్వేషన్ పద్ధతిని యధావిధిగా కొనసాగించింది. దీంతో గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాలో వికలాంగులకు(587), ఎస్సీలకు(5803), ఎస్టీలకు(1805) చొప్పున డబుల్ బెడ్ రూమ్ కేటాయించినట్టు అధికారులు తెలిపారు.



నల్లకుంట కార్పొరేటర్ వై.అమత డివిజన్‌లోని వివిధ బస్తీలు, కాలనీల లో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోల్నాక, తిలక్ నగర్, చర్చి గల్లి, ఇంద్రనగర్,బాయమ్మ గల్లీ, టీఆర్టి, శంకర్ మట్ , వెంకటేశ్వర నగర్, రత్న నగర్, సత్య నగర్, ఫీవర్ హాస్పిటల్, ఓల్డ్ నల్లకుంట, న్యూ నల్లకుంట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-నవతెలంగాణ-అంబర్‌పేట



ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ప్రిన్స్ యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహా, అసోసియేషన్ అధ్యక్షుడు మధుకర్, ప్రధాన కార్యదర్శి గుండు జగదీష్ బాబు, రాజు, సన్ని, విజయ్ కుమార్, సతీష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డమీది శ్రీనివాస్, రాకేష్, మారిశెట్టి నర్సింగ్ రావు, సుధాకర్, శ్రీనివాస్, పిఎస్.శ్రీనివాస్, కిరణ్, రవి శంకర్ తదితరులున్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆశా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.రేఖావతి కల్యాణి, ఎ.హేమలత

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.రేఖావతి కల్యాణి, ఎ.హేమలత అన్నారు. మూడోరోజు సమ్మె సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్సిడ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. కలెక్టరేట్లు, డీఎంహెచ్ ఆఫీసుల ఎదుట అనేకసార్లు ధర్నాలు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు కూడా నిర్వహించామ ని, ఇంకా అనేక రూపాల్లో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ నెల 11వ తేదీన కోఠిలోని హైదరాబాద్ హెల్త్ కమీషనర్ ఆఫీసు ఎదుట వేలాది మంది ఆశాలతో ధర్నా నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. ఏండ్లు గడిచినా రాష్ట్రంలో నేటికీ ఫిక్సిడ్ వేతనం నిర్ణయం జరగకపోవడంలో ఆశా వర్కర్లు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. సంబంధిత రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసును అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు అని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్స్ పొందారనీ, రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నట్టు తెలిపారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు, ఇతర ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. కరోనా కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని తెలిపారు. డబ్ల్యుహెచ్ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించినట్టు తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్నా ఆశాలకు నేటికీ ఫిక్సిడ్ వేతనం నిర్ణయం చేయకపోవడం వల్ల ఆశా వర్కర్లు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. పారితో షికంతో పాటు పారితోషికాలు లేని అనేక అదనపు పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తున్నదని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఈ పరిస్థితిలో వచ్చే పారితోషికాలు సరిపోక ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. వేతనాలు రూ.18వేలకు పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయప్రద, రాధా, వాసంతి, సుమలత, సరిత, జిల్లాల నుంచి ఆశావర్కర్, సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల 34 రోజుల సమ్మె సందర్భ ంగా మంత్రి ఇచ్చిన హామీలు అమ లు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ (సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్య ంలో బుధవారం గ్రామపంచాయతీ కార్మికులు మూడు మూడో రోజు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఉన్ని కృష్ణన్, ఐఎఫ్‌టీయూ నాయకు లు శివ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో 34 రోజులుగా జీపీ ఉద్యోగ, కార్మికులు నిరవధిక సమ్మె చేశారని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర గ్రామీణాభివద్ధి శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని జేఏసీ నాయక త్వం కోరగా సమ్మె విరమించి వస్తే డిమాండ్లు పరిష్కరించేందుకు సాను కూలంగా ఉన్నామని చెప్పినట్టు తెలిపారు. గత నెల 7వ తదీన మంత్రి నివాసంలో జేఏసీతో చర్చలు జరిగాయనీ, ఆ చర్చల సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికు ల డిమాండ్లలో ఆర్థికేతర డిమాండ్లు, కారోబార్, బిల్ కలెక్టర్లు, గుమాస్తాల సహాయ కార్యదర్శులుగా నియామకం, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, 8 గంటల పని, వారాంతపు, పండుగ సెలవులు లాంటివి సమ్మె విరమించిన వెంటనే తమ పరిధిలోనివి పరిష్కరిస్తామని, ఆర్థికపరమైన డిమాండ్లు జీఓ 60 ప్రకారం వేతనాల పెంపు, ఇతర శాఖలు, ప్రభుత్వ శాఖలు, స్కీం వర్క ర్లు, స్థానిక సంస్థలు, మున్సిపల్ కార్మికుల వలే పీఆర్సీ ప్రకారం 30శాతం వేతనాల పెంపు, మల్టీ పర్పస్ వర్కర్ విధానం, పర్మినెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్ తదితర కీలక డిమాండ్లను సీఎంతో మాట్లాడి సానుకూలంగా పరిష్కరిస్తామని హామీనిచ్చి సమ్మెను విరమించాలని మంత్రి కోరినట్టు తెలిపారు. దీంతో ఆ తర్వాతి రోజు సమ్మెను విరమించామని తెలిపారు. రాష్ట్రంలో కురుస్తు న్న భారీ వర్షాలు ప్రజల ఆరోగ్యాలు, పారిశుద్ధ్యం దష్టిలో పెట్టుకుని ఆగ స్టు 9వ తేదీన జిల్లా కలెక్టర్లకు, డీపీఓలకు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్టు రాతపూర్వకంగా తెలియజేసి విధుల్లో చేరినట్టు తెలిపారు. ప్రధానమైన డిమాండ్లు పరిష్కరించకుండా చావు ఖర్చులు, ఇన్సూరెన్స్‌కు మాత్రమే సర్క్యులర్స్ జారీచేసి చేతులు దులుపుకున్నారని, దీంతో కార్మికులు తీవ్ర అసంతప్తికి గురయ్యారని తెలిపారు. ఈ నేప థ్యంలో సిబ్బంది పర్మినెంట్ వేతనాల పెంపు, మున్సిపాల్టీలలో ఇస్తున్నట్లు గా వారి తో సమానంగా ఇవ్వాలేని, లేదా అప్పటిలోగా రాష్ట్రంలో ఇతర కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పెంచినట్లుగానే 1వ పీఆర్సీలోని మినిమమ్ బేసిక్‌ను కేటాయించాల ని, 2వ పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావా లని, అప్పటిలోగా 30 శాతం వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లు, గుమస్తాలకు స్పెషల్ స్టేటస్ కల్పిస్తూ పంచాయితీ సహాయ కార్యదర్శులుగా నియమిం చాలన్నారు. ప్రభుత్వం స్పందించ కుంటే అక్టోబర్ 5వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సబితా, జేఏసీ రాష్ట్ర కోశాధికారి యాదయ్య, సునీత. బీఎస్.భారదమ్మ బి.పద్మ, బి.శీను, నరసింహ రవి, రాములమ్మ, చుక్కమ్మ, కీసర ఘట్కేసర్ మండలాల కార్మికులు పాల్గొన్నారు.



ఆచార్యకొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాంనగర్ ఈ సేవ సెంటర్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వీశ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంగిశెట్టి జగదీష్ హాజరయ్యారు.
నవతెలంగాణ - ముషీరాబాద్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
12
గురువారం | సెప్టెంబర్ 28, 2023 | www.navatelangana.com



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా అశోక్ నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొట్టు శ్రీను పాల్గొన్నారు. నవతెలంగాణ - ముషీరాబాద్



రాంనగర్ లోని గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాని బీఆర్ఎస్ యువ నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, ముఠా జైసింహ, మండప నిర్వాహకులు నర్సింగ్ ముదిరాజ్, కొండ శ్రీధర్ రెడ్డి ,ప్రవీణ్ రాజ్, తదితరులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ - ముషీరాబాద్

అక్టోబర్ 11లోగా సమస్యలు పరిష్కరించాలి

- అనివార్యమైతే జీహెచ్ఎంసీ కార్మికులు సమ్మెలోకి..
- జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నేతలు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సమ్మెనోటీసు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పారిశుధ్య, మలేరియా, ట్రాన్స్‌పోర్ట్‌తోపాటు ఇతర విభాగాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే వచ్చేనెల 11 తర్వాత సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం (సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, బీఆర్టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ సంఘాల) జేఏసీ అధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు సమ్మెనోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జె.వెంకటేష్, ఇ.అంజయ్య, ఏసురత్నం, వి.జైపాల్‌రెడ్డి, రెబ్బా రామారావు, పీ.నర్సయ్య,



ఏ.శంకర్, రాజేశ్వరరావు, ఆర్.వాణి, జీ.కుర్మన్న, వీ.మారన్న ఎం.కే.బోస్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు జే.వెంకటేష్ మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో పారిశుధ్య నిర్వహణలో 25 సంవత్సరాలుగా ఎంతగానో శ్రమిస్తున్న పారిశుధ్య, మలేరియా, ట్రాన్స్‌పోర్ట్, ఇతర కార్మికులు, కేటగిరీ ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ఉన్న నగర ప్రజానీకానికి మెరుగైన పారిశుధ్య సేవలందించడం వల్ల జీహెచ్ఎంసీకి దేశంలో అనేక ఉత్తమ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉండటంతో జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాలు స్వతంత్రంగానూ, జెఏసీగానూ ఐక్యంగా సమ్మెలు, ఉద్యమాలు ఎన్నో చేశామని గుర్తు చేశారు. అయినా కూడా సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. జీహెచ్ఎం సీ కార్మికులు పని భారం, వేధింపులతో నిత్యం సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.24వేలు చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర 2వ పీఆర్సీ (రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు) అమలు తేదీ నుండే జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులకూ ఐఆర్, పీఆర్సీ అమలు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవాలన్నారు. పారిశుధ్య సేవల్లో ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించాలని, రాంకీ తదితర ప్రయివేట్ కంపెనీలతో జీహెచ్ఎంసీ పనులు చేయించరాదన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. బయో మెట్రిక్ హాజరు పట్టీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, అక్రమంగా పట్టుకున్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. జీహెచ్ఎంసీ పార్కుల్లో పనిచేస్తున్న వర్కర్లు, హౌస్ కీపింగ్ వర్కర్లకూ పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, జీహెచ్ఎంసీ కార్మికులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలన్నారు. ట్రాన్స్‌పోర్టు విభాగంలో తొలగించిన డ్రైవర్లు, వర్కర్లను తిరిగి పనిలోకి తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఎలకు కనీస వేతనాలు రూ.30వేలకు పెంచాలని, జీహెచ్ఎంసీ ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. దహన సంస్కారాలకు రూ.20వేలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు అనివార్య స్థితిలో పోరాటాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందన్నారు. వేతనాల పెంపుదల, సర్వీస్ సంబంధిత అంశాలపై అక్టోబర్ 9న జేఏసీ నేతలతో జీహెచ్ఎంసీ అధికారులు చర్చలు జరపడానికి అంగీకరించారని తెలిపారు. అయితే అక్టోబర్ 11లోగా సమస్యలు పరిష్కారం కాకుంటే రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా జీహెచ్ఎంసీ కార్మికులు సైతం సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

కుల సంఘాలకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కుల సంఘాల సంక్షేమ అభివృద్ధికి భవన నిర్మాణాలకు తెలంగాణ ప్రభుత్వం విశేష కషి చేస్తున్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఎస్సీ హాస్టల్ లైన్ లో నీలకంఠ సంఘం భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేసి సంఘం అధ్యక్షులు శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్ సహకారంతో గత నాలుగున్నర సంవత్సరాల నుంచి అన్ని కులాలకు మతాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే ఎన్నిక ల్లో పనిచేసే వారికే పట్టం కట్టాలని కల్లబొల్లి మాటలు చెప్పేవారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అదేవిధంగా భవన నిర్మాణంలో నిధులు సరిపోకుంటే సొంతనిధులైన ఇవ్వడానికి సిద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా నీలకంఠ సంఘం నాయకులు గత ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సంఘం నాయకులు అంబదాసు ,చంద్రశేఖర్, రాజు, శ్రీను, బీఆర్ఎస్ నాయకులు భరత్ ముదిరాజ్, కాలేరు రామకష్ణ, సురేష్ గౌడ్, అంబటి రవి, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ సాధనే బాపూజీకి నివాళి



- ఎంపీ ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

సామాజిక తెలంగాణ సాధనే కొండా లక్ష్మణ్ బాపూజీకి మనమిచ్చే నివాళి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కష్ణయ్య అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మెన్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యానగర్ బీసీ భవన్ లో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కష్ణయ్య, గుజ్జ సత్యం మాట్లాడుతూ.సబ్బండ వర్గాలు సౌఖ్యంగా జీవించడానికి తన స్వగహమైన జలదశ్యాన్ని టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావానికి అంకితమివ్వడం బాపూజీ దార్శనికతను, ధైర్యాన్ని ప్రతిబింబిస్తున్నదని తెలిపారు. కానీ నేడు తెలంగాణ ఆవిర్భావం తరువాత సామాజిక పరిస్థితులు అందుకు భిన్నంగా కొనసాగుతున్నాయన్నారు. మహనీయుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా అణిచివేయబడుతున్నారని అన్నారు. తెలంగాణ సమాజం మత్తులో తూలుతున్నారని అయినా ముఖ్యమంత్రి నోరు విప్పకపోవడం, మత్తు పదార్థాల మూలలను తుదముట్టించకపోవడం, బాధిత కుటుంబాన్ని పరామర్శించకవడం ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న దయనీయ పరిస్థితులను చెప్పకనే చెబుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, హైదరాబాద్ గ్రేటర్ ఉపాధ్యక్షులు పండరినాథ్, ములుగు జిల్లా అధ్యక్షులు బట్ట మురళీకష్ణ ,ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు , పగిల సతీష్, వంగరి రమణ మోహన్. రిపబ్లికన్ పార్టీ, వ్యవస్థాపకుడు అధ్యక్షుడు, ముప్పిడి సత్యనారాయణ, జయరాజ్, పద్మశాలి ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులకు సూచించారు. భోలక్‌పూర్, గాంధీ నగర్ డివిజన్ లో బుధవారం రూ. కోటి 5 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ లు పావని వినయ్ కుమార్, గౌసుద్దీన్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందిస్తామన్నారు. పీ అండ్ టీ కాలనీలో రూ. 39 లక్షల నిధులతో సర్వాంగ సుందరంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపడుతు న్నామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే పేదవారికి శుభకార్యాలు చేసుకోవడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు. పద్మశాలి కాలనీ, గుల్షన్ నగర్‌లో సీసీ రోడ్డు పనులకు అత్యధిక నిధులు కేటాయించామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సన్ని, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసు నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహ, స్థానిక డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, లక్ష్మీ గణపతి దేవస్థాన చైర్మెన్ ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ గౌడ్, చాంద్ పాషా, జునైద్ బగ్దాది, రహీం, మక్బుల్, జబ్బర్, ఉమాకాంత్, ముకుంద రెడ్డి, రవి, లతా రాంబాబు, సంతోష్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రక్తహీనత, దంత పరీక్షలు..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో 245 మంది విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత పరీక్ష నిర్వహించి మందులను అందించారు. అనంతరం కింగ్ కోఠి క్లస్టర్ ఆర్‌బీఎస్ కే డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. రోహిణి ఫౌండేషన్, కింగ్ కోఠి క్లస్టర్ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ పద్మజ ఆదేశాల మేరకు ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో పోషక ఆహార లోపం, రక్తహీనత లాంటి సమస్యలు గుర్తించామన్నారు. వీరందరికీ ఉచితంగా మందులను అందిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు టూత్ పేస్ట్ బ్రష్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ అలేఖ్య, డెంటల్ డాక్టర్ హారిక, డాక్టర్ సఫియా, డాక్టర్ దీక్షిత, డాక్టర్ సారా, ఉపాధ్యాయులు నిర్మల, జి వైశాలి, పిఎస్ సరళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

బీసీ బంధు అన్ని కులాలకు ఇవ్వాలి

నవతెలంగాణ-అంబర్ పేట



బీసీ బందు అన్ని కులాలకు ఇవ్వాలని కేవలం కొన్ని కులాలకు మొదట విడుతలో నియోజక వర్గానికి 300 మందికి ఇచ్చి చేతులు దులుపు కోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ రంగ ప్రదీప్ గౌడ్ అన్నారు. మంగళవారం తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కులను సీఎం కేసీఆర్ అనుగదొక్కుతు న్నారన్నారు. బీసీ విద్యార్థులకు వెంటనే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, ఎస్సీ బంధు లేక బీసీలకు కూడా రూ. 10 లక్షలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు సెరిమనీ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఉస్మానియా మెడికల్ కళాశాలలో బుధవారం 2023 నూతన ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోటు సెరిమని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సంపాదించినందుకు అభినందనలు తెలియజేశారు. తెల్ల కోటు అనేది స్వచ్ఛతకు నిదర్శనం అని విద్యార్థులు కష్టపడి చదివి డాక్టర్ వృత్తి చేపట్టి పేదలకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఉస్మానియా వైద్య కళాశాలకు అనుబంధంగా హైదరాబాద్‌లోని పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ ఆస్పత్రుల అందుబాటులో ఉన్నందున విద్యార్థులు వారు విద్యను అభ్యసించేందుకు ఈ ఆస్పత్రులు ఎంతో దోహదం చేస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయ, ఎనాటమీ హెచ్ఓడీ డాక్టర్ జానకి, ఫిజియాలజీ హెచ్ ఓ డి డాక్టర్ పద్మిని, ఎనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సుమలత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ అనిత, డాక్టర్ నివేదిత, ఎం పి హెచ్ ఈ ఓ వేణుగోపాల్ గౌడ్ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట డివిజన్ గోల్నాకలోని శ్రీ సాయి రెసిడెన్సీ ప్రతినిధులు నాగరాజు శర్మ, లక్ష్మీనారాయణ, రాకేశ్, వెంకటరెడ్డి, పాక స్వామి, ప్రేమ్‌కుమార్,బోగ స్వామి, రాంబాబు, పి రమేశ్, పవన కుమార్, ఆంధ్రపు శ్రీనివాస్, రిషి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలం పాటలో సాయి రెసిడెన్సీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాత్కనూరి సంతోశ్ రూ. 50 వేలకు దక్కించుకున్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట



కొండా లక్ష్మణ్ జీవిత చరిత్ర స్ఫూర్తిదాయకం

- తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్తా రమేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకమని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిమ్స్ హాస్పిటల్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేష్ అన్నారు. ఆయన స్ఫూర్తి, ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని చెప్పారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్గాల కృష్ణ ఆధ్వర్యంలో నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ రోగులకు పండ్ల పంపిణీ చేపట్టారు. దీనికి ముఖ్య అతిథులుగా డాక్టర్ మార్తా రమేష్, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావులు విచ్చేశారు. ఈ సందర్భంగా బాపూజీ ఆసియా సాధనకు అందరం కషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, హాస్పిటల్ ఆర్ఎమ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఫార్మసిస్ట్ జె.అశోక్, సంఘం ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి భీమన పల్లి అశోక్, ఉపాధ్యక్షుడు గంగిశెట్టి సత్తయ్య, కార్య దర్శు లు గంధ మల్ల శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేష్, ప్రచార కార్యదర్శి వనం రమణ, డివిజన్ అధ్యక్షులు పెద్ద బొమ్మ దామోదర్, కడిగే శ్రీనివాస్, నాయకులు రచ్చ శ్రీనివాస్, రిషి, పాండు, కనుకుంట్ల నర్సింగం, చేనేత వర్గాల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్క దేవదాసు, తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కే. మురళీకష్ణ, బీసీ నాయకుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కోఠి ఇసామియబజార్ వద్ద ఏర్పాటుచేసిన గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహాల్ నియోజకవర్గం బీజేపీ నాయకులు శైలేందర్ యాదవ్ అన్న ప్రసాదం పంపిణీ చేశారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్



మహిళలకు, పేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-అంబర్‌పేట

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని గోల్నాక సేవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కష్ణ హాజరై దుప్పట్లను అందజేశారు. బాపూజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వనమాల రాజేందర్, ఏ. మధుసూదన్, బి. అమిత్ కుమార్, కే. విజయ్ కుమార్, ఎస్. పాండురంగం, గంధ మల్ల శ్రీనివాస్, నర్సింగం, దీటి భాగ్యలక్ష్మి, భానుప్రియ, హరిత, త్రివేణి, అనురాధ, శశికళ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్ భజన మండలిని నిర్వాహకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కులన్ జగ్గారెడ్డి, గుండోజ వెంకటాచారి, పాల్వాయి శ్రీకాంత్ నాయి, శివారెడ్డి, నాగేష్, ముత్యాల వినోద్, బాల్ రెడ్డి, కే జగన్, డొలాక్ సాజన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వినాయక మండపాలలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.నగేష్ ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో, ముషీరాబాద్

అనవసర ఆంక్షలు విధిస్తే నగరాన్ని దిగ్బంధిస్తాం

- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు



నవతెలంగాణ - ముషీరాబాద్

పోలీసులు అనవసర ఆంక్షలు విధిస్తే నగరాన్ని దిగ్బంధిస్తామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు హెచ్చరించారు. ట్యాంక్ బండ్ పై క్రేన్లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ట్యాంక్ బండ్‌లో గణేష్ నిమజ్జనం చేయడానికి వస్తున్న భక్తులను తిరిగి పంపడాన్ని నిరసిస్తూ బుధవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ పై వినాయక నిమజ్జనాన్ని ఉత్సవ సమితి ప్రతినిధులు ధర్నా నిర్వహిం చారు. ఈ ధర్నాకు ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్ హాజరై మాట్లాడుతూ. ప్రభుత్వం హిందువుల విశ్వాసాలతో ఆటలాడితే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి వస్తుందని, గణేష్ నిమజ్జనం పై పోలీసులు విధిస్తున్న అనవసర ఆంక్షలపై భాగ్యనగరంలోని హిందూ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నదని తెలిపారు. వెంటనే సరైన చట్టపరమైన చర్యలు చేపట్టి గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గణేష్ నిమజ్జనం భాగ్యనగర సాంస్కతిక వైభవమని ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా పోలీసు అడ్డుగోడలు సష్టించినా ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై యధావిధిగా నిమజ్జనోత్సవం జరుపుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు ఆలె బాస్కర్ , నవీన్, గోవర్ధన్ , రాజు తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు .



మోండా మార్కెట్ డివిజన్‌లోని శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేశారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మెన్ రాజు అలియాస్ రాజాసింగ్‌ను నియమించారు. అలాగే ధర్మకర్తలతో కూడా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి అందరూ కషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య నందితతో పాటు మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు . నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ ప్రజల గుండెల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ప్రజల గుండెల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిరకాలం నిలిచి ఉంటారని నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా అన్నారు. బాపూజీ జయంతిని బుధ వారం నిజాం కళాశాలలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారిపై జరిగిన స్వతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాకుండా నాటి నైజాం ఫ్యూడల్ రాచరిక నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.పరంధాములు, ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ బి.జ్యోతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రేణుక, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.కవిత, ఈవోసి కో-ఆర్డినేటర్ డాక్టర్ దీకొండ తిరుపతి, స్టూడెంట్స్ అడ్వైజర్ డాక్టర్ కె.పాండయ్య, ఎగ్జామ్స్ ఎవాల్యూయేషన్ ఆఫీసర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సహజంగా మెరిసిపోవాలంటే..?

ముఖాన్ని ఎప్పటికప్పుడు తాజాగా ఉంచుకోవాలని అందరూ కోరుకుంటారు. ముఖం కాంతి వంతంగా కనిపించాలని రకరకాల క్రీములు, చాలా రకాల చిట్కాలు పాటిస్తూనే ఉంటారు. అయినప్పటికీ ఒత్తిడి, అలసట వల్ల త్వరగా వాడిపోతుంది. అలా అయినప్పటికీ అప్పటికప్పుడు తాజాగా అనిపించాలంటే చిన్న చిట్కాలు ఎప్పటికప్పుడు పాటిస్తే ముఖం సహజంగా మెరిసిపోతుంటుంది. అవేంటంటే...

చల్లటి నీటితో... : ప్రతిరోజూ ఉదయాన్నే నిద్రలేచిన వెంటనే మీరు చేయగలిగే సులభమైన పని ముఖాన్ని చల్లటి నీటితో కడగడం. ఇంటి నుండి బయటకు పోకపోయినా, ముఖం కడుక్కోవడం, శుభ్రంగా ఉంచుకోవడం మాత్రం మర్చిపోవద్దు. ఇది రాత్రిపూట చర్మంపై ఉండే అదనపు నూనెను శుభ్ర పరచడానికి సహాయపడుతుంది. అయితే ముఖానికి ఎప్పుడూ సబ్బు వాడకూడదని గుర్తుంచుకోండి.

ఓ గ్లాసు నీటితో రోజు ప్రారంభం... : సహజ సౌందర్యం కోసం, రోజంతా శక్తివంతంగా ఉండటం చాలా ముఖ్యం. సరైన ఆహారం, పానీయాలతో శరీరానికి ఇంధనం ఇస్తుంది. రోజు ఉదయం మేల్కొన్న వెంటనే ఒక గ్లాసు నీటిని తాగడం మంచిది. లేదంటే మంచినీటికి బదులుగా కొద్దిగా నిమ్మరసం, తేనెను కలిపి తీసుకోవచ్చు. ఇది చర్మానికి పోషకాలు, విటమిన్లను అందిస్తుంది. గ్రీన్ టీ, కొబ్బరి నీరు కూడా తాగవచ్చు. ఇవి చర్మంలో చైతన్యం నింపి కాంతివంతంగా ఉంచుతాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉండి చర్మానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.

ఐస్ థెరపీ : ఉదయాన్నే చర్మం నిర్జీవంగా అనిపిస్తే ఒక చిన్న క్లాత్‌లో ఐస్ ముక్కను తీసుకుని ముఖంపై సున్నితంగా రుద్దుతూ కొంచెంసేపు మసాజ్ చేసినట్లు చేయాలి. ఇది ముఖానికి సహజమైన గ్లో ఇస్తుంది. ఈ వ్యాయామం లోపలి నుండి మీ చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. అలాగే యోగా, ఏరోబిక్స్, జుంబా లేదా సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేసినా చర్మం మెరిసిపోతుంది.

ఆరోగ్యకరమైన అల్పాహారం : ఆరోగ్యకరమైన అల్పాహారం మంచి చర్మానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ముఖ్యం. రోగనిరోధక శక్తిని పెంచుకోడానికి ఆరోగ్యకరమైన అల్పాహారం తినడం చాలా అవసరం. దీనివల్ల చర్మం కూడా కాంతివంతంగా ఉంటుంది.

ముల్తానీ మట్టి : వారానికి లేదా రెండు వారాలకు ఒకసారి ముల్తానీ మట్టితో ఫేస్‌పాక్ వేసుకుంటే.. అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు. ఇది ముఖం మీది దుమ్ము, ధూళిని తొలగించి, పొడిబారకుండా చర్మాన్ని కాపాడుతుంది.



ఇట్లా చేద్దాం

ఆలుగడ్డలు త్వరగా ఉడకాలంటే... ముందుగా వాటిని ఒక ఇరవై నిమిషాలు ఉప్పు నీటిలో నానబెట్టాలి. తర్వాత వండుకుంటే త్వరగా మగ్గుతాయి.

ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వ్యాపించి ఉన్నాయి. ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జ్వరం బారిన పడుతూనే ఉన్నారు. దీని ప్రభావం వల్ల నోటికి ఏమీ రుచించదు. కానీ తినకుంటే ఇంకా నీరసించి పోతారు. అందుకే నోటికి కాస్త రుచిగా, ఏమైనా తినాలనిపించినా ఏది పడితే అది తినలేని పరిస్థితి. అలాంటి వారికి రసంతో భోజనం పెడితే నోటికి కాస్త రుచి అనిపించి తింటారు. ఈ రసాలు కూడా ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో రసాలు ఏ విధంగా చేస్తారో, ఆ వెరైటీలతో ఈ వారం రసాలు...

'రస'మయం..!



మైసూర్ రసం

కావాల్సిన పదార్థాలు : కందిపప్పు - మూడు చెంచాలు, చింతపండ - రెండు మీడియం సైజు నిమ్మ కాయంత, టొమాటోలు - నాలుగు, కొత్తిమీర - కట్ట, కొబ్బరి తురుము - నాలుగు చెంచాలు, ఉప్పు - సరిపడా

పొడి కోసం : ధనియాలు - మూడు చెంచాలు, ఆవాలు - అరచెంచా, జీలకర్ర - చెంచా, మెంతులు - చెంచా, ఎండుమిర్చి - నాలుగు, కరివేపాకు - ఆరు రెబ్బలు, మిరియాలు - అర చెంచా

తాలింపు కోసం : జీలకర్ర, ఆవాలు, ఇంగువ, ఎండుమిర్చి, కరివేపాకు, నూనె - కొద్దికొద్దిగా

తయారుచేసే విధానం : ముందుగా కడాయిలో ధనియాలు, ఆవాలు, జీలకర్ర, మెంతులు వేయించి తీసి చల్లారనివ్వాలి. అదే కడాయిలో చెంచా నూనె వేసి ఎండుమిర్చి, మిరియాలు, కరివేపాకు, ఇంగువ వేసి వేగాక చల్లారనివ్వాలి. ఇప్పుడు అన్నీ కలిపి మెత్తగా పొడి చేయాలి. కందిపప్పును ఉడికించి పక్కన పెట్టుకోవాలి. చింతపండును నానబెట్టి ఒకటిన్నర లీటర్ల రసం తీయాలి. ఈ రసాన్ని ఓ మందపాటి కడాయిలో పోసి మరిగించాలి. అందులో ఉడికించి మెదిపిన కందిపప్పు, సన్నగా కోసిన టొమాటోలు, రసం పొడి, కొత్తిమీర, ఉప్పు వేసి పదినిమిషాలు మరిగించాలి. తర్వాత దించి తాలింపు చేసి కొబ్బరి తురుము వేసి మరిగించేస్తే సరి..


తెలంగాణ మామిడి రసం



కావాల్సిన పదార్థాలు : పచ్చి మామిడికాయలు - రెండు, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - నాలుగు, అల్లం వెల్లుల్లి - చెంచా, కరివేపాకు - రెండు రెబ్బలు, జీలకర్ర - పావు చెంచా, ఆవాలు - పావు చెంచా, ఎండుమిర్చి - మూడు, నూనె - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, పసుపు - పావు చెంచా.

తయారుచేసే విధానం : పచ్చిమామిడికాయల్ని నీళ్లలో వేసి ఉడికించాలి. వాటి నుంచి గుజ్జు తీసి అందులో సుమారు లీటరు నీళ్లు కలిపి పక్కన ఉంచాలి. కడాయిలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి వేగాక అల్లం వెల్లుల్లి వేసి బాగా వేయించాలి. ఇప్పుడు సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పసుపు కూడా వేసి వేగాక తీసి ఉంచిన మామిడిరసంలో కలపాలి. చివరగా చీల్చిన పచ్చిమిర్చి, కరివేపాకు, ఉప్పు వేసి కలిపి దించుకోవాలి. ఈ రసాన్ని మామిడికాయల సీజన్‌లో మాత్రమే చేసుకోగలం.

ఉలవచారు



కావాల్సిన పదార్థాలు : ఉలవలు - కప్పు, చింతపండు - నిమ్మకాయంత, పచ్చిమిర్చి - మూడు, ఎండుమిర్చి - నాలుగు, కరివేపాకు - నాలుగు రెబ్బలు, జీలకర్ర - అర చెంచా, ఆవాలు - చెంచా, బెల్లం తరుగు - చెంచా.

పొడి కోసం : దనియాలు - చెంచా, జీలకర్ర - చెంచా, వెలుల్లి రేకలు - ఆరు.

తయారుచేసే విధానం : ఉలవల్ని ఒక రాత్రంతా నానబెట్టి ఎనిమిది కప్పుల నీటిలో మెత్తగా ఉడికించి వడకట్టాలి. తర్వాత అరకప్పు ఉలవలను మాత్రమే తీసుకుని పేస్టులా రుబ్బుకోవాలి. కడాయిలో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పచ్చిమిర్చి, వేయించి వడకట్టిన నీరు పోసి మరిగించాలి. ఒక పొంగు రాగానే పసుపు, ఉప్పు, బెల్లం, రసం పొడి, ఉలవల పేస్టు, చింతపండు గుజ్జు కలిపాలి. దీన్ని చిన్న మంటపై ఇరవై నిమిషాలు మరిగించాలి. వేడి వేడి అన్నంతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.



మద్రాసు రసం

కావాల్సిన పదార్థాలు : కందిపప్పు - యాభై గ్రా., చింతపండు - పెద్ద నిమ్మకాయంత, టొమాటోలు - రెండు, కొత్తిమీర - ఒక కట్ట, కరివేపాకు - ఐదు రెబ్బలు

పొడి కోసం : ధనియాలు - మూడు చెంచాలు, మిరియాలు - అరచెంచా, ఇంగువ - చిటికెడు, జీలకర్ర - పావు చెంచా, ఎండుమిర్చి - నాలుగు, శెనగపప్పు - మూడు చెంచాలు

తాలింపు కోసం : నూనె, ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్ర, కరివేపాకు అన్ని కొద్దికొద్దిగా

తయారుచేసే విధానం : కందిపప్పుని ఉడికించి మెత్తగా మెదపాలి. చింతపండు నానబెట్టి గుజ్జు తీసి అందులో ఓ గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. ఓ గిన్నెలో ఉడికించిన పప్పు, మరిగించిన చింతపండు రసం కలిపి చిన్నగా తరిగిన టొమాటో ముక్కలు, కరివేపాకు, కొత్తిమీర అన్నీ వేసి కలపాలి. పొడి కోసం తీసుకున్నవన్నీ వేయించి పొడి చేసి రసంలో కలపాలి. ఇప్పుడు ఇందులో సుమారు రెండుపావు లీటర్ నీళ్లు పోసి సన్నని సెగమీద మరిగించాలి. అది బాగా మరిగిన తరవాత తాలింపు చేసి దించాలి.

ఆంధ్రా వెల్లుల్లి చారు



కావాల్సిన పదార్థాలు : చింతపండు- రెండు పెద్ద నిమ్మకాయలంత, ఉల్లిపాయలు - రెండు, వెల్లుల్లి - ఎనిమిది రెబ్బలు, కరివేపాకు - కట్ట, కొత్తిమీర - కట్ట, పసుపు - అర చెంచా, చెక్కెర - మూడు చెంచాలు, ఉప్పు - రుచికి తగినంత

తాలింపు కోసం : ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి - తగినన్ని

తయారుచేసే విధానం : సుమారు రెండు లీటర్ల నీళ్లలో చింతపండు రసం తీసి స్టవ్‌మీద పెట్టి మరిగిస్తూ ఉండాలి. విడిగా ఓ పాన్‌లో నూనె వేసి తాలింపు చేశాక అందులోనే చిదిమిన వెల్లుల్లి, సన్నగా తరిగిన ఉల్లిముక్కలు, పసుపు, వేసి బాగా వేయించాలి. తర్వాత దీన్ని మరుగుతున్న చింతపండు రసంలో వేసి కలపాలి. ఇప్పుడు సరిపడా ఉప్పు వేసి మరో పావుగంట మరిగించాక దించేముందు పంచదార, కరివేపాకు తురుము, కొత్తిమీర తురుము చేర్చి మరో ఐదు నిమిషాలు మరిగించి దించాలి.

పింఛనేది బాంచన్..?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. 2023-24 వార్షిక సంవత్సరానికి రూ.11,774.90 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో పింఛన్ కోసం కేటాయించింది. వికలాంగులకు జులై నుంచి రూ.4,016 పింఛన్ అమలవుతోంది. పెంచిన పింఛన్‌ను కూడా కొన్నిచోట్ల రెండు నెలలు జులై, ఆగస్ట్ నెలలకు సంబంధించినవి ఆగస్టు నెలలోనే రెండు పర్యాయాలు విడుదల చేశారు. గత రెండేండ్లుగా ఏ ఒక్కరోజూ సకాలంలో పింఛన్ అందలేదని లబ్దిదారులు వాపోతున్నారు.

కాంగ్రెస్ రూ.4వేల పింఛన్‌పై చర్చ

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో ఆసక్తి కనబడుతోంది. దీనిలో రూ.4వేల పింఛన్ కూడా ఒకటి. ఖమ్మం వేదికగా జులై 2వ తేదీన ప్రజాగర్జన సభలో రాహుల్‌గాంధీ ఈ ప్రకటన చేశారు. దీనినే ఆరు గ్యారెంటీల్లో ఒకటిగా చేర్చారు. అయితే దీనిని బలంగా జనంలోకి తీసుకెళ్లాలంటే ఇంకా సమయం పడుతుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. దీనికి మరో రూ.500 అదనంగా పెంచి ప్రకటన చేయాలనే యోచనలో బీఆర్ఎస్ ఉన్నట్టు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చే ఏ ప్రభుత్వమైనా సకాలంలో పింఛన్ విడుదల చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు. గత ఎన్నికల్లో పింఛన్‌లు, రైతుబంధు వంటి పథకాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఆ తర్వాత ఈ రెండింటినీ సక్రమంగా అమలు చేయడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ పెంచడం మంచిదే కానీ దానిని సకాలంలో ఇవ్వకపోతే ఏమి ఉపయోగమని ప్రశ్నిస్తున్నారు.

ప్రతినెలా ఫస్ట్ తారీఖే పింఛన్ పడాలి..
వీర్ల సుభద్ర, వితంతు పెన్షన్‌దారు

ప్రభుత్వం పింఛనైతే ఇస్తుంది కానీ, ఏనెల ఎప్పుడు వేస్తరో తెలియట్లేదు. 1వ తారీఖు కానుంచి ఎదురుచూస్తున్నా.. ఈనెల అయిపోతున్నా ఇంత వరకు పింఛన్ రాలేదు. వేసినప్పుడు తీసుకోవడం తప్ప ఏమీ లేదు. ఏడాదికి 12 నెలలు రావాల్సిన పింఛన్ ఒకనెల వేసి, ఒకనెల వేయక..10, 11 నెలలు మాత్రమే ఇస్తున్నారు. కాంగ్రెస్ వస్తే రూ.4వేల పింఛన్ ఇస్తారట..! వాళ్లు కూడా ఇలాగే చేస్తే ఎదురుచూడక తప్పదు.

బిల్లులను తొక్కిపెడుతున్న గవర్నర్

(మొదటిపేజీ తరువాయి)

అభీష్టాన్ని ప్రతిబింబించేలా శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నరు తొక్కిపట్టడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని అన్నారు. బిల్లులకు సంబంధించి గవర్నర్ కోరిన వివరణలను సంబంధిత మంత్రులు, అధికారులు ఇచ్చారు. అయినా, ఈ బిలులపై గవర్నరు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నాన్చుతున్నారని ఆయన అన్నారు..యుజిసి నిబంధనల ప్రకారం కేరళలో యూనివర్సిటీ చట్టాల ఏకీకరణకు సంబంధించిన బిల్లుకు ఇంతవరకు మోక్షం లభించలేదు. ఈ కారణంగా యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకం నిలిచిపోయింది.కేరళ పబ్లిక్ హెల్త్ బిల్లును కూడా తొక్కిపట్టారు. గవర్నర్ తనకు విచక్షణాధికారాలు ఉన్న వాటిలో మినహా మిగతావాటిలో ఎన్నికైన ప్రభుత్వాల సలహాలు, సహకారంతో వ్యవహరించాలని రాజ్యాంగ పరిషత్తులో చర్చలు స్పష్టం చేస్తున్నాయి. వలస ప్రభుత్వ పాలనలో ప్రాంతీయ ప్రభుత్వాలు విస్తత విచక్షణాధికారాలను కలిగి ఉండేవి. 1937లో, అప్పటి భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం ప్రావిన్సులలో ఎన్నికలు జరిగినప్పుడు, భారత జాతీయ కాంగ్రెస్ 5 ప్రావిన్సులలో మెజారిటీ సాధించింది. అయినప్పటికీ, మహాత్మా గాంధీతో సహా జాతీయ నాయకులు గవర్నర్‌లకు ఇచ్చిన విస్తతమైన విచక్షణ అధికారాలను తొలగించాలని పట్టుబట్టారు ప్రావిన్సులలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి నిరాకరించారు. సాధారణ చట్టాల ఆమోదం ఆలస్యం చేయడం వల్ల ప్రజలకు బాధ్యత వహించే ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాన్ని లేవనెత్తుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

2025 నవంబరు నాటికి ... తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ

2025 నవంబర్ 1 నాటికి కేరళను తీవ్ర పేదరికం నుండి విముక్తి చేయడమే తమ లక్ష్యమని కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రకటించారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు.

నిమజ్జనంపై పోలీసుల డేగ కన్ను

(మొదటిపేజీ తరువాయి)

షీ బృందాలను రంగంలోకి దించారు. ట్రాఫిక్, సివిల్, టాస్క్‌ఫోర్సు, ఎస్‌వోటీ, ర్యాపిడ్ యాక్షన్ పోలీసులతోపాటు ప్రత్యేక బృందాలను బందోబస్తులో ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, రవాణా శాఖతోపాటు ఇతర శాఖలతో పోలీస్ అధికారులు కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఇప్పటికే నిమజ్జన ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆయా ప్రాంతాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రత్యక్షంగా పరిశీలించారు. చాంద్రాయణగుట్ట, చార్మినార్, నయాపూల్, ఎంజే మార్కెట్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో హైదరాబాద్ సీపీ పర్యటించగా.. ఉప్పల్, చర్లపల్లి, కాప్రా, రాంపల్లి తదితర ప్రాంతాల్లో రాచకొండ సీపీ పర్యటించారు. ఇద్దరు కమిషనర్లు అవసరమైన ఏర్పాట్లు, శోభాయాత్ర కొనసాగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలను అందించారు. పాత నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఊరేగింపుగా వచ్చే నిర్వాహకులకు, నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవా లన్నారు. నిమజ్జన ప్రక్రియ ఆలస్యం కాకుండా అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేశారు. డ్రైవర్లను, మెకానిక్‌లను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. రాత్రిపూట నిమజ్జన సమయంలో ప్రమాదాలకు ఆస్కారముందని, నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీలు సూచించారు. మద్యం సేవించి నిమజ్జన ప్రక్రియలో పాల్గొనొద్దన్నారు.

బీఆర్ఎస్‌కు 25 సీట్లు దాటవు

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్‌పాలన రాష్ట్రాన్ని దివాళా తీయించిందని విమర్శించారు. కేసీఆర్‌కు అచ్చొచ్చే నెంబర్‌వన్ కోసం రూ. 6 లక్షల కోట్ల అప్పు చేశారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లా మా నాయకుడు రాహుల్‌గాంధీ బ్లఫ్‌మాస్టర్ కాదు...ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్‌తో మాట్లాడుతారని చెప్పారు. ఎంఐఎం, బీఆర్ఎస్ లేని చోట బీజేపీకి ఓటు వేయాలంటూ అసదుద్దీన్ చెప్పడం సిగ్గుచేటన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతోపాటు ముఖ్య అనుచరులు కూడా గురువారం సాయంత్రం కాంగ్రెస్‌లో చేరుతారని తెలిపారు. మైనంపల్లి కుటుంబానికి రెండు టిక్కెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించిందని చెప్పారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం హస్తం పార్టీలో చేరనున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఓట్లు కావాలే కానీ ఇక్కడ నిరసన చేస్తే అరెస్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ దేశ రాజకీయాలకు సంబంధించినదని తెలిపారు. హైదరాబాద్‌లో నిరసన చేసేందుకు అనుమతి తీసుకోవాలని కోరితే తప్పులేదనీ, కానీ చంద్రబాబుకు అరెస్టుకు తెలంగాణకు సంబంధం లేదనడం సరైందికాదని తెలిపారు. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు ఇతర ప్రాంతాల్లో నిరసన చేసే హక్కు కోల్పోతారని హెచ్చరిచారు. ఏపీలో జరుగుతున్నా పరిణామాలు, కేసుల గురించి తాను మాట్లాడదల్చుకోలేదు. తెలంగాణ లో జరుగుతున్న నిరసనలను అడ్డుకోవడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నా అని వివరించారు. వైఎస్ షర్మిల చేరిక అంశంపై నాకు ఎలాంటి సమాచారం లేదన్నారు. త్వరలోనే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్‌పై నమ్మకం లేకపోవడం వల్లే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోర్ట్‌ను ఆశ్రయించారని తెలిపారు. కవిత అరెస్ట్ కోర్టు జోక్యం వల్ల ఆగిపోయిందన్నారు. పార్టీలో చేరేందుకు అందరికీ ఆహ్వానమేనన్నారు. స్థానిక పరిస్థితుల బట్టి టికెట్‌పై పార్టీ సమిష్టి నిర్ణయం తీసుకుంటున్నదని చెప్పారు.

బీసీలకు 34 సీట్ల కేటాయింపు కోసం వందకు వందశాతం ప్రయత్నిస్తున్నట్టు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ కంటే బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తామన్నారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పార్టీలో బలమైన వాదన వినిపించారని చెప్పారు. వారి తరుపున సెంట్రల్ ఎలక్షన్ కమిటీలో నా వాదన ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది బీసీ నేతలు పార్టీకి అధ్యక్షులుగా పని చేశారనీ, కానీ ఏ ఒక్క బీసీ నాయకుడైన బీఆర్ఎస్‌కు అధ్యక్షుడు కాగాలరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో విడతల వారీగా అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు.బీఆర్ఎస్ నేతలు తీసుకుంటున్న 30శాతం కమీషన్ కంట్రోల్ చేస్తే..కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేయవచ్చునని ఈ సందర్భంగా రేవంత్ వివరించారు.

గ్రూప్ 1పై అప్పీల్ డిస్మిస్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పలేకపోయిందని వ్యాఖ్యానించింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వీస్ కమిషన్ సెక్రటరీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ మేరకు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌ల డివిజన్ బెంచ్ బుధవారం తీర్పు చెప్పింది.

"ఒకసారి పేపర్ లీకేజీ, పరీక్షల రద్దు తర్వాత రెండోసారి నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షను సమర్థంగా నిర్వహించకపోవడం' శోచనీయం. గ్రూప్ 4 పరీక్షలో మాత్రం బయోమెట్రిక్ తీసుకోవడం లేదని పేర్కొంటూ అనుబంధ నోటిఫికేషన్ జారీ చే సినట్లుగా గ్రూప్ 1 పరీక్షలకు ఎందుకు జారీ చేయలేదు. పరీక్ష పెట్టిన వెంటనే ప్రకటించిన అభ్యర్థుల సంఖ్యకు. కమిషన్ వెబ్‌నోట్‌లోని అభ్యర్థుల సంఖ్య 258 తేడా ఎందుకు వచ్చిందో కమిషన్ చెప్పలేదని తప్పుపట్టింది. ఆ 258 మంది దొడ్డి దారిలో వచ్చి గ్రూప్ 1 వంటి కీలక పోస్టుల్లో చేరితే ప్రతిభావంతులైన అభ్యర్థుల పరిస్థితి ఏమిటని కమిషన్‌ను ప్రశ్నించింది. ఆ పోస్టులకు ఎంపికయ్యే వారంతా కొన్నేళ్లకు ఐఏఎస్ వంటి కన్ఫర్డ్ అధికారులు అవుతారని గుర్తు చేసింది. కన్ఫర్డ్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అయ్యాక అలాంటి వారు నిర్ణయాలు తీసుకుంటే ప్రజల భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించింది. కమిషన్ నిర్వాకం వల్ల లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గ్రూప్ 4 పరీక్షలకు బయోమెట్రిక్ తీసుకోవడం లేదని అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చిన కమిషన్ గ్రూప్ 1 విషయంలో అవసరం లేదని ఎలా చెబుతుంది. 258 అభ్యర్థుల సంఖ్య తేడాగా కమిషన్ చెప్పింది. బయోమెట్రిక్ తీసుకోకపోవడంపై అక్రమాలు జరిగాయనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ సందేహాలకు, అనుమానాలకు కమిషనే ఆస్కారం ఇచ్చింది. నోటిఫికేషన్ నిబంధనలను సవరిస్తూ అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం చట్ట వ్యతిరేకమే. ఈ మేరకు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు ఆమోదయోగ్యంగానే ఉంది. ఆ తీర్పులో జోక్యం చేసుకోబోము. నోటిఫికేషన్‌ను సవరించే అధికారం కమిషన్‌కు ఉన్నప్పటికీ ఆ సవరణలపై అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలని నిబంధనలను గుర్తు చేసింది. పరీక్షలు అవ్వగానే 2,33,348 మంది అభ్యర్థులు హాజరయ్యారని చెప్పిన కమిషన్ 17 రోజుల తర్వాత ఆ సంఖ్య 258 మందిని పెంచి ఎలా చెబుతుందని ప్రశ్నించింది. అక్టోబర్‌లో జరిపిన పరీక్షకు 2,85,968 మంది హాజరయ్యారు. అధికారుల నిర్వాకం ఫలితంగా పేపర్ లీకేజీ అవ్వడంతో రెండోసారి పరీక్ష నిర్వహిస్తే సుమారు 50 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయేలేదని చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నోటిఫికేషన్‌కు కట్టుబడి ఇరుపక్షాలు (కమిషన్-అభ్యర్థులు) ఉండాలి. దానిని సవరించే అధికారం కమిషన్‌కు ఉన్నప్పటికీ సవరణ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం చెల్లదు. బయోమెట్రిక్ తొలిసారి పరీక్షలకు తీసుకున్నప్పుడు లేని అభ్యంతరం రెండోసారి పరీక్షల నిర్వహణ సమయంలో ఎలా వచ్చింది. పైగా 50 వేల మంది అభ్యర్థులు తగ్గిన తర్వాత కూడా కమిషన్ టెక్నికల్ సమస్యలని చెప్పడం సరికాదు. అందుకే కమిషన్ వేసిన అప్పీల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం. సింగిల్ జడ్జి తీర్పును ఆమోదిస్తున్నాం. తిరిగి గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహించాల్సిందే.. " అని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోతున్నారనీ, గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద నివారణ కోసం ఎలాంటి చర్యల్లేవని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన నిధులను ఖర్చు చేయడం లేదని పేర్కొన్నారు. తక్షణమే ఆ నిధులను గీతకార్మికుల సంక్షేమానికి వినియోగించాలనీ, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. వృత్తి ప్రమాదకరమైనప్పటికీ బతుకుదెరువు కోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడాదికి సుమారు 180 మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారని వివరించారు. కాళ్లు, చేతులు విరిగి జీవనాధారాన్ని కోల్పోతున్నారని తెలిపారు. భద్రత కల్పిస్తామనీ, గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామన్న ప్రభుత్వ వాగ్దానాలు నెరవేరకపోవడంతో వారు తీవ్ర నిరాశతో ఉన్నారని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం ప్రకటించిన హామీలను చిత్తశుద్ధితో అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియా యధావిధిగా కొనసాగిస్తూనే ఇటీవల ప్రకటించిన గీతన్న బీమాను అమలు చేయాలని కోరారు. బీసీ వృత్తిదారులకు ఇచ్చిన జీవో నెంబర్ ఐదు ప్రకారం కల్లుగీత వృత్తి చేస్తున్న వారందరికీ లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

(మొదటిపేజీ తరువాయి)

88,913 మంది 10,199 (11.47 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అయితే టెట్‌లో ఫలితాలు భారీగా తగ్గడం గమనార్హం. పేపర్-1లో 36.89 శాతం, పేపర్-2లో కేవలం 15.30 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. డీఎస్సీ రాతపరీక్షలకు ముందు టెట్ నిర్వహించడంతో ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. అయితే తక్కువ మంది ఉత్తీర్ణులు కావడంతో మిగిలిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. టెట్ ఉత్తీర్ణత ఉంటేనే డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అర్హులవుతారు. దీంతో టెట్ ఉత్తీర్ణత సాధించని అభ్యర్థులు డీఎస్సీకి దూరమయ్యారు.

అధికారుల అలసత్వం

విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్టీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించారు. టెట్ ఫలితాలకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వకుండానే చేతులు దులుపేసుకున్నారు. జిల్లాల వారీగా, జెండర్ వారీగా, కమ్యూనిటీ వారీగా ఫలితాలు ప్రకటించకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నదని పలువురు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. కేవలం ఉత్తీర్ణత వివరాలు బహిరంగపరిచి ఇతర వివరాలు మీడియా ప్రతినిధులు అధికారులను అడిగినా సమాధానం చెప్పకపోవడం గమనార్హం.

టెట్ ఫలితాలు

పేపర్	హాజరు	ఉత్తీర్ణత	శాతం
1	2,23,582	82,489	36.89
2 (మ్యాథ్స్, సైన్స్)	1,01,134	18,874	18.66
సోషల్ స్టడీస్	88,913	10,199	11.47
మొత్తం	1,90,047	29,073	15.30

పెండ్లి వేడుకలో విషాదం

- ఇరాక్‌లో అగ్ని ప్రమాదం 114మంది మృతి

బాగ్దాద్ : ఇరాక్‌లో దారుణం చోటు చేసుకుంది. వివాహ వేడుక జరుగుతున్న ఫంక్షన్ హాల్‌లో పెద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 114మంది మరణించగా, 200మందికి పైగా గాయపడ్డారని ఇరాక్ ఉత్తర ప్రాంత ప్రావిన్స్ అయిన నినెవా గవర్నర్ నజ్మ్ అల్ జుబోరి బుధవారం తెలిపారు. ఆ ప్రావిన్స్‌లోని అల్ హమ్‌దనియా పట్టణంలో ఈ విషాదం సంభవించింది. ప్రావిన్స్ రాజధాని మోసుల్‌కు ఆగ్నేయంగా 35కిలోమీటర్ల దూరంలో అల్ హమ్‌దనియా పట్టణంలో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయని అధికార వార్తా సంస్థ ఐఎన్ఎ తెలిపింది. వివాహ వేడుకలను పురస్కరించుకుని బాణాసంచా కాల్చారని, దానివల్లే మంటలు చెలరేగి వుండవచ్చని ప్రాథమిక సమాచారం తెలియచేస్తోంది.

నవచిత్రం

నవ్వుతూనే ఉంటారు



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నుంచి రాబోతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ ప్రధాన పాత్రలు పోషించారు. హారిక సూర్యదేవర నిర్మాతగా పరిచయం అవుతుండగా, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పై సాయి సౌజన్య నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు. నూతన దర్శకుడు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో 'మ్యాడ్' గ్యాంగ్‌ని పరిచయం చేస్తూ మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఘనంగా జరిగిన ఈ వేడుకకు చిత్రం బృందంతో పాటు, 'జాతిరత్నాలు' దర్శకుడు అనుదీప్ సహా పలువురు హాజరయ్యారు. ఈ సినిమాలో అనుదీప్ కూడా నటించడం విశేషం.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దర్శకుడు కళ్యాణ్ ఎప్పుడూ మంచి కథలు రాస్తుంటాడు. ఈ సినిమా చాలా ఎనర్జీతో, చాలా హ్యూమర్‌తో ఉంటుంది. కొత్తవాళ్ళని ప్రోత్సహిస్తూ నాగవంశీ మరిన్ని సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. మీరందరూ థియేటర్లలో ఈ సినిమాని చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

"జాతిరత్నాలు' కంటే ఒక్కసారైనా తక్కువ నవ్వానని ఎవరైనా చెప్తే.. టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తాం. సినిమా పట్ల అంత నమ్మకం ఉంది. ఇది యూత్ ఫుల్ సినిమా అయినప్పటికీ, కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుంది. ఇంజనీరింగ్ కాలేజ్ లైఫ్‌ని గుర్తు చేయడానికి తీసిన సినిమా ఇది. లాజిక్కులు, ట్విస్ట్‌లు ఏముండవు. సినిమా మొదలైనప్పటి నుండి చివరివరకు నవ్వుతూనే ఉంటారు' అని నిర్మాత నాగవంశీ చెప్పారు. దర్శకుడు కళ్యాణ్ శంకర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో మ్యాడ్ క్యారెక్టర్స్ ఉంటాయి. నిర్మాత హారిక స్క్రిప్ట్ దశ నుంచి షూటింగ్ వరకు మొత్తం దగ్గరుండి చూసుకున్నారు. ఈ సినిమాలో ఓన్లీ ఎంటర్టైన్మెంటే ఉంటుంది. వంశీ చెప్పినట్టు మీకు డబ్బులు వెనక్కి రావు. అంతలా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

ఆస్కార్ ఎంట్రీకి మలయాళ చిత్రం 2018

నిరాశపర్చిన తెలుగు సినిమాలు



ఆస్కార్ - 2024 అవార్డుల కోసం మన దేశం నుంచి మలయాళ బ్లాక్‌బస్టర్ '2018' చిత్రం అధికారికంగా ఎంపికైంది. వచ్చే ఏడాది ప్రదానం చేసే ఆస్కార్ అవార్డుల కోసం ఉత్తమ విదేశీ చిత్ర కేటగిరిలో ఈ చిత్రాన్ని సెలెక్ట్ చేశారు. టోవినో థామస్ ప్రధాన పాత్రలో జూడ్ ఆంథోని తెరకెక్కించిన చిత్రమిది. 2018లో కేరళలో సంభవించిన వరదల ఆధారంగా తయారు చేసుకున్న కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆద్యంతం భావోద్వేగ భరితంగా నిర్మితమైన ఈ చిత్రం మలయాళంతోపాటు దేశవ్యాప్తంగా అన్ని భాషల్లోనూ విడుదలై ప్రేక్షకులతో కన్నీళ్ళు పెట్టించింది. అంతేకాదు బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్ళని సాధించింది.

ప్రతి సంవత్సరం పలు దేశాలు ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో తమ దేశ చిత్రాలను పంపిస్తుంటాయి. ఈ క్రమంలో ఆస్కార్ 2024 కోసం మన దేశం నుంచి దాదాపు 22 చిత్రాలు పోటీ పడ్డాయి. ప్రముఖ ఫిల్మ్ మేకర్ గిరిష్ కాసరవల్లి అధ్యక్షతన 17 మంది సభ్యులతో కూడిన ఆస్కార్ కమిటీ చెన్నై వేదికగా ఈ చిత్రాలను వీక్షించారు. వీటిల్లో '2018' చిత్రాన్ని కమిటీ ఎంపిక చేసింది.

అమీర్‌ఖాన్ 'లగాన్' తర్వాత ఇప్పటివరకూ ఏ భారతీయ చిత్రమూ ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో ఆస్కార్ బరిలో తుది వరకూ నిలవలేదు. అంతకముందు 'మదర్ ఇండియా', 'సలామ్ బాంబే' సినిమాలు మాత్రమే ఈ కేటగిరిలో పోటీ పడ్డాయి.

ప్చ్.. ఎంట్రీలోనే ఎగ్జిట్

ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఎంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డు మన తెలుగు చిత్ర సీమకు కూడా దక్కటంతో రాబోయే ఏడాది కూడా ఏ తెలుగు సినిమా ఆస్కార్‌కి వెళ్తుందని అని సర్వత్రా ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పైగా ఉత్తమ విదేశీ చిత్ర కేటగిరిలో ఈ ఏడాది 'బలగం', 'దసరా' చిత్రాలు సైతం పరిశీలనకు వెళ్ళాయి. దీంతో వీటిల్లో ఏ సినిమా అధికారికంగా మన దేశం నుంచి పోటీకి వెళ్తుందని ఆశగా ఎదురు చూసిన అందరికీ నిరాశే ఎదురైంది.

టైగర్ విశ్వరూపం


రవితేజ

రవితేజ, దర్శకుడు వంశీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టైగర్ నాగేశ్వరరావు'. అక్టోబర్ 20న గ్రాండ్‌గా విడుదల కానుంది. గ్రిప్పింగ్ టీజర్, చార్ట్‌బస్టర్ పాటలతో నేషనల్ వైడ్‌గా ఈ సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో అక్టోబర్ 3న ఈ చిత్ర ట్రైలర్‌ని రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.

అడవిలో పులిని వేటాడే విధంగా రవితేజ తన ప్రత్యర్థులపై దాడి చేస్తున్నట్లు ప్రెజెంట్ చేసిన మాస్ అప్పీలింగ్ పోస్టర్ ద్వారా ట్రైలర్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. పోస్టర్‌లో రవితేజ డాషింగ్‌గా కనిపిస్తున్నారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటివరకూ రెండు పాటలను విడుదలై, మంచి ఆదరణ పొందాయి. నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఆర్ మదీ ఐఎస్‌సి, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, శ్రీకాంత్ విస్సా డైలాగ్ రైటర్ కాగా, మయాంక్ సింఘానియా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

భిన్న కాన్సెప్ట్‌తో విధి


రోహిత్ నందా, ఆనంది

రోహిత్ నందా, ఆనంది జంటగా నో ఐడియా ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రంజిత్.ఎస్ నిర్మించిన చిత్రం 'విధి'. శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ రచన, దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందిస్తున్నారు.

తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో నిర్మాత రంజిత్ మాట్లాడుతూ, "విధి' ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోంది. ఆడియెన్స్ అందరినీ ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అని అన్నారు.

'ఆడియో డిస్క్రిప్టివ్ టెక్నాలజీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. కంటి చూపు లేని వాళ్ల కూడా ఈ సినిమాని అనుభూతి చెందగలరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు పది లక్షల మంది కంటి చూపు లేని వాళు న్నారు. అందులో 90 శాతం మంది థియేటర్‌కు వెళ్లి ఉండకపోవచ్చు. వాళ్లంతా థియేటర్‌కు వెళ్లి ఈ సినిమాను ఆస్వాదించవచ్చు. ఢిల్లీలోని సాక్ష్యం ఫౌండేషన్ ఈ యాప్ తయారు చేయడంలో సహాయం చేసింది. యూట్యూబ్ ద్వారా శ్రీకాంత్, శ్రీనాథ్ పరిచయం అయ్యారు. అలా మా ప్రయాణం ప్రారంభం అయింది. ఆనందితో కంఫర్టబుల్‌గా పని చేశాను' అని హీరో రోహిత్ నందా చెప్పారు. దర్శకులు మాట్లాడుతూ, 'ఇది మాకు మొదటి సినిమా. అందర్నీ తప్పకుండా మెప్పిస్తుంది' అని అన్నారు.

పక్కా బోయపాటి మార్క్‌తో స్కంద


శ్రీలీల

బోయపాటి శ్రీను, రామ్ పోతినేని కాంబోలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కంద'-ది ఎటాకర్. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పించారు. ఈ సినిమా నేడు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీలీల మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో చాలా నియమాలు పాటించే అమ్మాయిగా కనిపిస్తాను. నా పాత్రలో మాస్, క్లాస్ రెండూ మిక్స్‌లో ఉంటాయి. వీటిల్లో కొన్ని సీన్స్ నా రియల్ లైఫ్ నుంచి కూడా వచ్చాయి (నవ్వుతూ). హీరో రామ్‌తో నటించడం మంచి అనుభవం. మా కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది. మాస్ ఎలిమెంట్స్, ఫైట్స్‌ని అద్భుతంగా చూపించడం బోయపాటి మార్క్. ఆ మార్క్‌లోనే రూపొందిన ఈ సినిమాని అందరూ ఎంజాయ్ చేయవచ్చు' అని తెలిపారు.

ఓ సామాన్యుడి పోరాటం..


విరాట్ కర్ణ

విరాట్ కర్ణ హీరోగా డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. 'అఖండ'తో బ్లాక్‌బస్టర్‌ను అందించిన ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో హీరో విరాట్ కర్ణ మీడియాతో ఈ చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు. 'మొదటి నుంచి సినిమాలపై ఆసక్తి ఉంది. కాలేజ్ పూర్తయిన తర్వాత 'జయ జానకీ నాయక' చిత్రానికి ప్రొడక్షన్ సైడ్ పని చేశాను. నటనలో సత్యానంద్ దగ్గర శిక్షణ తీసుకున్న తర్వాత ఒక షార్ట్ వీడియో చేసి మా బావకి చూపించాను. అది ఆయనకి చాలా నచ్చింది. ఇందులో యాక్షన్ అంతా నేచురల్‌గా కావాలి. వీధిలో ఒక గొడవ జరిగితే ఎలా ఉంటుందో అంత సహజంగా ఉండాలి. ట్రైలర్‌లో చూస్తే కూడా రా అండ్ రస్టిక్‌గా ఉంటుంది. పీటర్ హెయిన్స్ అద్భుతమైన యాక్షన్ డిజైన్ చేశారు. ఒక సామాన్యుడు అనేక సవాళ్ళని ఎదుర్కొని బలవంతుడితో పోరాడి ఎలా ఎదిగాడనేది పెదకాపు కథ. 1980లో ఎన్టీఆర్ పార్టీ పెట్టినపుడు కూడా అందరూ కొత్తవాళ్ళని తీసుకున్నారు. అలా ఒక సామాన్యుడు ఎదిగిన క్రమాన్ని చూపించడానికి కొత్తవాడైతే బావుంటుందని నన్ను ఎంపిక చేసుకున్నారు. స్క్రీన్ పై నన్ను నేను చూసుకోవడం మాటల్లో చెప్పలేని ఆనందం కలిగింది' అని చెప్పారు.

'మనం' లాంటి మరో అరుదైన సినిమా


హర్షవర్ధన్, సుధీర్‌బాబు, రామ్మోహనరావు

హర్షవర్ధన్ దర్శకత్వంలో సుధీర్ బాబు నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మామ మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పి పై నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను అగ్రకథానాయకుడు మహేష్ బాబు లాంచ్ చేశారు. "మామా మశ్చీంద్ర' ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది. ట్రైలర్ బ్లాస్ట్‌గా ఉంది! సుధీర్ బాబు, టీమ్‌కి ఆల్ ది బెస్ట్' అని మహేష్ బాబు తెలిపారు.

ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సుధీర్ బాబు మాట్లాడుతూ, 'ఈ సినిమా నిర్మాతలకు మంచి రిటర్న్ ఇస్తుందనే నమ్మకం ఉంది. హర్ష రైటింగ్‌కి నేను అభిమానిని. 'మనం' చూసినప్పుడు అరుదైన సినిమాగా ఎలా ఫీలయ్యారో ఈ సినిమా చూసినప్పుడు కూడా ఆలాంటి అరుదైన అనుభూతి కలుగుతుంది. ఇందులో నాది ట్రిపుల్ రోల్. పరశురాం, దుర్గ, డిజేగా కనిపిస్తా. నా కెరీర్‌లో చాలా వైవిధ్యమైన సినిమా ఇది. ఇందులో పాత్రలకు అందరూ కనెక్ట్ అవుతారు. కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా ఇది. కొత్తరకం కథ.. కొత్తగా తీశారని ఫీలౌతారు' అని అన్నారు

'నా జీవితంలో విడుదల కాబోతున్న మొట్టమొదటి సినిమా. పాతికేళ్ళుగా ఈ టర్నింగ్ పాయింట్ కోసం ఎదురుచూస్తున్నాను. ఇందులో ప్రతి సన్నివేశంలో ఒక మలుపు, సర్ప్రైజ్ ఉంటుంది. ఖచ్చితంగా సినిమా ప్రేక్షకులని అలరిస్తుంది. ఇది మన అందరి కథ. 'మనం' రచయితగా మీ అందరి ప్రేమ అభిమానం పొందాను. ఖచ్చితంగా మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను' అని దర్శకుడు హర్షవర్ధన్ చెప్పారు. నిర్మాత పుస్కూర్ రామ్ మోహన్ మాట్లాడుతూ, 'ఇది చాలా డిఫరెంట్ మూవీ. హర్ష వర్ధన్ ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమాని అద్భుతంగా మలిచారు. ఈ సినిమా తప్పకుండా సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని తెలిపారు.

నా కథలో కల్పితాలు వద్దని చెప్పా


ముత్తయ్య మురళీధరన్

భాషలకు, దేశాలకు అతీతంగా తన ఆటతో కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న లెజెండరీ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్.

ఆయన జీవితం ఆధారంగా రూపొందిన సినిమా '800'. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్ ఆయనే. ఆ రికార్డును గుర్తు చేసేలా టైటిల్ పెట్టారు.

ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. శ్రీదేవి మూవీ పిక్చర్స్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో అక్టోబర్ 6న ఈ సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముత్తయ్య మురళీధరన్ ముచ్చటించారు. ఆ విశేషాలు... నా జీవితాన్ని సినిమా తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. కొన్ని కారణాల వల్ల దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమా చేయలేదు. శ్రీపతితో స్క్రిప్ట్ ఫినిష్ చేయమని చెప్పా. తర్వాత విజయ్ సేతుపతి హీరోగా సురేష్ ప్రొడక్షన్స్ సినిమా చేయాలని ప్లానింగ్ జరిగింది. అప్పుడు ఏమైందో అందరికీ తెలుసు. నాతో పాటు చాలా రోజులు ట్రావెల్ చేసిన, నా గురించి బాగా తెలిసిన, స్క్రిప్ట్ రాసిన శ్రీపతిని డైరెక్ట్ చేయమని చెప్పా. తర్వాత విజయ్ సేతుపతి ప్లేస్‌లో మధుర్ మిట్టల్ వచ్చారు. సినిమా పూర్తైన తర్వాత శ్రీదేవి మూవీస్ శివలెంక కృష్ణప్రసాద్ ముందుకు వచ్చారు. నా జీవితంలో ఎత్తుపల్లాలు ఎలా అయితే ఉన్నాయో... ఈ సినిమాను అక్టోబర్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని నిర్ణయించడం వెనుక అదే విధంగా ఎత్తుపల్లాలు ఉన్నాయి. సినిమాలో నిజంగా జరిగిన కథ మాత్రమే ఉండాలని దర్శకుడికి షరతు విధించా. నిజమైన కథ లేకపోతే అది బయోపిక్ కాదు. నా జీవితమే సినిమాలా ఉంటుంది. మంచి, చెడుతో పాటు చాలా విషయాలు జరిగాయి. ఇందులో నో ఫిక్షన్! ఈ సినిమాలో క్రికెట్ 20 శాతమే ఉంటుంది. మిగతా 80 శాతం అంతా నా లైఫ్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా తమిళ, తెలుగు, హిందీ, సింహళీ భాషల్లో విడుదల అవుతోంది.



ఆందోళనకరమే

అసమానతలు పెరుగుతాయి

ద్రవ్యలోటు అదుపు తప్పుతుంది

ప్రజల్లో పొదుపు తగ్గి, అప్పులు పెరగడంపై ఆర్థికవేత్తలు

ప్రభుత్వం విదేశీ రుణాలపై ఆధారపడాల్సి వస్తుంది

న్యూఢిల్లీ : దేశంలో కుటుంబ పొదుపు తగ్గడం, అదే సమయంలో రుణభారం పెరగడంపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కుటుంబ నికర పొదుపు గడచిన దశాబ్దాలలో ఎన్నడూ లేనంతగా 5.1శాతంకు పడిపోయింది. అదే సమయంలో కుటుంబ రుణభారం జీడీపీలో 5.8% పెరిగింది. 2021-22లో ఈ రుణభారం పెరుగుదల 3.8శాతం మాత్రమే.

కుటుంబ పొదుపు తగ్గిపోతుండడంపై ఆర్థికవేత్తలు ఆందోళన పడుతుంటే ఖఅందులో అర్థమే లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ కొట్టిపారేస్తోంది. నివాస గృహాలు, వాహనాల కొనుగోలు కోసమే ప్రజలు అప్పులు చేస్తున్నారని, అందుకే పొదుపు తగ్గుతోందని, ఇది అందోళనకు కాకుండా ఆత్మ విశ్వాసానికి సూచిక అని చెబుతోంది. దేశం ఆర్థికంగా బలోపేతం కావాలంటే కుటుంబ, ప్రభుత్వ, కార్పొరేట్ వ్యాపార రంగాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కుటుంబ రంగానికి సంబంధించి ప్రజలు స్వాభావికంగా తాము అప్పు చేసే మొత్తం కంటే పొదుపు చేసే మొత్తమే ఎక్కువగా ఉండాలని కోరుకుంటారు. పొదుపు చేసే సొమ్ముతో పెట్టుబడులు పెడతారు. ఇతరులకు అప్పులు ఇస్తారు. భవిష్యత్ అవసరాల కోసం మూలధనాన్ని సమకూర్చుకుంటారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వ, కార్పొరేట్ వ్యాపార రంగాలు తమ కార్యకలాపాలలో పెట్టుబడుల కోసం అప్పులు చేస్తుంటాయి. దీనివల్ల ద్రవ్య లోటు ఏర్పడుతుంది.

ప్రజల పొదుపే ప్రభుత్వానికి ఆధారం

ప్రజల్లో పొదుపు తగ్గి, అప్పులు పెరగడంపై ప్రధాని ఆర్థిక సలహా మండలి మాజీ ఛైర్మన్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సి.రంగరాజన్, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ మాజీ డైరెక్టర్, గౌరవ ప్రొఫెసర్ డీకే శ్రీవాత్సవ ఏమంటున్నారంటే...అప్పులు పెరగడం వల్లనే ఆస్తుల నికర విలువ తగ్గిపోతుంది. అప్పులు ఎందుకు పెరుగుతాయన్న దానికి అనేక కారణాలు చెబుతుంటారు. ప్రజల్లో స్థిరత్వం తక్కువ. వారు చంచల స్వభావులు. అందుకే ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. దాని ఫలితంగా వారి నికర పొదుపు తగ్గిపోతోంది. ఇక్కడ కుటుంబ ఆస్తులు అంటే బ్యాంక్ డిపాజిట్లు, నగదు, ఈక్విటీ పెట్టుబడులు. అప్పులు చెల్లించిన తర్వాత, కుటుంబ అవసరాల కోసం ఖర్చు పెట్టిన తర్వాత మిగిలినవే ఆస్తులు. వీటి పైనే భారత ప్రభుత్వం ఆధారపడుతుంది. మౌలిక సదుపాయాలు, యంత్రాలు, పరికరాలు వంటి భౌతిక ఆస్తుల మూలధనపు పెట్టుబడిగా ప్రజల ఆస్తులను ఉపయోగించుకుంటుంది.

ఎంత వరకు ఉండవచ్చు ?

ప్రజలు తక్కువ మొత్తంలో పొదుపు చేస్తే ఆర్థిక వ్యవస్థకు సమస్యలు ఎదురవుతాయి. జీడీపీలో ప్రజల పొదుపు 7శాతం, విదేశాల నుంచి లభించే వనరులు 2.5%, కేంద్ర రాష్ట్రాల ద్రవ్య లోటు కలిపి 6శాతం వరకూ ఉంటే వాటిని ఆమోదయోగ్యమైన స్థాయిలుగా పరిగణిస్తారు. జీడీపీలో అప్పులు 9.5శాతం ఉండవచ్చు. దీనిలో ప్రభుత్వ అప్పులు 6శాతం, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులు 1-1.5శాతం, ప్రయివేటు కార్పొరేట్ రంగం అప్పులు 2-2.5శాతం ఉండవచ్చు. అయితే ప్రజల పొదుపు రేటు శాశ్వతంగా 5శాతంకు పడిపోతే అది 6శాతంగా ఉండాలన్న నిబంధనను పాటించడం సాధ్యం కాదు. ఈ పరిస్థితి బడ్జెట్లపై ఒత్తిడి పెంచుతుంది. దీనిని నివారించాలంటే ద్రవ్యలోటును తగ్గించాల్సిన అవసరం ఉన్నదని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు.

యాక్సిస్ బ్యాంక్ ఆర్థికవేత్త సౌగత భట్టాచార్య కూడా కుటుంబ పొదుపు వేగం పుంజుకోకపోవడం ఆందోళనకరమేనని చెప్పారు. దేశీయ పొదుపు సరిగా లేకపోతే విదేశీ పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుందని, ఇది అస్థిరతకు దారి తీస్తుందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.1శాతం జీడీపీ వృద్ధి సాధించాలంటే ప్రభుత్వం పెట్టుబడి వ్యయాన్ని పెంచాల్సి ఉంటుంది. అంతే తప్ప కేవలం ప్రైవేటు వినియోగంపై ఆధారపడడం సబబు కాదు. ఆస్తులు తగ్గి, అప్పులు పెరగడం అసమానతలకు దారితీస్తుంది. ప్రజలు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తున్నారని ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఆర్థికవేత్త రూపా రేగే నిత్సూర్ వ్యాఖ్యానించారు. దీనివల్ల ఆదాయాల్లో పెరుగుదల ఉండదని, అదే సమయంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుందని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

రాజకీయ కక్షలు మంచిది కాదు

- చంద్రబాబు అరెస్టును ఖండించిన మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ కక్షలు మంచిది కాదని పేర్కొన్నారు. అలాగే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కారణం లేకుండా ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టడం మంచిది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అధికారుల నిర్వాకం

బెయిల్ వచ్చినా మూడేండ్లు జైలులోనే

- ఆర్డర్ ఈ-మెయిల్‌ను ఓపెన్ చేయటంలో ఆఫీసర్లు విఫలం
- గుజరాత్ వ్యక్తికి ఎదురైన అనుభవం
- రూ. 1 లక్ష పరిహారం చెల్లించాలని
- రాష్ట్ర ప్రభుత్వానికి డివిజన్ బెంచ్ ఆదేశం

గాంధీనగర్ : అధికారుల నిర్వాకంతో ఒక వ్యక్తికి బెయిల్ వచ్చినా మూడేండ్ల పాటు జైలులోనే కొనసాగాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఘటన గుజరాత్‌లో చోటు చేసుకున్నది. 2020 సెప్టెంబరులో ఒక దోషికి బెయిల్ లభించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రీ జైలు అధికారులకు బెయిల్ ఆర్డర్‌ను ఈ-మెయిల్ అటాచ్‌మెంట్‌గా పంపారు. అయితే, జైలు అధికారులు మాత్రం దానిని ఆ సమయంలో ఓపెన్ చేయలేకపోయారు. దీంతో బెయిల్ పొందిన వ్యక్తి చందన్‌జీ ఠాకోర్ జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై జస్టిస్ ఎ.ఎస్ సుపెహియా, జస్టిస్ ఎంఆర్ మెంగ్డేలతో కూడిన డివిజన్ బెంచ్ స్పందించింది. చందన్‌జీ ఠాకోర్‌కు రెండు వారాల్లోగా రూ. 1 లక్ష పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఏపీపై చర్యలు తీసుకోండి

- సీడబ్ల్యూసీకి సర్కారు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తమ అభ్యంతరాలను ఏపీ పట్టించుకోవడం లేదంటూ కేంద్ర జల సంఘానికి(సీడబ్ల్యూసీ) రాష్ట్ర సాగునీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్ లేఖ రాశారు. పోలవరం బ్యాక్ వాటర్ మూలంగా తెలంగాణలో 954 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని తెలియజేశారు. తొమ్మిది అంశాల్లో ఒక్కదానిపై ఏపీ చర్యలు తీసుకోలే దని ఈఎన్‌సీ లేఖలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) నుంచి సమన్వయం లోపం ఉందని వ్యాఖ్యానించారు. ఈ సంగతిని సుప్రీంకోర్టులో కేంద్రం నివేదించినట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. సీడబ్ల్యూసీ, పీపీఏ భేటీల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో తక్షణమే చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీకి విజ్ఞప్తి చేసింది.

సివిల్ సర్వెంట్లు ఆదేశాలను పాటిస్తలేరు

- పిటిషన్‌ను తక్షణమే వినండి
- సుప్రీంకోర్టును కోరిన ఢిల్లీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : ఢిల్లీలో బ్యూరోక్రాట్ల పోస్టింగ్‌లు, బదిలీలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా జాబితా చేయాలని ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఈ కేసును విచారణ చేయాలని తెలిపింది.

ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డి.వై చంద్రచూడ్, న్యాయమూర్తులు జె.బి పార్థివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. " నేను ఢిల్లీ ప్రభుత్వ పాలన వేదనను వ్యక్తపర్చలేను. సివిల్ సర్వెంట్లు ఆదేశాలను పాటించటం లేదు" అని న్యాయవాది తెలిపారు. అయితే పాత రాజ్యాంగ ధర్మాసనానికి సంబంధించిన అంశాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తులు చెప్పారు. షాదన్ ఫరాసత్‌ను నోడల్ కౌన్సెల్‌గా నియమిస్తామని తెలిపారు. నాలుగు వారాల్లో సమర్పణలు సిద్ధం చేసుకోవాలనీ, ఆ తర్వాత మీరు(ఢిల్లీ ప్రభుత్వం) దాని జాబితా కోసం మెన్షన్ చేయొచ్చని న్యాయమూర్తులు స్పష్టం చేశారు.

ప్రభుత్వంలో పనిచేస్తున్న బ్యూరోక్రాట్‌ల బదిలీలు, పోస్టింగ్‌లను నిర్వహించే అధికారాన్ని రూపొందించడానికి కేంద్రం ఈ ఏడాది మే 19న నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) ఆర్డినెన్స్‌ను ప్రకటించింది. దేశ రాజధానిలోని అక్కడి ప్రభుత్వం (ఆప్ సర్కారు)కు పబ్లిక్ ఆర్డర్, పోలీసు, భూమి మినహా అన్ని విభాగాల్లోని బ్యూరోక్రాట్‌లపై శాసనాధికారం ఉన్నదని పేర్కొంటూ మే 11న ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును ఈ ఆర్డినెన్స్ రద్దు చేసింది.

గత నెలలో ఢిల్లీ గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ (సవరణ) బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాత బిల్లు చట్టంగా మారి అధికారాలు లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) ద్వారా కేంద్రం చేతిలోకి వెళ్లిన విషయం విదితమే. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నిక కాబడిన ప్రభుత్వం నుంచి అధికారాలు లాక్కోవటం ఏమిటనీ కేంద్రం తీరుపై ఢిల్లీలోని అధికార ఆప్‌తో సహా దేశంలోని ఇతర పార్టీలు సైతం ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఆదివాసీల సర్నా కోడ్‌ను గుర్తించాలి

ప్రధాని మోడీకి జార్ఖండ్ సిఎం సోరెన్ లేఖ

రాంచి : గిరిజనులకు సర్నా మతపరమైన కోడ్‌ను గుర్తించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీకి జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం మూడు పేజీల లేఖ రాశారు. గత ఎనిమిదేళ్ళలో రాష్ట్రంలో గిరిజనుల జనాభా 38శాతం నుండి 26శాతానికి క్షీణించిందని సోరెన్ ఆ లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూళ్ళ కింద గిరిజనుల అభివృద్ధి కోసం రూపొందించే విధానాలపై గిరిజనుల జనాభా తగ్గడమనేది ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. గిరిజనుల ప్రయోజనాల కోసం సర్నా ధర్మ కోడ్‌ను ఆమోదించాల్సిందిగా ఆయన ప్రధానిని కోరారు.

గిరిజన సమాజానికి చెందినవారు ప్రాచీన సంప్రదాయాలను అనుసరిస్తూ ప్రకృతిని ఆరాధిస్తారని, చెట్లు, కొండలు, అడవులను పూజిస్తూ వాటిని పరిరక్షిస్తూ, వాటినే మతంగా భావిస్తారని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో దాదాపు 12కోట్ల మంది గిరిజనులు వున్నారు, అందులో జార్ఖండ్‌లో కోటికిపైగా గిరిజనులు వున్నారని అన్నారు. "జార్ఖండ్‌లో మెజారిటీ జనాభా సర్నా మతాన్ని అనుసరిస్తారు. ఈ పురాతన మతమైన సర్నాకు సజీవంగా వున్న గ్రంథాలంటే అవి నీరు, నేల, అడవి, ప్రకృతినే. ప్రస్తుతమున్న మతాలకు భిన్నంగా సర్నా మత ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆరాధనా పద్ధతులు వుంటాయి. ప్రకృతి ఆధారంగా ఆదివాసీల సంప్రదాయ మత అస్తిత్వాన్ని పరిరక్షించాలనే ఆందోళన కచ్చితంగా తీవ్రమైన సమస్యగా వుంది. ప్రకృతిని ఆరాధించే ఈ ఆదివాసీల కమ్యూనిటీ తమ గుర్తింపు గురించి ధీమాగా వుండగలిగేలా సర్నా మత పరమైన కోడ్‌ను గుర్తించాలనే డిమాండ్ తలెత్తింది." అని సోరెన్ పేర్కొన్నారు. కేవలం జార్ఖండ్‌లోనే కాదు, యావత్ దేశంలోని గిరిజన కమ్యూనిటీ కూడా అనేక సంవత్సరాలుగా తమ మత అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాడుతున్నాయని సోరెన్ చెప్పారు. జనాభా లెక్కల్లో సర్నా మతాన్ని అనుసరించే వారినికూడా చేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారన్నారు. కొన్ని సంస్థలు ఏకరూప పౌరు స్మృతి కోసం డిమాండ్ చేస్తున్నపుడు, గిరిజనులు-సర్నా కమ్యూనిటీ డిమాండ్‌పై సానుకూల చొరవ కూడా కచ్చితంగా అవసరమే. ఆదివాసీల జనాభాలో ఇటువంటి అనేక గ్రూపులు అంతరించి పోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని మీకు తెలుసు, అటువంటపుడు సామాజిక న్యాయం సూత్రంపై వారిని రక్షించకపోతే ఇక వారి భాష, సంస్కృతి, అన్నీ కూడా అంతమైపోయే ప్రమాదముందని ఆ లేఖలో సొరేన్ ఆందోళన వ్యక్తం చేశారు.


ఇల్లందు 'కారు'లో పోరు

బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియపై అసమ్మతి

- ఆమెను ఓడించి తీరుతామంటున్న వ్యతిరేకులు
- ఎమ్మెల్యే భర్త హరిసింగ్ షాడో వ్యవహారాలపై ఆగ్రహం

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థులు కొందరికి అసమ్మతి సెగ తాకుతోంది. అభ్యర్థులను మార్చకపోతే సపోర్టు చేసేది లేదంటూ అక్కడక్కడ నిరసన గళం విప్పుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల వ్యవహారంపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటుకు పూనుకుంటున్నారు. ముందుగా అభ్యర్థులను ప్రకటించి జోష్ మీదున్న బీఆర్ఎస్ పెద్దలకు స్థానికంగా అభ్యర్థులపై వ్యతిరేకత ఓ తలనొప్పిగా మారింది. అసమ్మతి గళం విప్పుతున్న నియోజకవర్గాల్లో ఒకటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు. ఇక్కడి ఎమ్మెల్యే హరిప్రియనాయక్‌పై అసమ్మతి ఫైరవుతోంది. ఆమె భర్త వ్యవహార శైలిపై మొదటి నుంచి సొంత పార్టీ నేతల నుంచి అభ్యంతరాలున్నాయి. ఆయనో షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తూ 'కారు'చిచ్చుకు కారణమవుతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు ఇంత





తెలిసినా అధిష్టానం హరిప్రియ అభ్యర్థిత్వాన్నే ఖరారు చేయడంపై అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి.

భర్త షాడో ఎమ్మెల్యేలా..!

కాంగ్రెస్ పార్టీని వీడి హరిప్రియ కారు పార్టీలో చేరినప్పుడే వచ్చేసారి కూడా తనకు టికెట్ ఇవ్వాలని ఒప్పందం చేసుకొని మరీ బీఆర్ఎస్‌లో చేరారని టాక్. ఆ తర్వాత నుంచి ఆమె భర్త హరిసింగ్ అన్నీ తానై నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారని, ఒక విధంగా చెప్పాలంటే ఆయన షాడో ఎమ్మెల్యేలా ఉన్నారని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మెన్ కావడంతో అప్పటి నుంచి నియోజకవర్గంలో హరిసింగ్ దూకుడు పెంచారని టాక్.

ఎమ్మెల్యే భర్తకు ఎవరైనా నచ్చకపోతే ఆ నేత విషయంలో ఎందాకైనా వెళ్తారనే గుసగుసలు ఆపార్టీలో వినిపిస్తున్నాయి. టేకులపల్లి మండలానికి చెందిన లక్కీనేని సురేందర్‌కు మండలంలో మంచి పట్టుంది. ఆయన ఆధిపత్యాన్ని ఎలాగైనా తగ్గించాలని కేసులు పెట్టి వేధించటంతో ఆయన జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య వెంట వెళ్ళారు. మరో నేత సత్యనారాయణ కూడా కనకయ్య చెంతకే చేరారు. ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, ఎమ్మెల్సీ తాత మధు వెంట నడుస్తున్నారని సొంతపార్టీ కౌన్సిలర్ల చేత చైర్మెన్‌పై తిరుగుబాటు చేయించేందుకు ప్రయత్నించారని తెలిసింది. కొందరు కౌన్సిలర్లతో కలిసి చైర్మన్‌పై తీవ్ర ఆరోపణలు చేసినట్టు వార్తలు వచ్చాయి. మున్సిపాలిటీలో మరోనేత పులిగల్ల మాధవరావు ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. అలాగే గార్ల, బయ్యారం, టేకులపల్లి, కామేపల్లి, ఇల్లందు మండలాల్లో కీలక నేతలుగా ఉన్న దుర్గాప్రసాద్, మధుకర్ రెడ్డి, నలమాస రాజన్న, మూడు కృష్ణప్రసాద్ గతంలో బహిరంగ వ్యాఖ్యలు చేయడంతో నియోజకవర్గంలో రాజకీయ దుమారం రేగింది. అయినా ఎమ్మెల్యే భర్త వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని అసమ్మతి నేతలు చెబుతున్నారు. పార్టీ అధిష్టానానికి హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని మొరమెట్టుకున్నారు.

బుజ్జగింపు ప్రయత్నమూ లేదు..

ఎమ్మెల్యే హరిప్రియకు టిక్కెట్ ఇచ్చి నెలరోజులు అవుతున్నా ఆమె అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నం చేయలేదు. ఇటీవల ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమించారు. ఆయన ఇటీవల కార్ల ర్యాలీతో ఇల్లందుకు వెళ్ళారు. అసమ్మతి నేతలు ఎవరూ ఆ ర్యాలీలో పాల్గొనలేదు. ఆ తర్వాత అసమ్మతి నేతల్లో కీలకంగా ఉన్న ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుతో ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో రాజీ కోసం సమావేశమయ్యారు. అక్కడ చైర్మెన్, ఎమ్మెల్యే భర్త మధ్య మాటలయుద్ధం జరగడంతో చర్చలు అర్ధంతరంగా ముగిసినట్టు తెలిసింది. తాజాగా అసమ్మతి శిబిరంలోకి ఇల్లందు మున్సిపల్ వైస్‌చైర్మెన్ జానీపాషా చేరటంతో ఎమ్మెల్యే శిబిరంలో వణుకు ప్రారంభమైంది. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే హరిప్రియ దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకరిద్దరు కావాలనే తనపై, తన భర్తపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి పనులు చేశానని, అవే తన గెలుపునకు బాటలు వేస్తాయని హరిప్రియ విశ్వాసంతో ఉన్నారు. అసమ్మతి నేతలు మాత్రం ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినా.. ఆమెకు బీ ఫామ్ రాకుండా ఉమ్మడి జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి సహాయంతో పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. చివరికి అసమ్మతి పైచేయి సాధిస్తుందా? హరిప్రియ నెగ్గుకొస్తుందా? చూడాలి.

కారును పోలిన గుర్తులను కేటాయించొద్దు

కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారును పోలిన గుర్తులను ఇతరులకు కేటాయించవద్దని ఆ పార్టీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) విజ్ఞప్తి చేశారు. కారుకు దగ్గరిగా ఉన్న సింబల్స్‌తో బీఆర్ఎస్ అభ్యర్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఇది ప్రజా తీర్పుకు వ్యతిరేకమైందని వివరించారు. బుధవారం నాడిక్కడ నిర్వచన్ సదన్‌లో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భారత్, ఎంపీలు వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్ రెడ్డిలు కేంద్ర ఎన్నికల అధికారులతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గుర్తింపు పొందని ఒక పార్టీకి కేటాయించిన రోడ్ రోలర్ సింబల్‌ను రద్దు చేయాలని, అలాగే కారుకు దగ్గరగా ఉన్న కెమెరా, రోటి మేకర్, టెలివిజన్ గుర్తులను ఎవరికీ కేటాయించవద్దని వేరు వేరుగా రెండు అప్లికేషన్లను అధికారులకు సమర్పించారు. అనంతరం సోమ భారతి, ఎంపీలు వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కారును పోలిన గుర్తులతో ఓటర్లను పక్కదారి పట్టించేలా కొన్ని ప్రజాస్వామిక వ్యతిరేక శక్తులు పని చేస్తున్నాయని ఆరోపించారు. వద్దులు, మరికొందరు కారు గుర్తని భావించి, రోడ్ రోలర్ కు ఓటు వేస్తున్నారన్నారు. దీని కారణంగా బీఆర్ఎస్ అభ్యర్థులు పలు చోట్ల ఓటమిపాలయ్యారని గుర్తు చేశారు. రోడ్ రోలర్ గుర్తును గుర్తింపు పొందని పార్టీకి మళ్లీ కేటాయించడం ఎలక్షన్ సింబల్స్ అలాట్మెంట్ అండ్ రిజర్వేషన్ ఆర్డర్ -1968 లోని కాంటరరీ టూ ది 10 బి కి విరుద్ధం అన్నారు. అందులో 2011 లో రోడ్ రోలర్ సింబల్ ని కేంద్ర ఎన్నికల తొలగించిందన్నారు. మళ్లీ ఈ సింబల్ ని ఒక పార్టీకి ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే ఆ సింబల్ ను ఆ పార్టీకి రద్దు చేయడంతో పాటు, మరెవరికీ ఈ సింబల్ కేటాయించవద్దని కోరామన్నారు. రోటి మేకర్, టెలివిజన్, కెమెరా... కారుకు చాలా దగ్గరి పోలికలతో ఉన్నాయన్నారు. వీటి ద్వారా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి జరిగిన నష్టాన్ని ఓటింగ్ శాతంతో సహా సమర్పించినట్లు తెలిపారు. తమ అభ్యర్థనలపై ఎన్నికల సంఘం అధికారులు క్షుణ్ణంగా తెలుసుకున్నారని, వీటిపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పారు.


చంద్రబాబు పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ అక్టోబర్ 3కు వాయిదా పడింది. చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సరస వెంకటనారాయణ భట్టి ధర్మాసనం తొలుత విచారణ మొదలుపెట్టింది. అయితే విచారణ నుంచి జస్టిస్ భట్టి తప్పుకున్నారు. దీంతో కేసులు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఎదుట మెన్షన్ చేసే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా కోరారు. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ధర్మాసనం ఎదుట మెన్షన్ చేశారు. మెన్షన్ చేసే సందర్భంలో స్వల్ప వాదనలు జరిగాయి. న్యాయవాది లూథ్రా వాదనలను ప్రభుత్వ లాయర్లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. చంద్రబాబు బెయిల్ కోరుకుంటున్నారా? అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. తాము బెయిల్ కోరుకోవడం లేదని లూథ్రా తెలిపారు. త్వరగా లిస్ట్ చేయాలన్నది మా మొదటి అభ్యర్థన అని, మధ్యంతర ఉపశమనం కలిగించాలనేది రెండో అభ్యర్థన అని అన్నారు. సెక్షన్ 17 ఏ అనేది కేసు మూలాల నుంచి చర్చించాల్సిన అంశమని, ఎఫ్ఐఆర్ ప్రకారం చంద్రబాబును కస్టడీలో పెట్టకూడనటువంటి కేసు ఇది అని అన్నారు. జెడ్ కేటగిరీ, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న వ్యక్తిని ఇలానే ట్రీట్ చేస్తారా? ఇది పూర్తిగా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయమని తెలిపారు. యశ్వంత్ సిన్హా కేసులో వ్యక్తి స్వేచ్ఛపై అన్ని విషయాలు పొందుపరిచారని తెలిపారు. పోలీసులు కస్టడీ అడుగుతున్నారని, దాని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇదిలావుండగా తగిన ధర్మాసనం ఎదుట కేసును బదిలీ చేసి అక్టోబర్ 3న తదుపరి విచారణ చేపట్టనున్నట్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వెల్లడించారు.

కాశ్మీర్ ఆపరేషన్‌పై తప్పుడు ప్రచారం

- సోషల్ మీడియాను ఉపయోగించుకున్న ఆర్మీ
- అయినా చర్యలకు వెనకాడిన మెటా ఇండియా
- వాషింగ్టన్ పోస్ట్ కథనం



వాషింగ్టన్ : కాశ్మీర్‌లో సైన్యం నేతృత్వంలో ఏడాది పాటు సాగిన తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవడంలో మెటా భారత్ బృందం తీవ్ర అలసత్వం వహించిందని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తాజాగా వెల్లడించింది. కంపెనీలోని మాజీ ఉద్యోగులను ఉటంకిస్తూ ఈ విషయం తెలిపింది. భారత సైనికాధికారులు ట్విట్టర్, ఫేస్‌బుక్ ప్రతినిధులను కలుసుకుని, పాకిస్తాన్ సాగించే తప్పుడు సమాచారం నెట్‌వర్క్‌లకు ప్రతిగా తాము ఈ ఆపరేషన్‌ను చేపట్టినట్లు పేర్కొంటూ తమ చర్యను సమర్థించుకున్నారని వాషింగ్టన్ పోస్ట్ తన వార్తా కథనంలో తెలిపింది. జమ్మూ కాశ్మీర్‌లోని భారత సైన్యం చినార్ కార్ప్స్ నేతృత్వంలో ఏడాది పాటు సైన్యం తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రచారం చేశాయని, అయినా వాటిపై ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా భారత బృందం చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆ వార్తా కథనం పేర్కొంది. జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ పెట్టిన పోస్టు కాశ్మీరీ జర్నలిస్టులను ప్రమాదంలో పడేసే తప్పుడు సమాచారమని ఆ నివేదిక పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో కృత్రిమంగా సందేశాలను పంపేలా నకిలీ ప్రొఫైల్స్, ఖాతాల నెట్‌వర్క్‌ను ప్రారంభించారంటూ మెటాకి చెందిన కోఆర్డినేటెడ్ ఇన్ ఆథెంటిక్ బిహేవియర్ (సిఐబి) బృంద సభ్యులను ఆ నివేదిక ఉటంకించింది. ఆర్మీ అధికారులు ట్విట్టర్, ఫేస్‌బుక్ ప్రతినిధులను కలసి ఈ సైనిక చర్యను బలపరచాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. చినార్ కార్ప్స్ చేపట్టిన ఆపరేషన్ గురించి ఫేస్‌బుక్‌కు చెందినకో-ఆర్డినేటెడ్ ఇనాథెంటిక్ బిహేవియర్ (సిఐబి) సభ్యులు భారత్‌లోని మెటా సిబ్బందిని హెచ్చరించినట్లు ఆ నివేదిక తెలిపింది. "తన నియంత్రణలోని భూభాగంలో సార్వభౌమాధి కార ప్రభుత్వం తీసుకునే చర్యలను వ్యతిరేకించరాదు." అంటూ హెచ్చరించింది. పైగా స్థానిక ఉద్యోగులను దేశద్రోహ నేరం కింద జైల్లో పెట్టే ప్రమాదముందంటూ ఆందోళన వ్యక్తం చేసిందని వాషింగ్టన్ పోస్ట్ తన వార్తా కథనంలో పేర్కొంది. శ్రీనగర్ ప్రధానకేంద్రంగా పనిచేసే మీడియా సంస్థ ది కాశ్మీరియత్, దాని సంపాదకుడు క్వాజి షిబ్లిని లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ జరిగినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయంగా అన్ని దేశాల్లో విస్తరించి వున్న కంపెనీగా, తాము మరింత సంక్లిష్టమవుతున్న వాతావరణంలో పనిచేస్తున్నామని, అయినా, ఆయా ప్రాంతాల్లో వర్తించే చట్టాలు, మానవ హక్కుల నిబంధనలకు అనుగుణంగా వుండేలా తమ ఉద్యోగుల భద్రతకు హామీ కల్పిస్తూ తమ సేవలను ఉపయోగించుకునే వారి భద్రతపై కూడా దృష్టి పెడతామని మెటా ఒక ప్రకటనలో పేర్కొంది. తమ వేదికలపై సిఐబిని నిషేధించామని తెలిపింది.

సోషల్ మీడియా సంస్థ భారత్‌లో ఈ విధంగా తప్పుడు ప్రచార నెట్‌వర్కులను తమ వేదికలపై అనుమతించడం ఇదే మొదటిసారి కాదు. 2020 లోనూ ఇలానే జరిగింది. తెలంగాణ బిజెపి ఎమ్మెల్యే టి రాజాసింగ్ మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యా వలసవాసులను తరిమేయాలంటూ సోషల్ మీడియా వేదికగా విషం వెళ్లగక్కితే అప్పుడూ మెటా భారత బృందం చేష్టలుడిగినట్లు వ్యవహరించింది.

'సాయుధ దళాల చట్టం' పొడిగింపు

- అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లో మరో ఆరు నెలలు
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ : వివాదాస్పద సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలలో పొడిగించబడింది. అక్టోబర్ 1 నుంచి మరో ఆరు నెలల పాటు ఇది అమలులో ఉండనున్నది.

ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం ఎనిమిది జిల్లాల్లో, నాగాలాండ్‌లోని మరో ఐదు జిల్లాల్లోని 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏఎఫ్ఎస్‌పీఏని మరో ఆరు నెలల పాటు పొడిగించినట్టు నోటిఫికేషన్ పేర్కొన్నది.

దిమాపూర్, నియులాండ్, చుమౌకెడిమా, మోన్, కిఫిర్, నోక్లాక్, ఫేక్, పెరెన్.. ఇలా ఎనిమిది జిల్లాలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇది కోహిమా జిల్లాలోని ఖుజామా, కోహిమా నార్త్, కోహిమా సౌత్, జుబ్జా, కెజోచా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో విస్తరించబడింది. ఈ వివాదాస్పద చట్టం గత కొంత కాలంగా ఈ రెండు రాష్ట్రాల్లోని ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులను బట్టి అధికారులు పొడిగిస్తూ వస్తున్నారు.

విద్యుత్ భారాలపై దద్దరిల్లిన కలెక్టరేట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళనలు
- కాకినాడలో అరెస్టులు, మహిళలనుఅసభ్యపదజాలంతో దూషించిన డిఎస్‌పి
- ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి : బివి రాఘవులు
- విద్యుత్ సంస్కరణల బిల్లుపై వైసిపి, టిడిపి వైఖరిని స్పష్టం చేయాలి : వి శ్రీనివాసరావు



విజయవాడ : విద్యుత్ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమించాయి. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ సర్దుబాబు సర్‌ఛార్జి, అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయవద్దని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐఎంల్ న్యూడెమోక్రసి, ఎస్‌యుసిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంపిసిపిఐ (యు) చేపట్టిన ఆందోళనలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. పలు జిల్లాల్లో ర్యాలీలు జరిగాయి. కాకినాడలో నిరసన తెలుపుతున్న వారిపై డిఎస్‌పి అసభ్యపదజాలంతో విరుచుకుపడడం, బలవంతంగా అరెస్టులకు పాల్పడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

నెల్లూరులో కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ విద్యుత్ ప్రయివేటీకరణను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారా రైతులు ఉచిత విద్యుత్ సాధించుకున్నారని తెలిపారు. విద్యుత్ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని పాలకులు చూస్తున్నారని, ప్రయివేట్ పెట్టుబడులకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వినియోగదారులపై మరింత భారాలు పడతాయని, రైతులకు ఉచిత విద్యుత్ అందదని, విద్యుత్ రాయితీలు రద్దవుతాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అడుగులకు మడుగులొత్తుతూ ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజలపై మోయలేదని భారాలు మోపుతున్నారని అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు.

విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల బిల్లుపై వైసిపి, టిడిపి తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగితే ఛార్జీలు తగ్గాలని, కానీ విద్యుత్ రంగంలో మాత్రం పెరుగుతున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలుపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు షాక్ ఇస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలూ రాజకీయంగా 'షాక్' ఇస్తారన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.ఖాదర్‌బాషా, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జి.ఓబులేసు, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలోని అంబేద్కర్ సెంటర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వామపక్ష శ్రేణులపై డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి అసభ్యపదజాలంతో విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా రెచ్చిపోయారు. నిరసన తెలుపుతున్న వారిలో కొందరిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి బలవంతంగా పోలీస్ వ్యాన్ ఎక్కించి స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో, మిగిలిన వారు ఈ వ్యాన్‌ను అడ్డుకున్నారు. వారిపైనా పోలీసులు జులుం ప్రదర్శించి అరెస్టులకు పాల్పడ్డారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న మహిళా నాయకులపైనా, కార్యకర్తలపైనా దురుసుగా వ్యవహరించారు. త్రీటౌన్ సిఐ భగవాన్ మహిళలను బలవంతంగా లాక్కెళ్లి పోలీసు వాహనంలో ఎక్కించారు. వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను మొత్తం 25 మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. విశాఖలో ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ధర్నా చేశారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అమలాపురం, ఏలూరు, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, కడప, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాలల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శ్యామలా సెంటర్‌లో, అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, మదనపల్లెలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట, అనంతపురంలోని పవర్ ఆఫీసు వద్ద, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్లో నిరసన తెలిపారు.